సమావేశము - II
వాల్యూం - I
నెం. 5

వెల : రూ. 48-00
14 ఫిబ్రవరి, 2024
బుధవారం

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజి. నెం.

1. 2024-2025 సంవత్సరానికిగాను వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్) (ఓట్ ఆన్ అకౌంట్) (కొనసాగింపు) ... 01

2. 2023-2024 సంవత్సరానికిగాను వ్యయపు అనుబంధ అంచనాలు (కొనసాగింపు) ... 01

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ ఎస్. దుర్గాప్రసాద్
		శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి
		శ్రీ ఇ. సంజీవరావు
సహాయ కార్యదర్శులు	:	శ్రీమతి బి. ప్రమీల
		శ్రీమతి ఎస్. నాగమణి
		శ్రీ డి. శ్రీనివాసులు
		శ్రీ ఎమ్. రఘుమారెడ్డి
		శ్రీ ఎ. సుధాకర్
		శ్రీ పి. శ్రీనివాస్
		శ్రీమతి ఎ. పద్మాసిని
		శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ
		శ్రీ ఎస్. సుజిత్ కుమార్
		శ్రీ కె. భాస్కర శ్రీనివాస్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వర రెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(3వ శాసన సభ)

(రెండవ సమావేశపు ఐదవ రోజు)

బుధవారం, ఫిబ్రవరి 14, 2024

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

(ఈ దశలో కోరం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు)

MR.SPEAKER:- Now I will take up the discussion on both the Annual Financial Statement (Budget) (Vote-on-Account) for 2024-25 and also the Supplementary Estimates of Expenditure for 2023-24 together. Today, we will take.......

(ఈ దశలో బీఆర్ఎస్ పార్టీ సభ్యులు సభకు తిరిగి వచ్చారు)

SRI T.HARISH RAO (Without Mike):- Government has failed to maintain the quorum. Finance Minister and all the Whips have failed. When we are cooperating, you should also cooperate with us. మీరు మైకు ఇచ్చి కోఆపరేట్ చేస్తే మేము కూడా చేస్తాము. గొంతునొక్కితే బయటకు పోవాల్సి వస్తుంది. అధ్యక్షా, మేము కోఆపరేట్ చేస్తున్నాము. మేము ఎంత సిన్సియర్‌గా కోపరేట్ చేస్తున్నామో దయచేసి అర్థం చేసుకోవాలి.

MR. SPEAKER:- Thank you Harish Rao Garu.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, రెండు విషయాలను తమరి దృష్టికి తీసుకొని రావాలనుకుంటున్నాను. శాసనసభ 10 గంటలకు మొదలుపెట్టాలని అనుకున్నప్పుడు కరెక్ట్‌గా 10 గంటలకే సభను ప్రారంభం చేయాలని దయచేసి సభాపతిగారిని కోరుతున్నాను. ఒక్కొక్కసారి 10 గంటల 5 నిమిషాలకు, 10 గంటల 10 నిమిషాలకు మొదలుపెడుతున్నందున దయచేసి ఇకముందు అలా జరగవద్దు. ఎందుకంటే కనీసం శాసనసభలోనైనా సమయపాలన ఉండాలి, జరగాలని నా కోరిక. రెండవది.. ఈరోజు బడ్జెట్‌పైన చర్చ ఉన్నందున తప్పకుండా శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుగారు కోరం ఉండేట్లు చూసుకోవాలి. గతంలో మేము ఏమి చేసేవాళ్లమంటే సభ్యులందరికి ముందుగానే ఫోన్లు చేసే వాళ్లము. ఈరోజు ముఖ్యమైన బిజినెస్ ఉన్నది, కోరం ఉండాలి.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- గౌరవ సీనియర్ శాసనసభ్యులు వివిధ స్థాయిలో ప్రభుత్వ పరంగా ఉన్నారు. ఈరోజు కావాల్సిన కోరం పూర్తి స్థాయిలో ఉన్నది. ప్రతిపక్షసభ్యులు బయటకు వెళ్లినప్పటికే కోరం ఉన్నది. నూటికి నూరు శాతం కోరం ఉన్నారు.

(ఈ దశలో బీఆర్ఎస్ సభ్యులు టి.హరీష్‌రావు.. 23మంది సభ్యులుండాలని అన్నారు)

Not 23, only 12 Members are required as a Quorum. 10 percent అయినా కూడా మా

సభ్యులు 18మంది ఉన్నారు. నేను ఆ రూల్ పొజిషన్ కూడా చూపిస్తాము. Page 8 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly book – "SITTINGS OF THE ASSEMBLY : The Quorum to constitute a sitting of the Assembly shall be one-tenth of the total number of the Members." But Sir, here we have 18 Members. This is unfair Sir. Hon'ble Members were here and వాళ్లంతటూ వాళ్లు ఈ సభ నడవద్దని, మేము మాట్లాడదల్చుకోలేదని బయటకు వెళ్లిపోయారు. మీరే ప్రత్యక్షంగా చూశారు. దయచేసి పెద్దలు కడియం శ్రీహరిగారిని కోరేదేమంటే, కోరంకు సంబంధించిన అంశం విషయానికి వస్తే సభ ప్రారంభమైన సమయానికి 18మంది శాసనసభ్యులు ఉన్నారు. వారు కావాలనుకొని బయటకు వెళ్లి వచ్చిన తర్వాత అధికారపక్షంలో కోరం ఉన్నది. Definitely, I will take it in a positive sense Sir. వారు చెప్పినట్లుగా రేపటి నుంచి మేము 40మంది సభ్యులను ఉంచే విధంగా ప్రయత్నం చేస్తాము.

శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్:- అధ్యక్షా, గౌరవ
10.10 లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్ గారు 12 మంది అన్నారు, వాళ్లే వారే రూల్స్ గురించి చదివిన తరువాత 10 శాతమన్నారు. ఇప్పటికీ వాళ్లు 14 మందే ఉన్నారు. ఇప్పుడు మా రిక్వెస్ట్ ఏమిటంటే, మేము హౌస్ నడవాలనే ఆలోచనతోనే పూర్తి స్థాయిలో కోఆపరేట్ చేస్తున్నాం. నిన్న కూడా మీరు హడ్రిబిడిగా అసెంబ్లీ పెట్టినా గాని శాసన సభ్యులు మాకు అవకాశమివ్వకుండా బుల్డోజ్ చేసినా గాని మేము కోఆపరేట్ చేస్తున్నాం. మేము ఏదో పనికిరాని రాజకీయాలు చేయాలి, బయటకు పోవాలనే ఆలోచన మాకు లేదు అధ్యక్షా. దయచేసి లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్ గారికి నా రిక్వెస్ట్ ఏమిటంటే..... (మైక్ కట్)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- Better Sir, I wish the House correct me. Sir, 10 percent అంటే ఎంతమంది వస్తారు సార్, 12 మంది వస్తారు 119 మంది సభ్యులకు. 119కి 12 మంది వస్తారు. Still we were 18 Members. సార్, 119కి 12 మంది వస్తారు. You know, హరీశ్‌రావు గారికి తెలుసు. తెలిసినా గాని కావాలనే వారు బుల్డోజ్ చేస్తుంటారు. ఆ ప్రశాంత్‌రెడ్డి గారిని కూడా అడగండి వారు కూడా లెజిస్లేటివ్ మినిస్టర్‌గా ఉన్నారు. 12 మంది శాసనసభ్యులే కోరం. పక్కన ఉన్న హరీష్ రావుగారికి కూడా తెలుసు, బుల్డోజ్ కావాలనే చేస్తుంటారు. నేను ఈరోజు గౌరవ మాజీ మంత్రి శ్రీనివాసయాదవ్ గారికి రూల్ కోట్ చేశాను సార్. 119కి 10 percent is 12 Members.

శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్:- శాసనసభ వ్యవహారాల మంత్రి గారిని కోరేది, మేమేదో ఇబ్బంది పెట్టాలనే ఆలోచన మాకు లేదండి. దయచేసి ఏందంటే, ఒకసారి కోరం లేదనే ఆలోచనతో మేము చెప్పినప్పుడు, తర్వాతైనా అటెన్షన్ ఉంటది. మీరే 12 మంది అంటున్నారు, మీరే 119 మంది అంటున్నారు. కోఆపరేట్ చేయాలనే ఆలోచనతోనే మేము వస్తున్నాం కదా.

శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి:- హౌస్‌లో ఎంఐఎం వాళ్లు ఉన్నారు కదా అధ్యక్షా. నేను పర్సనల్‌గా లెక్కపెట్టాను. 18 మంది సభ్యులు ఉన్న తర్వాత కూడా కావాలని చెప్పి ప్రజలకు తప్పుడు సమాచారం పోయే విధంగా అంత అనుభవమున్న హరీష్‌రావు లాంటి వారు కూడా మాట్లాడమనేది చాలా బాధాకరమైన విషయం.

శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్:- అభాసుపాలు చేయాలనే ఉద్దేశముంటే మేమెందుకు వస్తాము అధ్యక్షా? మా ఉద్దేశ్యం అది కాదు, పూర్తి స్థాయిలో కోఆపరేట్ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. మీ దృష్టిని ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో చెప్పిందే తప్ప ఏదో మిమ్ములను ఖాళీ కోరం లేదని బయటికి పోయినంత మాత్రాన అభాసుపాలవుతారని మేము అనుకోము కదా. దయచేసి పూర్తి స్థాయిలో కోఆపరేట్ చేస్తామని చెప్పి నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :- చాలా చాలా థాంక్స్. గౌరవ సభ్యులకు విజ్ఞప్తి, తొందరగా మనం ఈ డిస్కషన్ కంప్లీట్ చేసుకుందాం. చాలా మంది కొత్త సభ్యులున్నారు, వాళ్లందరికీ ఈరోజు జీరో

అవర్ ఇచ్చి వాళ్ల వాళ్ల నియోజకవర్గ సమస్యల గురించి చెప్పుకునే అవకాశం కల్పిద్దామని చెప్పి మీ అందరినీ కోరుకుంటూ,పెద్దలు కడియం శ్రీహరి గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా.... (మైక్ కట్)

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ దానం నాగేందర్ (మైక్ లేకుండా):- జీరో అవర్ టైమ్ చెప్పండి.

మిస్టర్ స్పీకర్:- టైమ్ అంటే, డిస్కషన్స్‌లో పాల్గొనే వారెవరైతే ఉన్నారో, వాళ్లు తొందర తొందరగా కంప్లీట్ చేస్తే మనం జీరో అవర్ తీసుకుందాం.

శ్రీ దానం నాగేందర్:- అధ్యక్షా, మేము ఎందుకు టైమ్ చెప్పమంటున్నామంటే ఈ డిస్కషన్ మొదలైనప్పుడు పది మంది మంత్రులు లేచి పది రకాలుగా మాట్లాడితే ఆ డిస్కషన్ లెంగ్తీగా పోతుంది. మీరు షార్ట్ డిస్కషన్ అన్నారు కాబట్టి, ఈ షార్ట్ డిస్కషన్‌లో ఫ్రూట్‌ఫుల్ డిస్కషన్ జరగాలి. ఫ్రూట్‌ఫుల్ డిస్కషన్‌లో మంత్రులు ఎవరైతే సమాధానం చెబుతారో చెప్పండి. ఎందుకంటే, ఈరోజు చాలా పెళ్లిళ్లు ఉన్నాయి, అందరి శాసనసభ్యులకు ప్రోగ్రామ్స్ ఉన్నాయి కాబట్టి ఆ టైమ్ లిమిట్ మీరు ఫిక్స్ చేసేయండి. We will also stick on to that timing, we will not drag the session. Definitely, we will cooperate. అలాగని దయచేసి చెప్పమనండి. మీరు కూడా రావాలి పెళ్లికి. థాంక్యూ సార్.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు శ్రీ కడియం శ్రీహరి గారు 30 నిమిషాలలో ముగించాలి.

శ్రీ కడియం శ్రీహరి:- బడ్జెట్ సార్ ఇది.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- తొందరగా కంప్లీట్ చేసుకుందామని మా నాగేందర్ గారే ఇప్పుడు చెప్పారు. ఇప్పుడు మీ మెంబర్స్‌కి తగ్గట్లు చెబుతున్నారు. సార్, బడ్జెట్‌కి సంబంధించిన అంశం వచ్చేసరికి వారు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని నోట్ చేసుకుంటాము. వారికి కూడా తెలుసు. నేను అదే అంటున్నాను, హరీష్‌రావు గారికి పూర్తి స్థాయిలో ప్రొసీజర్స్ తెలుసు. సార్, మీరు బీఆర్ఎస్‌కి సంబంధించి గౌరవ సభ్యులకు 30 నిమిషాలు మాట్లాడటానికి అవకాశమిచ్చారు. వారు 30 నిమిషాలు కాకుండా మీ అనుమతితో 5 నిమిషాలు ఎక్కువ మాట్లాడొచ్చు, కాని టైమ్ మీరు స్పెసిఫై చేయకుంటే... మొన్న హరీష్‌రావు గారు రెండున్నర గంటలు మాట్లాడారు. టైమ్ మెన్షన్ చేయకుండా ఉంటే ఆవిధమైన ప్రస్తావన వస్తుంది అధ్యక్షా. మీరు టైమ్ మెన్షన్ చేయండి, నిజంగా ఏమైనా ప్రస్తావనలు వస్తే తప్పకుండా స్వీకరించే అవకాశముంటుంది, తీసుకుంటాం కూడా.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు కడియం శ్రీహరి గారూ, మీరు మాట్లాడండి. టైమ్ ఎక్కువైనా తీసుకుందాం మీరు మాట్లాడండి.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, ఇప్పుడు సమయం 10:15 గంటలైంది. నేను తప్పకుండా మీ ఆదేశాలను పాటిస్తాను. త్వరితగతిన గంటలోపట పూర్తి చేసే ప్రయత్నం చేస్తాను. కాకపోతే అటువైపు నుంచి కూడా interruptions లేకుండా ఉంటే బాగుంటుంది. రెండు విషయాలు అధ్యక్షా. ఒకటి - అసెంబ్లీకి సంబంధించిన సమయపాలన. రెండవది - కోరంకు సంబంధించింది. మూడవది - ఇవ్వాళ బడ్జెట్‌పైన ప్రసంగం జరుగుతున్న సందర్భంగా ఇక్కడ మన ఫైనాన్స్ మినిస్టర్ గారు లేరు, మరి సిఎం గారు కూడా లేరు. దీన్ని బట్టి ఏం అర్థమవుతుందంటే, ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉన్నదో అర్థమవుతుంది.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- గౌరవనీయులు పెద్దలు చెప్పిన మాటకు సమాధానంగా అన్నింటికీ నేను ఉన్నాను, మా సహచర మంత్రివర్గ సభ్యులున్నారు. ఫైనాన్స్‌కి సంబంధించిన అధికారులు కూడా Officers' box లో ఉన్నారు. నేను గౌరవ సభ్యులను కోరుతున్నాను. మా డెప్యూటీ చీఫ్ మినిస్టర్ గారు/ఫైనాన్స్ మినిస్టర్ గారు కొన్ని కారణాల వల్ల రాలేకపోయారు.

శ్రీ కడియం శ్రీహరి (మైక్ లేకుండా):- రిప్లై ఎవరిస్తారు?

శ్రీ డి. శ్రీధర్ బాబు:- రిప్లై వారు వచ్చినంకా ఇస్తారు. వస్తున్నారు. రిప్లై ఫైనాన్స్ మినిస్టర్ గారు ఇవ్వకుండా ఎవరు ఇస్తారు? Definitely Sir, we will note it down, we will convey it and our officers are also there in the Officer's box.

SRI KADIYAM SRIHARI:- (స్టేషన్ ఘన్‌పూర్):- Only one Officer is there. This shows your non-seriousness. అధ్యక్షా, ముందుగా 2024-25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పైన చర్చించే అవకాశం కల్పించినందుకు తమరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. మా సోదరులు ఉప ముఖ్యమంత్రి, అదేవిధంగా ఆర్థికశాఖా మాత్యులు భట్టివిక్రమార్క గారు ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు వారికి అభినందనలు కూడా తెలియజేస్తున్నాను. ప్రధానంగా ఈ బడ్జెట్ డాక్యుమెంట్‌లో అనేక రాజ్యాంగ పీఠికలు, అనేకమంది మహానుభావుల ప్రవచనాలు దీంట్లో 6,7 ప్లేసెస్‌లో పొందుపరచడం జరిగింది. విక్రమార్క గారు ఉంటే అడుగుదామని అనుకున్నాను. ఈ రాజ్యాంగ పీఠికకు, ఈ సూక్తులకు దానికింద ఉన్న మనమిచ్చిన సబ్జెక్టుకు గాని, మనం ఇచ్చిన మ్యాటర్‌కి గాని ఉన్న రిలవెన్స్ ఏంది? వారు లేరు, బహుశా చెప్పడానికి కూడా ఇక్కడ ఎవరూ లేరు. ప్రధానంగా ఒక మాట, బడ్జెట్ బుక్ యొక్క మొదటి పేజీలోనే "పౌరులెల్లరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమును, భావము, భావ ప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన - వీటి స్వాతంత్రమును, అంతస్తులోను, అవకాశములోను సమానత్వమును చేకూర్చుటకు" ఈ స్ఫూర్తితో మేము ముందుకు పోతామనే ఒక మాట అన్నారు. చాలా సంతోషం. రెండవది - ఏమన్నారు, కొందరి కోసం మాత్రమే అందరూ బతకాలి అనే ఒక సూక్తిని వాడారు. దాన్ని మార్చి ఏమన్నారు, అందరికోసం మనందరం అనే సూక్తితోని వెళ్లాలి అన్నారు. Good, we will welcome it. తర్వాత మహాత్మాగాంధీని కోట్ చేశారు. తర్వాత ఆడం స్మిత్‌ని కోట్ చేశారు. తర్వాత మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్)ని కోట్ చేశారు. తర్వాత ఇంకో దిక్కున అంబేద్కర్ గారిని కోట్ చేశారు. అంటే వీరి ఉద్దేశమేమంటే, దీనిద్వారా నేను అర్థం చేసుకున్న విషయమేమంటే, ఈరోజు వరకు కూడా సమాజంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం రాలేదు, దీనికొరకు మేము ప్రయత్నం చేస్తామనే విధంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయవలసిన అవసరం కూడా ఉన్నది.

10.20 ఉ. అధ్యక్షా, ఇది ఎట్లా ఉందంటే, ఈ రోజే కాంగ్రెస్ పార్టీ పుట్టినట్లు, ఈ రోజే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లు, గత చరిత్రతో కాంగ్రెస్‌పార్టీకి సంబంధం లేనట్లు మాట్లాడడమే చాలా విడ్డూరంగ ఉంది. స్వతంత్ర భారతదేశంలో అత్యధిక సంవత్సరాలు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ఈనాడు భారతదేశంలో గానీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆర్థిక రాజకీయ సామాజిక పరిస్థితులకు వారు కూడ బాధ్యత వహించాల్సి వస్తుంది. మాకు బాధ్యత లేదని తప్పించుకోవడానికి అవకాశం లేదు. ఈరోజు మన దేశంలో పేదరికం ఉన్నది. ఆర్థిక, రాజకీయ, సాంఘిక అసమానతలున్నాయి. వీటన్నింటకి పాలకులందరూ బాధ్యులే. ముఖ్యంగా ఎక్కువ బాధ్యత కాంగ్రెస్‌పార్టీ వారిదే అన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోవద్దని తెలియజేస్తున్నాను.

అదేవిధంగా పేరా 6లో గౌరవ శ్రీధర్‌బాబు గారు మీరు వినాలి.. మీరు రాసుకుంటానని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షలను గౌరవిస్తూ నెరవేరుస్తూ, ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన నాటి యూపిఏ ప్రభుత్వానికి ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ గారికి మరియు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారికి, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అని చెప్పారు. ఆనాటి తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు కూడా తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కానీ ఈ తెలంగాణ ఉద్యమంలో కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారు. బ్రహ్మాండంగా తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలు జరిగాయి. 14 సంవత్సరాలుగా మలిదశ ఉద్యమం జరిగింది. తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడు గౌరవ కేసీఆర్ గారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం

వారు తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ గారిని ఈ పేరాలో మర్చిపోవడం చాలా బాధాకరం, విచారకరమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఇంకొక మాట ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీ వారు ఇందిరమ్మరాజ్యం, ఇందిరమ్మరాజ్యం అని వాడుతున్నారు. మంచిదే కానీ అసలు ఇందిరమ్మ రాజ్యంలో ఏముంది అధ్యక్షా, ఇందిరమ్మ రాజ్యంలో దేశంలో జరిగింది ఏమిటి ? రాష్ట్రంలో తొలి దశ ఉద్యమం 1969 లో వచ్చింది, తెలంగాణ మలి దశ ఉద్యమం 2001లో వచ్చింది. మలిదశ సమయంలో గానీ, తొలిదశ సమయంలో గానీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదని నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నదనే కదా మాకు ఇందిరమ్మ రాజ్యం వద్దు అని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమాలు వచ్చాయి.

అంతేకాకుండా నియంతృత్వ, నిర్బంధ పోకడలు అని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారు అప్పుడే ఎమర్జెన్సీ మరిచిపోయారేమో? ఎమర్జెన్సీ చీకటి రోజులు మరిచిపోయారు. ఇందిరమ్మ రాజ్యం ద్వారా దేశ ప్రజలకు ఒరిగిందేమి లేదు. 1984-85 లో ఇందిరాగాంధీ గారు చనిపోయినప్పుడు ఆనాడు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాజీవ్‌గాంధీ గారి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటుకు 440 సీట్లు గెలిచింది కానీ ఈ రోజు ఏమైంది ? ఇందిరమ్మ రాజ్యం, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ వస్తే ఈరోజున 40 సీట్లు వచ్చే పరిసిత్థులు కూడా లేవు.

శ్రీ పొన్నం ప్రభాకర్:- శాసనసభా వ్యవహారాలకు సంబంధించిన బాధ్యతతో మీరు మళ్లీ గౌరవ సభ్యునికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెటుపై రిప్లై ఇవ్వమని సమయం ఇచ్చారు. కానీ వారు ఇందిరాగాంధీ, ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతున్నారు. ఇవి ఈరోజు ఎజెండా కాదు కదా. వారికి తెలుసు. సమాజంలో ఇందిరాగాంధీగారు ఇప్పటికి కూడా గ్రామీణ ప్రాంతాలలో ఎస్‌సి,ఎస్‌టి, బీసీలకు ఒక దేవతలాగా భావిస్తారు. ఇవాళ కూడా ఇందిరమ్మ పాలన అని ఊర్లల్లోకి వెళ్లితే జ్ఞాపకం చేసుకుంటారు. 1947వ సంవత్సరంలో స్వతంత్ర్యం వచ్చిన నాడు మన దేశంలో గుండుసూది తయారు చేసుకొందామన్నా చేసుకునే పరిస్థితి లేదు, మనందరికి తెలియనిది కాదు. చరిత్రలో మన భారతదేశంలో ఏ స్థానంలో ఉన్నది. ఈ రోజు ఇంత పెద్దఎత్తున అభివృద్ధి జరిగితే, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరిగితే ఓపిక లేకుండా ఇవాళ మళ్లీ మాట్లాడుతున్నారు.

నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి తెచ్చిన పది సంవత్సరాలలోనే కాదు ఇవాళ కూడా అనేక సమస్యలున్నాయి. ఇది నిరంతర ప్రక్రియ అభివృద్ధి. మేము చేయడం వల్లనే మీకు పదేండ్లు పరిపాలించే అవకాశం వచ్చింది. ఆర్టికల్-3తో సహా అన్ని విషయాలలో ఆనాటి భారత ప్రభుత్వంలో ఇందిరమ్మ, నెహ్రూ గారి పంచవర్ష ప్రణాళికలు లేకపోయినట్లయితే ఇవన్నీ జరిగేవా? దేవాలయాలు, ఐఐటీలు, ఐఐఎంలు అనేకమైన కార్యక్రమాలు ఆనాడు నెహ్రూగారు ప్రాజెక్టులన్నీ దేవాలయాలంటే, ప్రాజెక్టులు ఏటీఎంలని ప్రస్తుత ప్రధానమంత్రి గారు అంటున్నారు. అటువంటి పరిస్థితి మారిపోయి వారు కూడా విమర్శ చేస్తే ఎలా? కాబట్టి సబ్జెక్టు మీద ప్రధాన ప్రతిపక్షం వారు మాట్లాడితే బాగుంటుంది. మేము కొత్త సభ్యులం, మమ్మల్ని తప్పుదోవ పట్టించడం కోసం ఏదేదో చర్చ తీసుకొచ్చే విధంగా కాకుండా బడ్జెట్‌పైన, అలాగే రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడితే బాగుంటుంది.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు కడియం శ్రీహరి గారికి నా విజ్ఞప్తి. మీరు Annual Financial Statement Budget on Vote on Account and Supplementary Estimates of Expenditure విషయం మీదనే మాట్లాడండి. దయచేసి మీరు డీవియేషన్ చేయకండి. మీరే వారిని లేచి మాట్లాడే విధంగా ప్రోత్సహించకండి.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, నేను బడ్జెటు పేపరులో ఉన్న రాజ్యాంగ పీఠికలను, సూక్తులను మాత్రమే చదువుతున్నాను. మా ప్రభాకర్ సోదరులు చూశారో లేదో, బడ్జెట్ పేపర్‌లో ఇవన్నీ ఉన్నాయి. నేను బడ్జెటు పేపరులో

లేనివి చెప్పడం లేదు. బడ్జెట్ ప్రసంగంలో పొందు పరచిన అంశాలను మాత్రమే మాట్లాడుతున్నాను. Out of the context నేను వెళ్లడం లేదు. దయచేసి ఈ బుక్ చదవండి. నేను పేరాతో సహా చెబుతున్నాను. బడ్జెట్ ప్రసంగంలో వీటన్నింటిపైన చర్చ వస్తుంది. వీటన్నింటిపైన విమర్శ ఉంటుందన్న ఆలోచనతోనే డాక్యుమెంటు తయారు చేయాలి. డాక్యుమెంటు తయారు చేసి మాకు ఇచ్చి ఈ బడ్జెటు అంతా డొల్లాగాఉంది , ఈ బడ్జెటులో గొప్పగా చెప్పుకోవడానికి ఏమి లేదు కాబట్టి ఇంత మసాలా దట్టిద్దాం, దీనికి కొంచెం ఫ్లేవర్ యాడ్ చేద్దామని చేసి మీరు మాకు ఈ రాజ్యాంగ పీఠికలు సూక్తులు ఇస్తే ఇదంతా డొల్లనే, ఇదంతా ఒట్టిదే, ఈ సూక్తులన్నీ ఒట్టివే అని చెప్పాల్సిన అవసరం ప్రతిపక్షాలకు ఉంటుంది. అది ప్రధాన ప్రతిపక్షంగా మా బాధ్యత. మీరు చెప్పినవన్నీ మేము అంగీకరిస్తూ పోము కదా?

ఇంకా చెప్పేవి చాలా ఉన్నవి. గౌరవ ప్రభాకర్ గారు రెండవ పేజీలో మూడవ పేరాను చూడండి. కొందరి కోసం మాత్రమే అందరు బ్రతకాలి, అందరి కోసం మనమందరం బ్రతకాలి. కొందరి కోసం ఎవరు బ్రతుకుతారు అధ్యక్షా, భారతదేశానికి స్వతంత్రం వచ్చిన నాటి నుండి కొందరి కోసమే కదా మీరు పనిచేసేది, ఒక్క కుటుంబం కోసమే కదా మీరు పని చేసేది. మమ్మల్ని మీరు ఎట్లా అంటారు? మమ్మల్ని అనడానికి మీకు అర్హత లేదు కదా.

10.30 ఉ.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, నేను గౌరవ సీనియర్ శాసన సభ్యులు శ్రీ కడియం శ్రీహరి గారి పార్లమెంటరీ ఎక్స్‌పీరియన్స్ అంతా ఒడపోసి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. We will take it in a positive way. నేను వారిని కోరుతున్నాను, మీరు సమయం ఇవ్వండి ఇందిరమ్మ రాజ్యం ఏమిటనే దానిపై షార్ట్ డిస్కషన్ పెట్టండి We are here to tell what is "Indiramma Rajyam". ఈ రోజు ఇందిరమ్మ రాజ్యంలో పేద వారికి కావాల్సిన హక్కులు కల్పించాము, పేదవారికి కావాల్సిన అనేక అంశాలను గౌరవంగా, ధైర్యంగా నిలబడి ఈ రోజు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాలు కూడా నిలబడి దేశంలో మాట్లాడుతున్నారంటే ఇందిరమ్మ రాజ్యంలో కల్పించిన అనేక హక్కులే కారణం. ఆ విషయాలను కూడా మాట్లాడదాము, డిబేట్ పెట్టుకుందాము, డిఫరెంట్ ఫాంలో రమ్మని చెప్పండి Definitely we will discuss. మీకు అక్కడ ఉన్న ప్లస్ పాయింట్లు కానీ, మైనస్ పాయింట్లు కానీ చెప్పడానికి అవకాశం ఉంటుంది.

ఈ రోజు కేవలం ఓట్ ఆన్ అకౌంట్‌కు సంబంధించిన అంశాలను మాత్రమే మాట్లాడవలసిందిగా గౌరవ సీనియర్ శాసన సభ్యులు శ్రీ కడియం శ్రీహరి గారిని కోరుతున్నాను. 30 నిమిషాలు వారికి అవకాశం ఇస్తామంటే వారు ఒక గంట సమయం అడిగారు, కానీ వారు 12 నిమిషాలు ఇందిరమ్మ రాజ్యం గురించి మాట్లాడారు. ఎప్పుడో జరిగిన కొన్ని ఉదంతాలను పట్టుకొని ఉటంకించే ప్రయత్నం చేస్తున్నారు. గౌరవ స్పీకర్ గారిని కూడా కోరుతున్నాను, Let us restrict to the subject.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, నేను మళ్లీ మా మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారికి చెబుతున్నాను, బడ్జెటు పుస్తకంలో ఆ అంశాలు లేకపోతే నేను మాట్లాడేవాడిని కాదు. నేను ఈ బడ్జెటు పుస్తకంలోని అంశాలను మాత్రమే మాట్లాడుతున్నాను, వేరే అంశాలను తీసుకొనివచ్చి మాట్లాడడంలేదు, దయచేసి అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను. మరొకసారి ఈ రకమైన డాక్యుమెంట్ తయారు చేసేటప్పుడు శాసన సభకు పరిమితమై డాక్యుమెంటు తయారు చేస్తే బాగుంటుందని ఈ సందర్భంగా నేను గుర్తు చేస్తున్నాను. ఈ బడ్జెటులో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపైన విమర్శలు, ఆరోపణలు చేయడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించింది. గత ప్రభుత్వంలో ఏమీ జరగలేదని చెప్పడానికి ప్రయత్నం చేశారు. కానీ, ఒకవైపు గత ప్రభుత్వంలో ఏమీ జరగలేదని చెబుతూనే, మరొకవైపు తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వృద్ధి రేటు బ్రహ్మాండంగా ఉంది. దేశంలో అన్ని రాష్ట్రాలకంటే తెలంగాణలో అభివృద్ధి రేటు, తలసరి ఆదాయం, GSDP పెరిగింది బ్రహ్మాండంగా పెరిగిందని ఈ బడ్జెటు పుస్తకంలో చెప్పారు. ఒక వైపు పూట

గడవని పరిస్థితి, జీతాలు ఇవ్వలేని స్థితి, తెల్లవారితే ఏం చేయాలో దిక్కుతోచని స్థితి అని ఇట్లా ఒక పేజీలో రాసి, మళ్లీ మరో పేజీ తిప్పగానే అక్కడ ఏం చెబుతున్నారంటే తెలంగాణ గత పది సంవత్సరాల కాలంలో, కేసీఆర్ గారి నాయకత్వంలో బ్రహ్మాండమైన ఆర్థికాభివృద్ధి సాధించింది. తలసరి ఆదాయం, GSDP పెరిగింది, అన్ని రకాలుగా బ్రహ్మాండంగా కార్యక్రమాలు జరిగాయని చెబుతున్నారు. The Budget at a glance. మంత్రివర్యులు భట్టి విక్రమార్కగారు సభకు సమర్పించిన 'Budget at a glance'.. ఇందులో 2024-25వ సంవత్సరానికి గాను మొత్తం బడ్జెటు రూ.2,75,890 కోట్లను ప్రతిపాదించారు. 2023-24వ సంవత్సరం రివైజడ్ బడ్జెటు 2,24,624కోట్ల 87లక్షలు 2024-25వ సంవత్సరానికి వచ్చే వరకు రూ.2,75,890 కోట్లు అంటే దాదాపు రూ.51,000 వేల కోట్ల బడ్జెటును పెంచి ఈ బడ్జెటు పుస్తకంలో చూపించారు. ఒకవైపు ఆర్థిక మాంద్యం వస్తున్నది, రాష్ట్రం యొక్క ఆదాయం పడిపోయింది, వనరులు సరిగ్గా లేవని చెబుతూ అదనంగా రూ.51,000 కోట్ల బడ్జెటులో చూపించారు. నేను అడుగుతున్నాను, ఈ మొత్తం ఎలా వస్తాయి, ఏమైనా టాక్సులు పెంచారా? ఏమైనా పన్నులు వేస్తారా? ఏం చేయాలని అనుకుంటున్నారో స్పష్టత ఇవ్వలేదు.

టాక్సు రెవెన్యూ కింద గతంలో రూ.1,18,195 కోట్ల రాబడి ఉంటే ఇప్పుడు రూ.1,38,228 కోట్లు చూపించారు, అంటే టాక్సు రెవెన్యూ రూ.20,000 కోట్లకు పెంచి చూపిస్తున్నారు. టాక్సు రెవెన్యూ రూ.20,000 కోట్లు పెంచడం అంటే ఎలా పెంచబోతున్నారు, ఏమైనా అడిషనల్ టాక్సులను వేస్తారా? మన State own tax revenue 84% కు వచ్చింది, ఇంకా ఎక్కడనుంచి వనరులను సమీకరిస్తారు, ఏ రకంగా సమీకరిస్తారో చెప్పలేదు. మరోవైపు రాష్ట్రం అప్పుల పాలు అయ్యిందని చెబుతూనే, ఈ సంవత్సరం రూ.59,625.21 కోట్ల అప్పులు చేసే విధంగా ఈ బడ్జెటులో పెట్టారు. గత ప్రభుత్వం, కేసీఆర్ గారి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది. ఆస్తులను సృష్టించలేదు, ప్రజల మీద అప్పుల భారం పడ్డదని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.59,625.21 కోట్ల అప్పులు తీసుకునే విధంగా బడ్జెటు పుస్తకంలో పొందుపరిచారు. ఇవన్నీ చేసినా కూడా fiscal deficit రూ.53,227కోట్లు, ఇంత deficitతో ఈ బడ్జెటును పూర్తి చేసుకోగలుగుతామా? మనం ఇచ్చిన హామీలను నెరవేర్చగలుగుతామా? ప్రజలకు సంక్షేమ పథకాలు అందించగలుగుతామా? మనం ఆశించిన క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ చేయగలుగుతామా? రాష్ట్ర ప్రభుత్వం తన సమాధానంలో స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నాను.

గత ప్రభుత్వం హయాంలో ఏ రకమైన అభివృద్ధి జరగలేదని చెప్పడానికి బడ్జెటు పుస్తకంలో ఒక పేరా మొత్తం కేటాయించారు, నా దగ్గర వాటికి సంబంధించిన అన్ని వివరాలు ఉన్నాయి. కావాలంటే ఆ వివరాలను సభాపతి గారి ద్వారా శ్రీధర్ బాబు గారికి పంపిస్తాను. అవన్నీ కూడా అఫీషియల్ ఫిగర్స్, నా సొంత కవిత్వం కాదు. 02 జూన్, 2014న తెలంగాణ వచ్చింది, అప్పటి నుంచి ఇప్పటి వరకు 2014-15వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర బడ్జెటు రూ.1,00,637 కోట్లు ఉంటే, ఈ సంవత్సరం మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కగారు ప్రవేశ పెట్టిన బడ్జెటు రూ.2,75,891 కోట్లు, ఆర్థికాభివృద్ధి లేకుండా బడ్జెటు వృద్ధి ఎలా ఉంటుంది. ఒక లక్ష కోట్ల బడ్జెటు నుంచి రెండు లక్షల డెబ్బై అయిదు వేల కోట్లకు తెలంగాణ బడ్జెటు పెరిగిందంటే ఆర్థికాభివృద్ధి ఉంది కాబట్టే బడ్జెటు వృద్ధి చెందిందని గ్రహించాలి. తెలంగాణ GSDP వృద్ధి ఒకసారి చూస్తే 2014-15 సంవత్సరంలో రూ.5,05,000 కోట్లు ఉండే, ఇప్పుడు కొత్త లెక్కల ప్రకారం 2023-24వ సంవత్సరంలో రూ.14,49,708 కోట్లకు చేరింది. వాస్తవంగా మధ్యలో 2019-20, 2020-21వ సంవత్సరాలలో కొవిడ్ గనుక రాకపోయినట్లు అయితే దాదాపుగా రూ.18,00,000 కోట్లకు చేరుకునేదంటే ఏ రకంగా గత ప్రభుత్వం క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ చేసిందో దయచేసి అర్థం చేసుకోవాల్సిందిగా సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

If we see overall growth in Telangana when compared to all other States in India, Telangana's overall average growth rate is 12.7% inclusive of 2019-20, 2020-21 Covid period. 2014-15వ

సంవత్సరం నుంచి 2022-23వ సంవత్సరం వరకు 12.7 వృద్ధి చెందింది, అదే సమయంలో All India Growth rate is 10.5, అంటే All India growth కంటే తెలంగాణ వృద్ధి ఎక్కువ ఉందంటే, అది భారత రాష్ట్రసమితి సాధించిన ప్రగతే కదా, విజయమే కదా.. ఎట్లా కాదని అంటున్నారని నేను అడుగుతున్నాను. ఆ రామకృష్ణా రావు గారు ఇచ్చిన వివరాలే ఇవి 2014-15వ సంవత్సరంలో తెలంగాణ GSDP contributed approximately 4% to the GDP of the nation. 2023-24 వ సంవత్సరం వచ్చే వరకే Telangana's GSDP contributed 5% to India's GDP. 4 శాతం నుంచి 4.9 శాతానికి అంటే దాదాపుగా 5 శాతానికి పెరిగింది. తెలంగాణ తలసరి ఆదాయం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు బడ్జెటు పుస్తకంలో పొందుపరచిన వివరాలను మాత్రమే నేను చెబుతున్నాను, 2023-24 వ సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,43,297 మొత్తం భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో తెలంగాణ మూడవ స్థానంలో ఉంది. సిక్కిం మరియు ఢిల్లీ తరువాత అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ. ఇది ఎట్లా సాధ్యమయింది, ఇది కేసీఆర్ గారు సాధించిన ప్రగతి, విజయం కాదా అని నేను ఈ సందర్భంగా అడుగుతున్నాను.

10.40 ఉ. అదే విధంగా రామక్రిష్ణారావు గారు ఇచ్చిన ప్రతి డాక్యుమెంటు ప్రకారం చూస్తే Telangana second in the country for State own tax revenue. 84.2% of the State expenditure is governed by its own States tax revenue. ఈ విషయంలో we are second in the country after Haryana State. హర్యాణ తరువాత రెండవ స్థానంలో మన తెలంగాణ రాష్ట్రం ఉన్నది. సభ్యులకు ఈ సమాచారం కావాలంటే కాపీలు తీయించి పంపిస్తాను, చూసుకోమనండి. రెండవది.. 2004-05 నుంచి 2013-14 అంటే పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ప్రాంతంలో క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ was only 54వేల 52 కోట్ల రూపాయలు. 2014-15 నుంచి 2023-24 వరకు ఇంకా కొన్ని బిల్లులు పెండింగులో ఉన్నాయి, అవి చెల్లింపులు చేయాల్సి ఉన్నది. భారత రాష్ట్ర సమితి పది సంవత్సరాల పరిపాలనలో కేసీఆర్ గారి నాయకత్వంలో మా క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ 3లక్షల 36వేల కోట్ల 916 రూపాయలు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో 54వేల 52 కోట్ల రూపాయలు ఖర్చు పెడితే, మా బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో 3లక్షల 36వేల కోట్ల 916 రూపాయలు. పరిస్థితి ఈ విధంగా ఉంటే ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని చెబుతున్నారు. భారతదేశంలో ఉండే మొత్తం 29 రాష్ట్రాల యొక్క అప్పుల వివరాలు చూస్తే మన తెలంగాణ రాష్ట్రం 28.2 percentage of loan to GSDPలో చూస్తే మనం 23వ స్థానంలో ఉన్నాము. అంటే మనకంటే 22 రాష్ట్రాలు ఎక్కువ అప్పులు చేశాయి. ఈ విషయాలన్నింటిని మర్చిపోయి భారత రాష్ట్ర సమితి బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధిస్తే ఏ రకమైన అభివృద్ధి జరగలేదని ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.

(అధికారపక్ష సభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- రాజ్‌గోపాల్‌రెడ్డి గారూ, మీకు అవకాశం వచ్చినప్పుడు మాట్లాడండి.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా,ఇప్పటివరకు చెప్పిన గణాంకాల ద్వారా నేను చెప్పదల్చుకున్నదేమంటే పది సంవత్సరాల భారత రాష్ట్రసమితి ప్రభుత్వంలో కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే బ్రహ్మాండమైన అభివృద్ధిని, పురోగతిని సాధించిందని చెప్పడానికే ఈ గణాంకాలన్నింటిని మీ ముందు పెట్టాను. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్ని హామీలు ఇచ్చిందో వారికే తెలియదు. ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో పేరిట అనేక హామీలిచ్చారు. అనేక డిక్లరేషన్‌ల పేరుతో ఎస్.సి, ఎస్.టి, బి.సి, యువత డిక్లరేషన్, మైనారిటీ, రైతు భరోసా వంటి అనేక డిక్లరేషన్‌ల పేరిట దాదాపుగా 420 హామీలిచ్చారు. ఈ 420 హామీలను ఒక నోట్‌బుక్‌గా తయారు చేయించాను.

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

(ఈ దశలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన తెలంగాణ కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోను సభలో చూపించారు)

(అధికారపక్ష సభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారి నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- సత్యనారాయణ గారూ, దయచేసి కూర్చోండి.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, ఈ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అడుగుతారనే నేను ప్రిపేర్ అయి వచ్చాను. నా దగ్గర పూర్తి డాక్యుమెంటు ఉన్నది. రాష్ట్ర వనరులను పరిగణనలోనికి తీసుకోకుండా..... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 13 హామీలున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలున్నాయి, డిక్లరేషన్‌లలో అనేక హామీలున్నాయి. మన ఆర్థిక శాఖ మంత్రిగారు మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం వంటి అయిదు గ్యారంటీలకు గాను 53,196 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. మేం చెప్పదల్చుకున్నదేమంటే ఈ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు, వారిచ్చిన పదమూడు హామీలకు ఈ బడ్జెట్ ఏ మూలకు సరిపోదని చెబుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పు పట్టడం లేదు. అయితే ఇందులో కూడా ఒక మెలిక పెట్టారు. మా ప్రభాకర్ గారు, మా శ్రీధర్‌బాబు గారు కూడా ఇది వినాలి. ఎందుకంటేవారిచ్చిన సమాచారాన్ని మాత్రమే నేను సభలో చదువుతున్నాను. బడ్జెట్ బుక్కులోని పేజి.నెం.13, పేరా నెం.25లో ఉన్న సమాచారం ప్రకారం ఈ బడ్జెట్‌లో పథకాల అమలుకు 53,196 కోట్ల రూపాయలను ప్రతిపాదించడం జరిగింది. ఈ కేటాయింపు ఒక ప్రాథమిక అంచనా ప్రకారమే చేయడం జరిగింది. హామీలకు సంబంధించిన విధి విధానాలను రూపొందించే పని ఇంకా కొనసాగుతున్నందున అది పూర్తయిన వెంటనే అమలుకు అవసరమైన పూర్తి నిధులు కేటాయిస్తామన్నారు. హామీలకు సంబంధించిన విధి విధానాలను రూపొందించే పని ఇంకా కొనసాగుతున్నందున అంటే ఈ పేరుతో బడ్జెట్‌లో పెట్టిన ఈ రైడర్‌తో దీనిని కాలయాపన చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. నాకు తెలిసి వచ్చే ఆరు మాసాలలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కావాలనే లోక్‌సభ ఎన్నికల కోసం ఆగి, ఎలక్షన్ కోడ్ రాగానే ఎన్నికల కోడ్ వచ్చింది కాబట్టి మేం హామీలను అమలు చెయ్యలేకపోతున్నామని చేతులెత్తేయడానికే ఈ ప్రతిపాదన అని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, గౌరవ సీనియర్ శాసనసభ్యులు మాట్లాడుతూ బడ్జెట్ బుక్కులోని 13వ పేజీలో ఈ బడ్జెట్‌లో మా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన పథకాల అమలుకు 53,196 కోట్ల రూపాయలను ప్రతిపాదించడం జరిగింది. ఇది ప్రాథమిక అంచనా ప్రకారమే చేయడం జరిగిందని ప్రభుత్వపరంగా మా ఆర్థిక శాఖ మంత్రిగారు చెప్పారు. ఏదైనా పాలసీ నిర్ణయం తీసుకునే ముందు విధి విధానాలను రూపొందించాల్సిన ధర్మం ప్రభుత్వంపైన ఉంటుందా ఉండదా అని అడుగుతున్నాను. వారు కూడా సీనియర్ మంత్రిగా పనిచేశారు. విధి విధానాలకు సంబంధించి వంద రోజుల సమయం కూడా పూర్తి కాకముందే మేం డిసెంబర్ 7వ తారీఖునాడు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే 10వ తారీఖునాడు ఈ ప్రభుత్వం హామీలు ఎందుకు మొదలు పెట్టలేదని అడిగే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీకి ఉన్నదా? గత ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ ......మా ప్రభుత్వానికి పథకాల అమలు పట్ల చిత్తశుద్ధి ఉన్నది. మా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్నామనేది ప్రజలకు అర్థమవుతున్నది. ఈ సందర్భంలో మేం అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా పూర్తి కాలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఏమనుకుంటున్నదంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలో మేము ఇచ్చిన హామీలను అమలు చేయొద్దనే అభిప్రాయం వారికున్నది. ప్రజలకు ఈ ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనం చేయొద్దని వారికున్నది. కానీ ఈ ప్రధాన ప్రతిపక్ష సభ్యులు మేం పథకాలు అమలు చేయకుండా ఉండాలని వారెంత కోరుకున్నప్పటికీ ఖజానాలో డబ్బులు లేని పరిస్థితిని

వారు తీసుకొచ్చినప్పటికీ మేం ఆర్థిక క్రమశిక్షణను తీసుకొచ్చి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తాము, ఏదో లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయని కాదు, మా ప్రభుత్వం డిసెంబరు మాసంలోనే 13 అంశాలలో రెండు ప్రధానమైన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నాం, ఇంకొక రెండు హామీలను కూడా మొన్న గవర్నర్ గారి ప్రసంగంలో ముఖ్యమంత్రిగారు స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈరోజు నుంచి ఈ రెండు హామీలను కూడా అమలు చేస్తున్నాము. అంటే మేం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇంకా అమలు చేయాల్సిన హామీలు తొమ్మిది ఉన్నాయి. ఆ తొమ్మిది హామీలకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాల్సిన ప్రధానమైన బాధ్యత కూడా మా ప్రభుత్వపరంగా ఉంటుంది.

10.50 ఉ. అధ్యక్షా, ఈరోజు రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులను చేయాలని, వారిలో అపోహలు సృష్టించాలనే ప్రయత్నం చేస్తున్నారు. మేము ఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి ఒక్క అంశాన్ని ఒక ప్రణాళికబద్ధంగా తప్పకుండా అమలు చేస్తాం. ఎవరికీ అపోహలు వద్దని, ప్రత్యేకంగా బిఆర్ఎస్ పార్టీ గౌరవ శాసనసభ్యులకు అపోహలు అసలే ఉండవద్దని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుకుంటున్నాం. అడ్డుపడాలనే ఆలోచన గానీ.........

(కాంగ్రెస్ పార్టీ సభ్యులు డా. కవ్వంపల్లి సత్య నారాయణ నుండి అంతరాయం)

అధ్యక్షా, వారు మొదటిసారి శాసనసభ్యులుగా వచ్చారు. వారు నేర్చుకోవాలి, వారు ఎందుకు తొందరపడుతున్నారు? వారు నాతోని మాట్లాడకుండా ఛైర్‌ను చూసి మాట్లాడాలని కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుకుంటున్నాం. దానికి కావాల్సిన సహకారం మా నుండి కూడా ఉంటుంది. కాలయాపన చేసి ప్రజలను మోసం చేయవద్దనేదే మా అభిప్రాయం తప్ప, మరోటి కాదు. అధ్యక్షా, అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని వారే చెప్పారు. వాటిని మేము రిపీట్ చేసి, రిమైండ్ చేస్తే మామీద విరుచుకుపడితే లాభం ఏముంటుంది శ్రీధర్‌బాబు గారు, మీరు చెప్పిందే కదా. ఈ మాట మేము చెప్పింది కాదు కదా. కాబట్టి, మీరు చెప్పిన మాటకు కట్టుబడి లేరు. నిలబెట్టుకోలేదు అని ప్రజల పక్షాన రిమైండ్ చేసే ప్రయత్నం చేస్తున్నాను.

ప్రభుత్వం ఇచ్చిన ఈ 6 హామీలకు నేను ప్రాథమిక అంచనా వేస్తే, వాటికి సంవత్సరానికి రూ.1,36,000కోట్లు అవుతుంది. ఈ రూ.1,36,000కోట్లు కేవలం ఆరు గ్యారంటీలకే అవుతుంది. అందులో రైతు రుణమాఫీ లేదు, అందులో డిక్లరేషన్స్ లేవు. అందులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయ హస్తం లేదు. అవి గాకనే ఈ ఆరు గ్యారంటీలకు, 13 హామీలకు రూ.1,36,000కోట్లు కావాలి. వారికి ఇక అవన్నీ అవసరం లేదు. ఒకటే, ఉదాహరణ చెబుతాను. అధ్యక్షా, మొన్న ఆర్థిక శాఖా మాత్యులు ఈ బడ్జెట్‌కు సంబంధించి ఒక మాట చెప్పారు. చాలా సంతోషకరమైన వార్త చెప్పారు. ఏమని చెప్పారంటే, ఈ సంవత్సరం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. మొత్తంగా 119 నియోజకవర్గాలకు గానూ 4,16,500 ఇండ్లు అవుతున్నాయి. 4,16,500 ఇండ్లకు రూ.5,00,000/-ల చొప్పున లెక్క గట్టినా, లేదూ ఎస్సీ/ఎస్టీలకు అదనంగా ఇంకో లక్ష రూపాయలు ఇస్తామన్నారు, అవన్నీ లెక్కకడితే దాదాపు రూ.23,000కోట్ల నుండి రూ.24,000కోట్లు కావాలి. కానీ, వారు బడ్జెట్‌లో రూ.7,000కోట్లు పెట్టారు. అంటే, ఇది తప్పించుకోవడం కాదా అధ్యక్షా? వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే నేనేమి చేయాలి. వారు చెప్పిన మాటలే, వారు ఇచ్చిన ఫిగర్స్‌ను కోట్ చేస్తూనే మాట్లాడుతున్నాను, భిన్నంగా ఏమి మాట్లాడటం లేదు. కొత్త ఫిగర్ నేను తీసుకురావడం లేదు.

అదేవిధంగా మహాలక్ష్మి పథకం అని చెప్పారు. ఈ మహాలక్ష్మి పథకం కూడా ఆరు గ్యారంటీల్లోనే ఉంది. మహాలక్ష్మి పథకం కింద మూడు హామీలన్నారు. అందులో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం ఒకటి, రేపోమాపో గ్యాస్ సిలిండర్

కూడా ఇస్తామంటున్నారు సంతోషం. కానీ, అసలు హామీ ఏమిటంటే ప్రతి మహిళకు, ప్రతి నెలకు రూ.2,500/-ల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. అధ్యక్షా, మన రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన వారు 1.65కోట్ల మంది మహిళలున్నారు. పోనీ ప్రతి మహిళకు ఇవ్వలేకపోయినా, మన రాష్ట్రంలో 90లక్షల తెల్ల రేషన్ కార్డులున్నాయి. వారిలో ఒక రేషన్ కార్డు కింద ఒకరికి నెలకు రూ. 2,500/- చొప్పున ఇచ్చినా దాదాపు రూ. 20,000 కోట్లు కావాలి. ఇందులో ప్రొవిజనే లేదు. నేను అడిగేది ఏమంటే, ఆరు గ్యారంటీలను చాలా ఆర్భాటంగా, చాలా అద్భుతంగా ప్రజల్లోకి వారు తీసుకొని వెళ్లారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ఆరు గ్యారంటీలే వారిని గెలిపించాయి. ప్రజలు వారిని నమ్మి వారికి ఓట్లు వేశారు. ప్రజలు ఓట్లు వేసిన తరువాత, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల నెత్తిన భస్మాసుర హస్తం పెడుతున్నారు. ప్రజలకు మొండిచేయి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇవి మాత్రమే మేము చెప్పే ప్రయత్నం చేస్తున్నాము.

అధ్యక్షా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకాలే కాకుండా చేయూత కార్యక్రమం ఉంది. నాకు తెలిసి, subject to correction, 44లక్షల మందికి మనం ఆసరా పింఛన్లు ఇస్తున్నాము. దానికి పేరు మార్చి "చేయూత" అని పెట్టారు, దానికి ఏమీ అభ్యంతరం లేదు. 44 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇచ్చేటప్పుడు సాలీనా దాదాపు రూ.12,000కోట్లు ఖర్చు అవుతుంది. వారేమో, రూ.2,000/-లను రూ.4,000/- చేస్తామని చెప్పారు. వికలాంగులకు రూ.4,000/- బదులు రూ.6,000/- చేస్తామని ఆరు గ్యారంటీల్లో భాగంగా చేయూత కింద చెప్పారు. అంటే దాదాపుగా చేయూతకు సాలీనా రూ.24,000కోట్లు కావాలి. భార్యకు, భర్తకు కూడా ఇస్తామన్నారు. ఇంట్లో ఇద్దరికీ ఇస్తామన్నారు. అంటే దాదాపు రూ.30,000కోట్లకు పోతుంది. అంటే ఇవన్నీ లెక్కలు చేసి వారు హామీలిచ్చారా? లెక్కలు చేయకుండానే, చూసుకోకుండానే, వనరులు ఏమిటో తెలుసుకోకుండానే, ఏమైనా గానీ, ముందుగానైతే హామీలిద్దాం, అధికారంలోకి వద్దామని హామీలిచ్చారా? అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది వాస్తవ పరిస్థితి.

అధ్యక్షా, గత పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బ్రహ్మాండంగా పారిశ్రామిక అభివృద్ధి మరియు ఐటి విస్తరణ జరిగింది. ఇది కాదనలేని సత్యం. వారు గణాంకాలు చూసుకున్నా, ఆర్థిక శాఖ నుండి, పరిశ్రమల శాఖ నుండి వివరాలు సేకరించినా అదేవిధంగా ఉంటుంది. అధ్యక్షా, 2014-15 నుండి 2022-23 వరకు మన రాష్ట్రంలో టిఎస్ ఐపాస్ ద్వారా 22,722 యూనిట్స్‌కి అప్రూవల్ ఇచ్చాం. రూ.2,60,000కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదేవిధంగా ఐటికి సంబంధించి 2013-14లో మన ఐటి ఎగుమతులు రూ.57,258కోట్లు ఉంటే, 2022-23కు వచ్చేవరకు రూ.2,41,275కోట్లకు పెరిగింది. ఐటిలో ఉద్యోగాలు కూడా 9లక్షలు వచ్చాయి. మొత్తంగా ఇండస్ట్రీ మరియు ఐటి నుండి దాదాపుగా 26,60,000 ఉద్యోగాలు తెలంగాణలో సృష్టించబడ్డాయి. దీనికంతటికీ కేటీఆర్ గారికి ధన్యవాదాలు తెలియజేయాలి. కేటీఆర్ యొక్క సమర్థవంతమైన పరిపాలనా ద్వారా, ఆయన ఆలోచనా ద్వారా ఈరోజు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇండస్ట్రీకి, ఐటి డెస్టినేషన్ హైదరాబాద్ అయింది.

(అధికార పక్ష సభ్యులు ... ఆల్‌రెడీ ఉందని అన్నారు.)

ఆల్‌రెడీ ఉందంటూ అధ్యక్షా, వారు తెలియని మాటలు మాట్లాడితే ఏమి చెబుతాము. తెలియకుండా మాట్లాడితే ఏమి చేస్తాం. ఇంకా విచిత్రమైన విషయం ఏమిటంటే సభలో పొన్నం ప్రభాకర్ గారు మరియు శ్రీధర్ బాబు గారు ఇద్దరు మంత్రులే ఉన్నారు. వారు తెలుసుకోవాలని కోరుతున్నాను. తెలంగాణ ముఖ్యమంత్రి గారు మరియు ఐటి మంత్రివర్యులు ఇద్దరు కూడా దావోస్ వెళ్లి నలభై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చారని ఈ డాక్యుమెంట్‌లో వ్రాయడం జరిగింది. అధ్యక్షా, ఈ సందర్భంగా ఒక విషయాన్ని ఈ సభ దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను. ఏవైతే కంపెనీలు గత ప్రభుత్వంతో ఎంఓయు చేసుకున్నాయో, వాటినే మళ్లీ యంఓయు చేసుకొని కొత్త పెట్టుబడులు తెచ్చామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది.

11.00 ఉ. **శ్రీ డి. శ్రీధర్ బాబు**:- ఒక్క నిమిషం. I want to clarify. ఎందుకంటే గౌరవ సభ్యులు పూర్తి స్థాయిలో పెట్టుబడులకు సంబంధించిన అంశాన్ని వివరంగా చెప్పినపుడు ఈ రూ.40 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన పెట్టుబడులన్నిటికీ కూడా, నేను గౌరవ సభ్యులను కోరుతున్నాను before passing sweeping remarks.... మనకు కూడా తెలియాల్సిన అవసరం ఉంది. ఫలాన ఎక్స్ కంపెనీ గత ప్రభుత్వంలో పెట్టుబడులు పెట్టి ఉండొచ్చు. ఆరోజు రూపాయి పెట్టుబడి చేస్తే ఆ రూపాయి పెట్టుబడికే పరిమితం కాకుండా ఈరోజు పది రూపాయల పెట్టుబడి పెట్టడం జరిగింది. కాబట్టి అదే చూపించారు అనేది కరెక్టు కాదు. గతంలోదే చూపెట్టడం కాదు. ఈ 40 వేల కోట్ల రూపాయల్లో ఒక్క రూపాయి కూడా గత ప్రభుత్వం చూపించిన పెట్టుబడుల్లో లేని అంశాలనే ఈరోజు సభ ముందు ఉంచాము. ఫలానా టిసిఎస్ కంపెనీ గత ప్రభుత్వంలో రూపాయి పెట్టుబడి పెడితే మా ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత మరొక్కసారి పెట్టుబడి పెట్టడానికి ముందుకొస్తున్నామని ఎంఒయులు చేసుకోవడం జరిగిందని గౌరవ పెద్దలు శ్రీహరిగారి దృష్టికి తీసుకువస్తున్నాము. ఇది స్పష్టత. Please clarify. ఎందుకంటే మీరు మాట్లాడే ప్రతి పదాన్ని, ప్రతి అంశాన్ని మేము నోట్ చేసుకుంటాము. వారు అనేక అంశాలు చెప్పారు. మేము కూడా ప్రతీ సందర్భంలో చెపుతున్నాము.

1991 సంవత్సరంలో మొదలైన ఆర్థిక సంస్కరణల వల్ల ఈ దేశ ప్రగతికి మనం నాంది పలికాము. ఆరోజున్న ఆర్థిక వృద్ధి రేటు ఎంత పెరిగింది, క్రమక్రమేణా ఏవిధంగా పెరుగుతావుంది ప్రతి రాష్ట్రానికీ సంబంధించి అక్కడ తీసుకున్న proactive industrial investment policies వల్ల ఏ విధంగా పెరుగుతావుంది, పెరిగే దృక్పథంతో ముందుకు వెళుతున్నాము. ఈరోజు మాకు భేషజాలు లేవు. మేము మొన్న కూడా చెప్పడం జరిగింది. ఏదైనా గత ప్రభుత్వం రాష్ట్రప్రగతికి సంబంధించి ఒక మంచి విధానపరమైన నిర్ణయం తీసుకుంటే దాన్ని ఇంకా మెరుగైన రీతిలో ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం మా ప్రభుత్వం చేస్తుందని మేము ఈ రాష్ట్రప్రజలకు మీకు కూడా చెప్పడం జరిగింది. మేమేమీ కాదంటలేము. గత ప్రభుత్వం 20 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఎంఒయులు చేసుకుని ఉంటారు. ఈరోజు మేము 40 వేల కోట్లకు సంబంధించిన ఎంఒయులు చేసుకోవడం జరిగింది. మనందరం కూడ సమిష్టిగా ఈరోజు రాష్ట్ర ప్రగతికి సంబంధించిన ఆలోచన చేస్తున్న సందర్భంలో మీరు ఈ విధంగా మాట్లాడితే వాణిజ్యం, వ్యాపారం, వ్యాపారస్థులకు కూడా అనుమానాలు, అపోహలు రావడానికి ఆస్కారం ఉంటది కనుక రేపు రాబోయే కాలంలో రూ.40 వేల కోట్లు కాదు, రూ.80 వేల కోట్లకు తీసుకురావడానికి మంచి సూచనలు, సలహాలు ఇవ్వండి.

సార్, వారు చెప్పిన ఇంకొక అంశం కూడా ఉంది. ఎలక్షన్లలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి టైంపాస్ చేద్దామనే ఆలోచన మాకు లేదు. ఈరోజు మేము కూడా అడుగుతున్నాము. గౌరవ పెద్దలు శ్రీహరి గారు కూడా వారి మానిఫెస్టోకి సంబంధించిన అంశాల విషయంలో తప్పకుండా మేమనుకుంటాం కేసీఆర్‌గారు, హరీష్‌రావు గారు, కేటీఆర్ గారు, ప్రశాంత్ రెడ్డి గారు సీనియర్ సభ్యులందరూ కూర్చుని మానిఫెస్టోని తయారుచేసి ఉంటారు. మేము మహాలక్ష్మి పథకం క్రింద 2500/- రూపాయలు ప్రతి ఇంటిలో ఒక గృహిణికి ఇస్తామని చెపితే వారు రూ.3,000/-అన్నారు. మేము చేయూత అన్నాము. మేము చేయూత రూ.2,000/-ల నుంచి రూ.4.000/- చేస్తామంటే, మా తర్వాత వారు ఆ విధంగా అన్నారు. వారు ఏవిధంగా తీసుకోబోతున్నారు అధ్యక్షా. ఈరోజు మేము చెప్తున్నాం. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆరోజు హామీలు ఇచ్చాము. హామీలు నిలబెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తాం..

(శ్రీ టి.హరీష్ రావు మైకు లేకుండా.. ఇంతసేపా సార్ అన్నారు)

వారు స్వీపింగ్ రిమార్క్స్ చేశారు. దానికి మేము సమాధానం చెపుతున్నాము. It is our right. When somebody is misleading the House, it is my

responsibility to correct it and put before the House. సార్ నేను గౌరవ శాసన సభ్యులను కోరుతున్నాను. వారు కూడా ఇక్కడ ఉండి అనేక సందర్భాలలో మాట్లాడటం జరిగింది. I am clarifying the Government's stand. నేను కూడా గౌరవ పెద్దలను కోరుతున్నాను. పెట్టుబడులకు సంబంధించిన అంశం వచ్చేవరకు, I just want to clarify the point.

శ్రీ కడియం శ్రీహరి:- సార్ 10.15 నిమిషాలకు నాకు అవకాశం ఇచ్చారు, ఇపుడు 11.05 నిమిషాలు అవుతుంది. దాదాపు 35 నిమిషాలు నన్ను ఇంటరప్ట్ చేశారు అధ్యక్షా. నాకు గంట సమయం ఇస్తా అన్నారు కాని 25 నిమిషాలే దొరికింది. ఇంకా చాలా సబ్జెక్టు చెప్పేదుంది. శ్రీధర్‌బాబు గారిచ్చిన వివరణతోని ప్రస్తుతానికి నేను సంతృప్తి చెందుతున్నాను. వారు చెప్పింది కరెక్టా, నాదగ్గరున్న సమాచారం కరెక్టా నేను మళ్ళొకసారి డాక్యుమెంటు వెరిఫై చేయాలి. ఉదాహరణకు JSW Energy అని ఒక సంస్థ ఉంది. వీళ్ళు ఏప్రిల్ 2022 సంవత్సరంలో గవర్నమెంటుతో ఎంఒయు చేసుకున్నారు. ఇదే కంపెనీ మళ్ళీ ఎంఒయు చేసుకున్నట్లుగా వుంది. ఒకవేళ పాత ఎంఒయుకి అదనంగా ఎనర్జీ ప్రొడక్షన్‌కు ఎంఒయు చేసుకున్నట్లు శ్రీధర్‌బాబుగారు చెపితే, we agree for that. కానీ నా అనుమానం ఏంటంటే దీన్నే రీరైట్ చేసుకున్నారేమో అని నేననుకుంటున్నాను. శ్రీధర్‌బాబుగారు మీరుకూడా ఒక్కసారి వెరిఫై చేయండి. మీరు శాసన సభ వ్యవహారాల మంత్రిగా, ఒక బాధ్యత కలిగిన మంత్రిగా కొత్త ఎంఒయు అని మీరు అంటున్నారు. నేను మీ స్టేట్‌మెంట్‌ను గౌరవిస్తున్నాను, but I have my own doubt, that it was re-written. పాత ఎంఒయునే రీరైట్ చేశారు, వెరిఫై చేసుకుని రిప్లైలో చెప్పండి.

అధ్యక్షా, వ్యవసాయానికి సంబంధించి అద్భుతమైన విజయాలను తెలంగాణ సాధించింది. 2014-15 సంవత్సరం నుండి 2022-23 సంవత్సరం వరకు ఈ పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం యొక్క మొట్టమొదటి ప్రాధాన్యం వ్యవసాయం. రైతులను రాజులను చేయాలి, వ్యవసాయాన్ని పండుగను చేయాలనే ఆలోచనతో అనేక ప్రోత్సాహకాలు ఇచ్చాము. దేశంలో ఎక్కడా లేని ప్రోత్సాహకాలను తెలంగాణలో ఇచ్చాము. మొట్టమొదటగా లక్షరూపాయలు రైతుల రుణమాఫీ చేశాము, రెండవ విడతలో మరొక లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలనే ఆలోచనతో చాలా వరకు రుణమాఫీ చేశాము. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చి ఎకరానికి ప్రతి సంవత్సరం పదివేల రూపాయల పెట్టుబడి సహాయం చేశాము. రైతుబీమా సౌకర్యాన్ని కల్పించాము. రైతు పండించిన పంటలను ప్రభుత్వమే నేరుగా ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేసింది. దేశంలోనే వ్యవసాయానికి 24 గంటలు ఉచితంగా కరెంటుని సరఫరా చేసిది తెలంగాణ రాష్ట్రం. అంతేకాకుండా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులన్నిటినీ కూడా పూర్తి చేసి రెండు పంటలకు సాగునీరు ఇచ్చాము. దానికి ప్రకృతి కూడా సహకరించింది. భూగర్భ జలాలు పెరిగాయి. బ్రహ్మాండంగా పంటలు పండాయి. అయ్యా, మీరు మాట్లాడేముందు నేను మీకొక సమాచారం చెపుతున్నాను. మీ మంత్రులతోని క్రాస్ వెరిఫై చేసుకోండి.

అధ్యక్షా, 2014-15 సంవత్సరంలో పంటల సాగు విస్తీర్ణం 1 కోటి 31 లక్షల ఎకరాలు. 2022-23 సంవత్సరానికి వచ్చేసరికి 2 కోట్ల 8 లక్షల ఎకరాలు. మీరు వెరిఫై చేసుకోండి, ఉత్తిగనే నన్ను ఇంటరప్ట్ చేయడానికి మాట్లాడకండి. అదేవిధంగా ప్యాడీ ప్రొడక్షన్.. ఇది దాస్తే దాగేది కాదు. సివిల్ సప్లైస్ కార్పోరేషన్ వాళ్ళని వివరాలు అడిగినా ఇస్తారు. ప్యాడీ ప్రొడక్షన్ 2014-15 సంవత్సరంలో 68 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే 2022-23 సంవత్సరానికి వచ్చే సరికి 2 కోట్ల 58 లక్షల టన్నులకు పంటల దిగుబడి పెరిగింది.

11.10 ఉ. చివరికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో దిగుబడి అవుతున్న ధాన్యం మేము కొనుగోలు చేయలేము, మా దగ్గర స్టోరేజి కెపాసిటీ లేదు అని చెప్పి చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది. ఇవ్వాళ భారతదేశంలోనే పంజాబ్ తరువాత అతి ఎక్కువ వరి ధాన్యం పండిస్తున్న రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రమే. ఇది తెలంగాణ సాధించిన విజయం కాదా, ఇది తెలంగాణ రైతాంగం సాధించిన విజయం కాదా, ఇది కేసీఆర్ సాధించిన

విజయం కాదా అని చెప్పి నేను ఈ సందర్భంగా అడుగుతున్నాను. అధ్యక్షా, ఒక్కసారి ప్యాడీ పర్చేజ్ గురించి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వాళ్లిచ్చిన ఫిగర్ చూద్దాం, అన్నీ పక్కకు పెట్టి. 2014-15లో 24.3 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేశారు. కాని 2020-21లోకి వచ్చేసరికి 1 కోటి, 41 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కొన్నది. ఇంతకంటే నిరూపణ ఏం కావాలి? 600 శాతం ఎదుగుదల. భారతదేశంలోనే అత్యధిక పంటల దిగుబడి సాధిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఒక రికార్డు సృష్టించింది. వ్యవసాయం చిన్నాభిన్నమయిందని మాట్లాడుతున్నారు. మొన్న ముఖ్యమంత్రిగారి స్టేట్‌మెంట్ ఒకటి నేను విన్నాను.

అందులో వారు ఏమన్నారు? డిసెంబర్ 9నాడు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడబోతున్నది. నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నాను. నా మొట్టమొదటి సంతకం రెండు లక్షల రూపాయల రైతుల రుణ మాఫీ పైన ఉంటుంది అని ముఖ్యమంత్రిగారు చేసిన ప్రకటన అధ్యక్షా ఇది. నాది కాదు అది. ఈ ప్రకటన ఎన్నడు చేశారు? ఎన్నికలకు ముందు. డిసెంబర్ 9 పోయింది అధ్యక్షా. రెండు నెలలు అయింది. తరువాత ఇంకొక మాట అన్నారు. ఎవరి దగ్గరైతే రుణాలు లేవో, ఎవరైతే బ్యాంకుల దగ్గరకు పోయి రుణాలు తెచ్చుకోలేదో వాళ్లు అర్జెంటుగా బ్యాంకులకు వెళ్లండి, రెండు లక్షల రూపాయల రుణాలు తీసుకోండని చెప్పారు. ఆ వీడియో కూడా మీ దగ్గర ఉంది. సభ్యులందరికి కూడా తెలుసు. ఏం జరిగింది అధ్యక్షా? ఆ మాటే మేం మాట్లాడుతున్నాము. రుణ మాఫీ పైన ఈరోజు వరకు కూడా స్పష్టత లేదు. బ్యాంకులతో మాట్లాడతామంటున్నారు. నేను చెబుతున్నా. అయ్యా శ్రీధర్‌బాబు గారూ నేను చెబుతున్నా. బ్యాంకులు రైతుల రుణ మాఫీని టేకోవర్ చెయ్యరు. ఎవరన్నా అధికారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తే దాన్ని నమ్మకండి. మీరు అవస్థల పాలవుతారు. బద్నాం అయితారు. ఎందుకంటే ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక నిర్ణయం తీసుకున్నది. ఆర్‌బిఐ చాలా స్పష్టంగా చెప్పింది. రైతుల రుణ మాఫీని టేకోవర్ చేసే అవకాశం లేదు అని. మొన్న ముఖ్యమంత్రిగారు ఒక మాటన్నారు. మేము బ్యాంకులతో సంప్రదిస్తున్నాము, రైతుల రుణ మాఫీ గురించి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అది జరుగుతదని నాకు నమ్మకం లేదు. మీరు బద్నాం పాలవుతారని నేను చెప్పదలచుకున్నాను. హెచ్చరించదలచుకున్నాను. అంతే తప్ప వేరే ఉద్దేశం నాకు లేదు. త్వరితగతిన రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా, వ్యవసాయాన్ని కాపాడుకునే విధంగా, రైతులకు రెండు లక్షల రూపాయల రుణ మాఫీని చేయాలని, ఎప్పటిలోగా చేస్తారు, ఏ విధంగా చేస్తారో స్పష్టత ఇవ్వాలని మాత్రమే నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని చెప్పి, మీ ద్వారా సవినయంగా తెలియజేసుకుంటున్నాను.

అదే విధంగా అధ్యక్షా, ఇరిగేషన్‌కి సంబంధించి చాలా మాటలు మాట్లాడుతున్నారు అధ్యక్షా. వాస్తవంగా మొన్న శ్వేతపత్రంలోగాని, మళ్లీ రేపు శ్వేత పత్రం పెడతామంటున్నారు. తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థ ఏ రకంగా ఉంది అనే దానిపైన శ్వేతపత్రం పెడతామంటున్నారు, పెట్టండి. We will welcome it, and we will participate. ఇబ్బందేం లేదు. కాని నిన్న ముఖ్యమంత్రిగారు మేడిగడ్డకు వెళ్లి, ఒక ఇంజనీర్‌తో మాట్లాడుతున్నది నేను టి.వి. ఛానల్‌లో చూశాను. వారు ఆ ఇంజనీర్‌గారిని ఏమడిగారంటే ఇప్పటివరకు మేడిగడ్డ పైన ఎంత ఖర్చుపెట్టారని అడిగారు. సారీ, కాళేశ్వరం పైన ఎంత ఖర్చు పెట్టారని అడిగారు. అంటే వారు రూ.94 వేల కోట్లు అని చెప్పారు. ఎంత కొత్త ఆయకట్టు వచ్చిందని అడిగితే, 98 వేల ఎకరాలని బదులు చెప్పారు. కాని కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరించిన ఆయకట్టు గురించి అక్కడ ఇంజనీర్ చెప్పడానికి ప్రయత్నం చేస్తే, ఆయనకు చెప్పే అవకాశం ఇవ్వకుండా కట్ చేశారు. ఆయకట్టు కొత్తదే కాదు అధ్యక్షా, ఒక ప్రాజెక్టు క్రింద కొత్త ఆయకట్టు వస్తుంది, స్టెబిలైజేషన్ కూడా వస్తుంది. ఈ రెండూ కూడ ప్రతి ప్రాజెక్టు క్రింద ఉంటాయి. అది మరిచిపోయి, తప్పుడు సమాచారం ప్రజలకు ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇవ్వాళ తెలంగాణ వ్యాప్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు క్రింద ఎన్ని రిజర్వాయర్లు వచ్చాయి అధ్యక్షా? ఏ రకంగా స్టోరేజి కెపాసిటీని పెంచుకున్నాం? ఏ రకంగా కాలువల నిర్మాణం చేసుకున్నాం? ఏ రకంగా ఇవ్వాళ మెదక్‌లో అనేక రిజర్వాయర్లు వచ్చాయి? అలాగే

కరీంనగర్‌గాని, మెదక్‌గాని, వరంగల్‌గాని కాళేశ్వరం ద్వారా లబ్ధి పొందాయి? ఏ రకంగా ఇవ్వాళ కాకతీయ కాలువ నిండుగా కోదాడ, హుజూర్‌నగర్ దాకా వెళ్లింది? ఏ రకంగా తుంగతుర్తిలో బ్రహ్మాండంగా పంటలు పండుతున్నాయి? ఏ రకంగా కోదాడలో బ్రహ్మాండంగా పంటలు పండుతున్నాయి? ఇవన్నీ నిండుగా వచ్చిన కాకతీయ కాలువ నీళ్ల ద్వారా కాదా? ఇది మీరు చూడలేదా? ఇవన్నీ జరుగుతున్నాయి కదా? దాన్ని మనం గోరంతలు కొండతలు చేసి ఏదో జరిగిపోయింది అని చెప్పి, మొత్తం వ్యవహారమంతా దాని మీదకే డైవర్ట్ చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరైంది కాదు. నేనేమంటున్నానంటే ..

శ్రీ పొన్నం ప్రభాకర్:- కరీంనగర్ పేరు తెచ్చారు కాబట్టి నేను కొంత చెప్పాలి. అధ్యక్షా వారు కూడా ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఆ తరువాత హరీష్‌రావుగారు ఉన్నారు. గతంలో కాలువలు పారలేదా అధ్యక్షా? వాళ్లు ఆ విధంగా మాట్లాడితే మనం ఏం చేస్తాం? కాలువలు తవ్విన కాలం నుండి చరిత్ర తియ్యండి. వరద కాలువ ఎవరు తీశారో, శ్రీరాం సాగర్ ఎవరు కట్టారో, ఎల్లంపల్లి, లోయర్ మానేర్ ఎవరు కట్టారో, అప్పర్ మానేర్ 9వ ప్యాకేజి ఇప్పటికి పూర్తి చేయలేదు. పదేళ్ల యువరాజు (సభ్యులు శ్రీ కె. తారక రామారావు గారిని ఉద్దేశించి) ఆయన మాట్లాడితే ఎలా అధ్యక్షా? అందుకే గోదావరి పరివాహక ప్రాంత బిడ్డగా, హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టు కడితే దానికి డిస్ట్రిబ్యూషన్ సిస్టమే లేదు. 80 శాతం పూర్తయిన ప్రాజెక్టుని మీరొచ్చి 2014లో గౌరవ కేసీఆర్ గారు నేను కుర్చీ వేసుకుని పూర్తిచేస్తా అన్న ప్రాజెక్టు ఇంకా పూర్తి కాకపోతే, దానికేం జవాబు చెబుతారు? గోదావరి పరివాహక ప్రాంతంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందే 80 శాతం పనులు జరిగాయి. ఆనాడు వరి ఉత్పత్తిలో ఈస్ట్, వెస్ట్ గోదావరితో పోటీ పడ్డ జిల్లా నాది. మేమే తెచ్చామని వారు చెప్పడం పెద్ద పొరపాటు. సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆనాడు కూడ ఉమ్మడి రాష్ట్రంలో వరి ఉత్పత్తిలో కరీంనగర్ జిల్లా ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాలను దాటిపోయే పరిస్థితి ఉంది. ఆ రికార్డు సభలోకి తెప్పించి చూడండి.

ఇవ్వాళ ఖచ్చితంగా కరీంనగర్ జిల్లా, ఎల్లంపల్లి ప్రాజెక్టు కావచ్చు, లోయర్ మానేర్ ప్రాజెక్టు గురించి మేము చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడే చదివాను అధ్యక్షా. కడియం శ్రీహరిగారి ప్రాంతం ఘన్‌పూర్ నియోజకవర్గానికి నీళ్లొచ్చాయి. గౌరవెల్లి ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి? పది సంవత్సరాల్లో దాన్ని ఎందుకు పూర్తిచేయలేదు? నీళ్లిచ్చారా? గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి అయినట్లయితే ఎందుకు నీళ్లివ్వడం లేదని అడుగుతున్నాను. కాలువలు ఎక్కడున్నాయి, వచ్చి చూపించండి. అబద్ధం వారు చెబుతున్నారా, మేము చెబుతున్నామా అనేది మనం అక్కడికి వెళ్లి చూస్తే తెలుస్తుంది అధ్యక్షా. బండ్ పూర్తిచేశారు, కాని దానికి కాలువలే లేవు. కాంగ్రెస్ హయంలో కాలువలే లేవు అని తప్పుడు సమాచారం ఇస్తున్నారు. నీళ్లే లేవని మాట్లాడితే ఎలా? తుమ్మలు మొలిచినయి.

(అంతరాయం)

అధ్యక్షా, వాళ్లు భయపెట్టిస్తే నేను భయపడేవాడిని కాను. కూర్చోమంటే కూర్చోవడానికి నేను పాలేరు కాదు.

11.20 ఉ. అధ్యక్షా, మాజీ మంత్రిగారు కూర్చో, కూర్చో అని బెదిరిస్తున్నారు, వారు చెబితే నేను కూర్చోను. మీరు చెబితే నేను కూర్చుకుంటాను.

మిస్టర్ స్పీకర్:- ఒక్క నిమిషం మంత్రిగారు.. గౌరవ కేటీఆర్‌గారూ..

(ఈ దశలో అధికారపార్టీసభ్యులు, బీఆర్ఎస్‌పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ పొన్నం ప్రభాకర్:- ఎవరికైనా వినడానికి ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.

మిస్టర్ స్పీకర్:- ఒక్క నిమిషం అందరూ కూర్చోండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- ఎన్నికలలో ఓట్లు వేయకపోతే భార్యాపిల్లలను చంపుకుంటానని అడిగిన వాళ్లు ఇక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వాళ్లు వెళ్లిపోవచ్చు. ఎన్నికలలో ఓట్లు వేయకపోతే భార్యా పిల్లలతో శవయాత్ర చూడాల్సి వస్తుందని మాట్లాడే వాళ్లు కూడా ఇప్పుడు మాట్లాడితే ఎలా? ఆఖరికి సానుభూతి లేకుండా 12ఏండ్ల పాపతో మీరు ఓటు

వేయకపోతే మేము చనిపోతాము అని అనిపించిన వాళ్లు కూడా ఇక్కడ మాట్లాడితే ఎలా? మొన్న గౌరవ గవర్నరుగారు కూడా రాజకీయాలు బ్లాక్ మెయిల్ కావద్దని అన్నారు. అటువంటి వాళ్లు ఇప్పుడు మాట్లాడితే ఎలా? ఇదేమి నైతికత? ఈరోజు ఏమి నైతికత ఉన్నది. 12ఏండ్లపాప మానసిక పరిస్థితి ఏమి కావాలి? అటువంటి వారు ఎన్నికలలో ప్రజలు ఓట్లు వేయకపోతే ఆత్మహత్య చేసుకొంటే మీరే (ప్రజలను ఉద్దేశించి) శవయాత్ర చేయాల్సి ఉంటుందని బ్లాక్‌మెయిల్ చేసిన వాళ్లు కూడా ఈరోజు మాట్లాడితే ఎలా?

కరీంనగర్‌కు సంబంధించి కరీంనగర్ బిడ్డగా ఇరిగేషన్ ప్రాజెక్టులో ఉమ్మడి రాష్ట్రంలో కూడా అభివృద్ధి జరిగింది. దాని తర్వాత కాంగ్రెస్ పార్టీలో మేమందరం వరద కాలువలను ఏర్పాటు చేసుకోకపోతే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులకు నీళ్లు ఎక్కడివి? లోయర్ మానేరు ఎవరు కట్టారు? ఎల్లంపల్లిని ఎవరు కట్టారు? దానిమీద చెప్పకుండా ఏదిపడితే అది చెబితే ఎలా? అదే హరీష్‌రావు గారి దగ్గర మల్లన్న సాగర్ అవుతుంది, కొండపోచమ్మ అవుతుంది. కేసీఆర్‌గారు కుర్చీ వేసుకొని కడుతామన్న ప్రాజెక్టు పూర్తి కాలేదని దయచేసి ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. వాళ్లు కూర్చోమంటే భయపడి కూర్చునే రకం నేను కాదు. మీ ఆదేశాన్ని పాటిస్తాను, తప్పకుండా సభామర్యాదను కాపాడుతాను.

మిస్టర్ స్పీకర్:- గౌరవ కేటీఆర్‌గారూ, మీరు సీనియర్ శాసనసభ్యులు ఒక మంత్రి మాట్లాడేటప్పుడు సభామర్యాదను కాపాడాల్సింది పోయి మీరు ఆ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసి గౌరవ మంత్రిని అమర్యాద పరచడం సమంజసం కాదు. దయచేసి ఇలాంటి రన్నింగ్ కామెంట్రీలు చేయవద్దని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

(ఈ దశలో బీఆర్ఎస్ పార్టీ సభ్యులు శ్రీ కె. తారక రామారావుగారు వారి పేరును తీసుకున్నందుకు ఆయనకు మైకు ఇవ్వమని అడిగారు)

నేను ఈల్డ్ అయ్యే సమస్యే లేదు. కడియం శ్రీహరిగారూ మాట్లాడండి. మీరు రన్నింగ్ కామెంట్రీ చేసినందుకే పేరు తీసుకున్నారు. కడియం శ్రీహరిగారూ, మీరు మాట్లాడండి. శ్రీహరిగారు మాట్లాడిన తర్వాత వారికి మైకు ఇస్తాను. మీరు రన్నింగ్ కామెంట్రీ ఆపండి.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ఇరుపక్షాల వారు రన్నింగ్ కామెంట్రీ ఆపాలని చెబుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు నేను మాట్లాడిన దానిపైన ఇంటర్‌ఫియర్‌ై మీ అనుమతితో ఏదైనా వివరణ ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చు. కానీ వాళ్లు దాన్ని అడ్వాన్‌టేజ్‌గా తీసుకుని ఉపన్యాసాలు ఇస్తే ఎలా? దానిని మీరు కంట్రోల్ చేయాలి కదా. మేము అరుస్తున్నాము, వాళ్లు అరుస్తున్నారనే దాని కంటే ముందు మంత్రులు కూడా సంయమనం పాటించాలి కదా. వారు ఏమి మాట్లాడదల్చుకున్నారు, వివరణ ఏమి ఇవ్వదల్చుకున్నారనేది చెప్పాలి కదా. అలాకాకుండా ఉపన్యాసాలు ఇస్తే ఎలా? That's not good. అది సాంప్రదాయం కూడా కాదు.

కోటీ ఇరవై అయిదు లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని నీటిపారుదల శాఖకు ప్రాధాన్యతను ఇచ్చి ఈ పది సంవత్సరాలలో ఒక లక్షా ముప్పై ఆరు వేల కోట్ల రూపాయలు నీటిపారుదల రంగంపైన ఖర్చు చేయడం జరిగింది. మిషన్ కాకతీయ ద్వారా కానీ, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం ద్వారా కానీ, వాగులపైన చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వల్ల కానీ బ్రహ్మాండంగా నీటిపారుదల వ్యవస్థ మెరుగుపడింది. భూగర్భజలాలు కూడా గణనీయంగా పెరిగాయి. అందుకే రెండు పంటలకు సాగునీరు ఇచ్చాము. మేడిగడ్డ వద్దకు నిన్న ముఖ్యమంత్రిగారు, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వెళ్లి చూశారు. ఆ మేడిగడ్డ బ్యారేజీ కుంగడమనేది చాలా బాధాకరం, విచారకరం. దానికి బాధ్యులు ఎవరైనా విచారణ జరిపించండి. వాళ్లపైన చర్య తీసుకోండి. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు మిమ్మల్ని కూడా గౌరవించకపోతే ఎలా? వాళ్లు ఏమి మాట్లాడుతున్నారు. నేను మాట్లాడే దానికి మీ దగ్గర సమాచారం ఉంటే సబ్జెక్ట్ ఉంటే

మీ అనుమతితో మైకు తీసుకొని మాట్లాడమనండి, మేము వింటాము. మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. వీటన్నింటిని చేపట్టడం వల్ల కోటీ ముప్పై అయిదు లక్షల ఎకరాలకు సాగు నీటిని ఇచ్చాము. బ్రహ్మాండంగా పంటల విస్తీర్ణం, పంటల దిగుబడి పెరిగింది. అయితే మేడిగడ్డకు సంబంధించి ఒక పాయింట్ చెబుతాను. కాళేశ్వరం ప్రాజెక్టులో అనేక కాంపోనెంట్స్ ఉన్నాయి. బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లు, కెనాల్స్, సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అందులో ఒక కాంపోనెంట్ మేడిగడ్డ. ఆ మేడిగడ్డలో సుమారు రెండో, మూడో పిల్లర్లు కుంగిపోయాయి, పగుళ్లు వచ్చాయి, వారు చూశారు. మీడియాలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. దానిపైన మీరు సమగ్రమైన విచారణ జరిపించండి. బాధ్యులెవరైనా వాళ్లపైన చర్య తీసుకోండి మాకు ఏమి అభ్యంతరం లేదు. కాకపోతే తెలంగాణ రైతాంగం తరపున నాదొక విజ్ఞప్తి ఉన్నది. రేపు మళ్లీ జూన్, జులైలో వర్షాలు వస్తాయి. గోదావరికి వరదలు వస్తాయి. వరదలు వచ్చేలోపు మీరు నిపుణులతో సంప్రదించి ఏదైతే రెండో, మూడో పిల్లర్లకు సంబంధించి ఎంత పోర్షన్ ఆ బ్యారేజ్ డ్యామేజ్ అయిందో దానికి ముందు కాఫర్ డ్యామ్ నిర్మించి...

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

విచారణ చేయండని చెబుతూనే ఉన్నాను. దయచేసి ప్రభుత్వానికి నేను సూచన చేస్తున్నాను, విమర్శ చేయడం లేదు. మీరు విచారణ చేయండి. చర్యలు తీసుకోండి. ఎవరున్నా పర్వాలేదు. తెలంగాణ రైతాంగం తరపున ఒక సూచన ఏమంటే వెంటనే ఆ బ్యారేజ్ ఏ పోర్షన్ అయితే డ్యామేజ్ అయిందో ఆ డ్యామేజ్ అయిన పోర్షన్ రిపేర్ చేసి దాన్ని రీస్టోర్ చేయాలి. అది చేయాలంటే ముందుగా వరదలు రాకముందే చిన్నగా కాఫర్ డ్యామ్ కట్టుకొని నీళ్లు రాకుండా చూసుకొని ఆ పోర్షన్‌ను తొలగించి.. అది కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ఎలా ఉందో నేను చూడలేదు. చదవలేదు. కాబట్టి ప్రభుత్వాన్ని నేను కోరుతున్నదేమంటే, తక్షణమే ఆ మేడిగడ్డ బ్యారేజ్‌ను రిపేర్ చేసి రీస్టోర్ చేయాలి. రైతులకు సాగునీరు అందించాలి లేకుంటే వరదల వచ్చిన తర్వాత ఇంకా తీవ్రమైన ప్రమాదం జరుగుతుంది. దయచేసి దానిని రాజకీయం చేయాలనుకుంటే చేయండి. కానీ ప్రజల కోణం నుంచి కూడా ఆలోచించండి. తెలంగాణ రాష్ట్ర కోణం నుంచి ఆలోచించండి. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించండి. వెంటనే మేడిగడ్డను రిపేర్ చేసి రీస్టోర్ చేసి రైతాంగానికి అందుబాటులోకి తీసుకొనిరావాలని మీ ద్వారా కోరుతున్నాను.

11.30 ఉ. అధ్యక్షా, దాదాపు నేను మాట్లాడింది 30 నిమిషాలే. మీరు రికార్డు చూడండి, మొత్తం వాళ్లే మాట్లాడారు. నేను మాట్లాడింది చాలా తక్కువ. ఇవ్వాళ మన తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పవర్ సెక్టార్‌ని అభివృద్ధి చేసుకున్నాం. ఎంత బ్రహ్మాండంగా పవర్ సెక్టార్‌ని అభివృద్ధి చేసుకున్నామంటే 24 గంటల కరెంటు వ్యవసాయ రంగానికి ఇచ్చినా, 24 గంటల కరెంటు అన్ని రంగాలకు సంబంధించిన వినియోగదారులకు ఇచ్చినా ఎక్కడా కూడా ఇబ్బంది కలుగకుండా గ్రిడ్ ఫెయిల్యూర్ కాకుండా... అధ్యక్షా, చాలామంది ఈ హౌస్‌లో పెట్టే డాక్యుమెంట్స్ చదవాలని నేను కోరుకుంటున్నాను. పవర్‌పైన ఒక శ్వేతపత్రం ప్రజెంట్ చేశారు. ఆ శ్వేతపత్రంలో ఏముందంటే, తెలంగాణ రాష్ట్రంలో 19 గంటల కరెంటు వ్యవసాయ రంగానికి ఇస్తున్నట్లుగా చాలా స్పష్టంగా మీ శ్వేతపత్రంలోనే ఉన్నది.

(అధికార పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

అరే, మీరు ఇంత అమాయకంగా ఉంటే ఎట్లా? సబ్జెక్టు నాలెడ్జ్ లేకపోతే నేనేమి చేయాలి. మీరు పెట్టిందే, నేను పెట్టింది కాదు. మంత్రులను అడగండి, వాళ్లు చెబుతారు. వారు 13 గంటలే ఇచ్చామని అంటున్నారు అది పచ్చి అబద్ధం. అందుకనే చూడమని అంటున్నాను. మన రాష్ట్రంలో బ్రహ్మాండంగా ఇన్‌స్టాల్డ్ కెపాసిటిని పెంచుకున్నాం. మన రాష్ట్రంలో దాదాపు రూ.30,360కోట్లు జెన్‌కో కు పెట్టుబడులు పెట్టి, దానిద్వారా ఇన్‌స్టాల్డ్ కెపాసిటిని పెంచుకున్నాం. ట్రాన్స్‌మిషన్ లైన్స్ కొరకు ట్రాన్స్‌కో మీద రూ.11,530కోట్లు ఖర్చు పెట్టాం. మొత్తంగా రూ.41,893కోట్లు జెన్‌కో మరియు ట్రాన్స్‌కో మీద ఖర్చు పెట్టాము. పవర్ సెక్టార్ అప్పులపాలైంది, విద్యుత్ రంగం

అప్పుల పాలైందని వారు మాట్లాడుతున్నారు. ఎస్, అప్పులైనాయి రూ.81,516కోట్ల రుణం తీసుకున్నారు. కాని అసెట్స్ ఎన్ని క్రియేట్ అయినాయి అధ్యక్షా? రూ.1,37,571కోట్ల ఆస్తులు క్రియేట్ అయినాయి. అన్నింటికంటే మించి కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిన గణాంకాల ప్రకారం. ఇవ్వాళ అత్యధికమైన విద్యుత్ వినియోగం పర్‌క్యాపిటా పవర్ కన్జమ్షన్‌లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందంటే ఇది తెలంగాణ సాధించిన అభివృద్ధి అని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇది వాస్తవం కాదా? ఏ రకంగా మీరు దీన్ని deny చేస్తారు? ఏ రకంగా దీన్ని మీరు పచ్చి అబద్ధమని మాట్లాడుతారని చెప్పి నేను ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

అదేవిధంగా వైద్య రంగం. ఊహించని ప్రగతి మన వైద్యరంగంలో వచ్చింది. ఊహించని అభివృద్ధి మనం వైద్య రంగంలో సాధించాం. ఒకప్పుడు హెల్త్ ఇండికేటర్స్‌లో రాష్ట్రం 28వ స్థానంలో ఉండేది. ఈరోజు 3వ స్థానానికి వచ్చింది. 3వ స్థానానికి తెలంగాణ హెల్త్ సెక్టార్ ఎగబాకింది. కారణమేంటంటే, పర్ క్యాపిటా హెల్త్ బడ్జెట్‌ని పెంచుకున్నాం, హెల్త్‌కేర్ డెలివరీని పెంచుకున్నాం, ఆసుపత్రుల్లో బెడ్స్ పెంచాం, ఆక్సిజన్ బెడ్స్ పెంచాం. మెడికల్ కాలేజీలైతే అధ్యక్షా, ఒకప్పుడు గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ఐదు ఉంటే, ఇప్పుడు 29 మెడికల్ కాలేజీలున్నాయి. అంటే కొత్తగా 24 మెడికల్ కాలేజీలు తెలంగాణలో వచ్చాయి. గవర్నమెంట్ ఎంబిబిఎస్ సీట్లు 850 ఉంటే, ఈరోజు 3,915 ఉన్నాయి. గవర్నమెంట్ పి.జి. సీట్లు ఒకప్పుడు 515 మాత్రమే ఉంటే, ఈరోజు 1,320 పి.జి. మెడికల్ సీట్లు వచ్చాయి. గవర్నమెంట్ సూపర్ స్పెషాలిటీ సీట్స్ ఒకప్పుడు 72 ఉంటే, ఈరోజు 179 ఉన్నాయి. సోదరులు దామోదర రాజనర్సింహ గారు ఉన్నారు. వారు చెప్పేటప్పుడు చెప్పాలి నేను చెప్పే అంకెలు తప్పయితే. నేను ఇచ్చిన అంకెలు తప్పయితే వారు రిప్లైలో చెప్పొచ్చు, నాకేమి అభ్యంతరం లేదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

డయాలసిస్ సెంటర్స్ 82 ఏర్పాటు చేశాం, ఐసియు సెంటర్స్ 80, అదేవిధంగా బ్లడ్ బ్యాంక్స్ 56, ఎంసిహెచ్ సెంటర్స్ 28, గవర్నమెంట్ డెలివరీస్‌ను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచాం. వ్యాక్సినేషన్ వంద శాతం చేశాం. మెటర్నల్ మోర్టాలిటి రేటును 92 నుంచి 43కి తగ్గించాము. ఇన్ఫాంట్ మోర్టాలిటి రేటును 39 నుంచి 21కి మార్చాము. ఆ రకంగా నీతి ఆయోగ్ ర్యాంకులో ఇప్పుడు 3వ స్థానానికి చేరుకున్నాం. ఇది తెలంగాణ హెల్త్ సెక్టార్ సాధించిన ప్రగతి అని చెప్పి నేను ఈ సందర్భంగా మీ అందరికీ కూడా సవినయంగా తెలియజేసుకుంటున్నాను.

ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ ఈ సెక్టార్‌లకు మేము బ్రహ్మాండంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం, మా 6 గ్యారంటీలు, మా అభయహస్తం, మా డిక్లరేషన్స్ అన్నీ కూడా వాళ్ల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కొరకే ఉద్దేశించబడినవని చెప్పి చాలా బ్రహ్మాండంగా చెప్పారు. చాలా సంతోషం అధ్యక్షా, కాదనేది ఏమీ లేదు. కాని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా, యువత.. వీళ్ల సంక్షేమానికి సంబంధించిన కేటాయింపులు చూస్తే బాధాకరంగా ఉంది. ఉదాహరణకు ఒకటే ఒక ఎగ్జాంపుల్... ఎందుకంటే వారు మాటి మాటికి డిస్టర్బెన్స్ చేస్తున్నారు కాబట్టి ఒక మాట చెబుతున్నాను. మేనిఫెస్టోలో ఒక మాట చెప్పారు. యువతకు నిరుద్యోగ భృతి క్రింద నెలకు రూ.4,000/-లు ఇస్తామని చెప్పారు. ప్రియాంకగాంధీ గారు కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్‌లో నిర్వహించిన యూత్ డిక్లరేషన్‌లో పాల్గొంటూ నిరుద్యోగులకు నెలకు రూ.4,000/-ల భృతి ఇస్తామని చెప్పారు. దాని ఊసే లేదు, మర్చిపోయారు. యువత కొరకు 2 లక్షల ఉద్యోగాలిస్తాం, జాబ్ క్యాలెండర్‌ని ప్రకటిస్తామని చెప్పారు. కాని జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. అంతకుముందు ఎస్సీ, ఎస్టీల కోసం మేము దళిత బంధు అనే కార్యక్రమాన్ని తీసుకువస్తే, దాని పేరు మార్చి డా. బి.ఆర్. అంబేద్కర్ అభయహస్తం పేరిట రూ.12 లక్షల ఆర్థిక సహాయం చేస్తాం, వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే విధంగా చూస్తామని చెప్పారు. బడ్జెట్‌లో దాని ప్రస్తావన లేదు అధ్యక్షా.

అదేవిధంగా బీసి సబ్‌ప్లాన్ పెడతాం, బీసీలకు 5 సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెడతాం, సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని

చెప్పారు. బీసి సబ్‌ప్లాన్ ప్రస్తావన లేదు. బీసీలలో బీసి వెల్ఫేర్‌కు 8 వేల కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. అంటే, ఎస్సీ, ఎస్టీ, బీసి, మహిళా, మైనారిటీలు, యువతను కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఈ బడ్జెట్‌లో మోసం చేసిందని చెప్పి ఈ సందర్భంగా నేను చెప్పదలచుకున్నాను. దారుణంగా..

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అబ్జెక్షన్ అధ్యక్షా, పెద్దలు శ్రీహరి గారు ఇప్పటికే గంట మీద 3 నిమిషాలు మాట్లాడారు. డిస్టర్బెన్సెస్‌కు సంబంధించి మీరు ప్రస్తావన చేశారు గనుక అది 5 నుంచి 8 నిమిషాల వరకు ఉన్నది. నేను కడియం శ్రీహరి గారిని కోరుతున్నాను, వారు మాట్లాడే ప్రతి అంశాన్ని కూడా మేము క్షుణ్ణంగా చూస్తా ఉన్నాం. ఎందుకంటే, వారికి ఉన్న అనుభవాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని, వారు మంచి సూచనలు, సలహాలు.. ఇది కేవలం ఓట్ ఆన్ అకౌంట్ గనుక రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంలో వారు చెప్పే మంచి సూచనలను కూడా అమలు చేయాలనే ఒక విశాల దృక్పథంతో పోవాలని అనుకుంటున్నాము. కాని వారు బాగానే మాట్లాడుకుంటూ, విమర్శ చేస్తలేమని అనుకుంటూ మెల్లగా విమర్శలు చేస్తున్నారు. ఈరోజు నేను కోరుతున్నాను. మా నాయకులు రాహుల్‌గాంధీ గారు ఒక ప్రధానమైన అంశాన్ని చెప్పారు. ఈరోజు బీసిలకు సంబంధించి కుల గణంకాలు చేపడతామని చెప్పారు. మొన్న క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేసింది. ఇదే సభలో మా సహచర సభ్యులు పొన్నం ప్రభాకర్ గారు కూడా ఆ తీర్మానికి సంబంధించి రేపో, ఎల్లుండో ఈ రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి బలహీన వర్గాలకు సంబంధించిన సంక్షేమాన్ని సెన్సెస్ చేసిన తరువాత వారికి కావలసిన, రావలసిన నిధులు హక్కు పరంగా కల్పించాలని ఒక ఆలోచనతో ముందుకు పోతా ఉన్న తరుణంలో దాన్ని స్వాగతించాలని గౌరవ సీనియర్ శాసన సభ్యులను, వారి పార్టీ సభ్యులను కూడా కోరుతున్నాం.

11.40 ఉ. అధ్యక్షా, ప్రధాన ప్రతిపక్ష సభ్యులు ఎస్సి,ఎస్టిలకు సంబంధించిన డిక్లరేషన్ గురించి ఇప్పటికే ఆరు సార్లు మాట్లాడారు. మేము అధికారంలోకి వచ్చి అరవై రోజులైంది మేము ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టాము. ఓట్ ఆన్ అకౌంట్ గురించి, ఇంకా రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో దానికి సంబంధించి సవరణలు చేసుకొని ముందుకు పోయే అవకాశం ఉంటుందని గౌరవ ప్రధాన ప్రతిపక్ష సభ్యులకు కూడా తెలుసు. కాబట్టి మీరు సలహాలు, సూచనలు ఇవ్వండి గాని ఇంకా ఏమీ కాలేదు అని అనడం పద్ధతి కాదు. ఇవన్నీ నాలుగున్నర సంవత్సరాల తరువాత మాట్లాడే అంశాలు. ఒకవేళ నిజంగా మేము ఏమి చేయకుండా ఆ ఆస్కారాన్ని మా కాంగ్రెస్ ప్రభుత్వం మీకు ఇస్తే అప్పుడు మాట్లాడండి, ఇప్పుడే ఎందుకు మాట్లాడుతున్నారు. దయచేసి మిమ్మల్ని కోరేదేమంటే తెలంగాణ రాష్ట్రాన్ని బాగు చేయాలని ముందుకు నడుస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగారికి, ఉపముఖ్యమంత్రి గారికి, మా శాసన సభ్యులకు మీ బీఆర్ఎస్ పార్టీ తరుపున రాష్ట్రప్రజలు కోరిన విధంగా ముందుకు వెళ్లమని సూచనలు, సలహాలు ఇవ్వండి కానీ కొత్తగా వచ్చిన ఈ ప్రభుత్వం ఇది చేయడం లేదు, అది చేయడం లేదని, పథకాలు అమలు చేయలేక పారిపోతారని అనడం సబబు కాదు. మా కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోయే ప్రసక్తే లేదు. మేము ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం, మేము పదే పదే చెబుతున్నదేమంటే మేమిచ్చిన ఆరు గ్యారంటీలకు సంబంధించి ఖచ్చితంగా అమలు చేస్తాం. ఇప్పటికే దానిని అమలు చేసే కార్యచరణ ప్రారంభించాం, తప్పకుండా అమలు చేసే ప్రయత్నంలోనే ఉన్నాము. ప్రతిపక్షం వారు దయచేసి మేము ముందుకు తీసుకొనిపోయే ఆలోచన, కార్యచరణ క్రమాన్ని ఇంకొంచెం ముందుకు తీసుకొని పోయేలా సహకరించాలని కోరుతున్నాను.

మా సోదరుడు రాజ్‌గోపాల్‌రెడ్డి గారు కూడా చాలా హామీలు ఇచ్చారు, ఎందుకంటే వారు కూడా బుక్కు తీసుకొని వచ్చారు అయినా గానీ వారికి ఎక్కువ సమయం ఇవ్వలేదు. మీరు ఆదేశించిన విధంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ శాసనసభ్యులు మాట్లాడుతున్నారు కాబట్టి మీకు సమయం ఇచ్చాము. ఇప్పటికే గంటకు పైగా వారికి సమయం ఇవ్వడం జరిగింది కాబట్టి దయచేసి వారిని కన్‌క్లూడ్ చేయాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, బీసీ కులగణనను మేము కూడా స్వాగతిస్తున్నాము. బీసీ కులగణన చేయాల్సిన

అవసరం ఉంది. తప్పకుండా ధామాషా ప్రకారం ఆ కులాలకు చెందవలసిన రాయితీలు, ప్రభుత్వ సహాయం అందవలసి ఉంది కాబట్టి దీనిని మేమేమి వ్యతిరేకించడం లేదు. బీసీ కులగణనకు ఎస్సి, ఎస్టి, మైనారిటి యువతకు సంబంధించి బడ్జెట్‌కు సంబంధం ఉండదని నేను అనుకుంటున్నాను. మీరు అన్ని క్లబ్ చేసి మాట్లాడుతున్నారు. నేను చెప్పేదేమంటే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది, దానిని ప్రస్తుత ప్రభుత్వం దళితబంధు అనే పేరుతో ఉన్న పథకాన్ని డా.బిఆర్ అంబేద్కర్ అభయ హస్తం అని పేరు మార్చారు. నేను ఆ పథకాన్ని ఇప్పుడే అమలు చేయాలని అనడం లేదు కానీ ఆ పథకం ప్రస్తావన కనీసం ఈ బడ్జెట్ పేపరులో ప్రస్తావించలేదు. డా.బి.ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పేరు మీద ఎస్సి, ఎస్టీలకు మా ప్రభుత్వం పన్నెండు లక్షల ఆర్థిక సహాయం ఇస్తుందనే ప్రస్తావన కూడా ఈ బడ్జెట్‌లో ప్రస్థావించకపోతే మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎట్లా నమ్ముతారనేది దయచేసి ఆలోచించమని కోరుతున్నాను.

రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి, మైనారిటి, బీసీ వర్గాల విద్యా వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్య అందించడం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 1022 గురుకుల పాఠశాలలను ప్రారంభించడం జరిగింది. ఈ రోజు ఆ గురుకుల పాఠశాలలు బ్రహ్మాండమైన ఫలితాలు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఎస్సి, ఎస్టిల పిల్లలు జాతీయ ఓపెన్ కాంపిటీషన్‌లో జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలో సీట్లు సంపాదిస్తున్నారంటే గురుకుల పాఠశాలల గొప్పతనమేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అందుకే ఈ ప్రభుత్వానికి కోరేదేమంటే గురుకుల పాఠశాలలను మరింత పటిష్టం చేయండి. గురుకుల పాఠశాలలతోబాటు మీరు ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను మండలానికి ఒకటి పెడుతామని అన్నారు, దానిని మేము అంగీకరిస్తాం కానీ బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయిస్తామని చెప్పారు. ఒక్క ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ పెట్టాలంటే 50కోట్ల రూపాయల కంటే తక్కువ కాదు కానీ మీరు బడ్జెట్‌లో కేటాయించిన 500 కోట్ల రూపాయాల బడ్జెట్‌కు పది స్కూళ్ల కంటే ఎక్కువ ఏర్పాటు చేయలేరు. మీ నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాము కానీ బడ్జెట్ మరింత పెంచాలని కోరుతున్నాము. ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూళ్లకు డిమాండు ఎక్కువ ఉంటుంది, మీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే మా నియోజకవర్గాలకు కావాలని డిమాండు చేస్తారు కాబట్టి ఆ డిమాండు మేరకు బడ్జెటు పెంచాలని ప్రత్యేకంగా కోరుతున్నాను. ఎస్సి, ఎస్టి, బీసీ, మైనారిటి వర్గాలకు సంబంధించి మీరు పెట్టాలనుకున్న బడ్జెట్‌ను మరొకసారి చూసుకోవాల్సిందిగా కోరుతున్నాను. ఈ ప్రభుత్వం మా మీద విరుచుకుపడడం కాకుండా బడ్జెట్ డాక్యుమెంటులో ఇచ్చిన కేటాయింపులు ఏవిధంగా ఉన్నాయి, గత ప్రభుత్వం బడ్జెట్‌కేటాయింపులు ఏ విధంగా ఉన్నాయి, ప్రస్తుత ప్రభుత్వం కేటాయింపులు ఏవిధంగా ఉన్నాయో ఒకసారి చూసుకొని సరిచేసుకోవాలి. మీరు మళ్లీ జూన్‌లో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు కాబట్టి కనీసం అప్పుడైనా సరిచేసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

ఇంకొక ముఖ్యమైన విషయం ఈ రోజు ముఖ్యమంత్రిగారికి ఏమి పని ఉన్నదో, వారు ఈ రోజు సభకు రాలేకపోయారు. కానీ వారు మాటి మాటికి కేసీఆర్ గారి ఆనవాళ్లు లేకుండా చేస్తానని అంటున్నారు. కేసీఆర్ మీద ఉన్న కోపంతోనో లేక రాష్ట్రం మీద ఉన్న కోపంతోనో తెలంగాణ ఆనవాళ్లనే మార్చేసే సందర్భాలు కనిపిస్తున్నాయి. ఒకటే ఒక ఉదాహరణ. ఈ విషయంలో నాతోబాటు మా తెలంగాణ సోదరులందరూ ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను. ఈ ప్రభుత్వం రాష్ట్రగీతంగా " జయ జయ జయహే " తెలంగాణను కేబినేట్ అప్రూవ్ చేసింది దాని గురించి చర్చ లేదు, ప్రభుత్వం మారింది కాబట్టి ప్రభుత్వాలు మారినప్పుడు పథకాల పేర్లు కూడా మారుతాయనే దాని గురించి కూడా మా ప్రధాన ప్రతిపక్షం తరపున అభ్యంతరం లేదు. కానీ మీ కాంగ్రెస్ ప్రభుత్వం స్టేట్ ఎంబ్లమ్‌ను కూడా మారుస్తామని అంటున్నారు. ఈ విషయంలో మాత్రం మా నుండి తీవ్రమైన అభ్యంతరం, నిరసన ఉందని తెలియజేస్తున్నాను. ఎందుకంటే స్టేట్ ఎంబ్లమ్‌లో ఏమున్నదంటే కాకతీయ కళాతోరణం ఉన్నది, గొప్ప చార్మినార్ ఉన్నది, ఈ రెండు ఎంబ్లమ్‌లు స్టేట్ ప్రైడ్‌లు.

ఇవి రెండు తెలంగాణ సంస్కృతికి, తెలంగాణ వారసత్వానికి చిహ్నాలు. కాకతీయ తోరణం, చార్మినారును కేసీఆర్ కట్టలేదు, అవి మన వారసత్వ సంపదలు. మీరు చదివారో లేదో జయజయ తెలంగాణలో ఆ గీతంలోనే పోతన్నది పురిటి గడ్డ, రుద్రమ్మది వీరగడ్డ, గండర గండుడు కొమరం భీముడే నీ బిడ్డ, కాకతీయ కళాప్రభల కాంతి రేఖ రామప్ప, గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్. తెలంగాణ రాష్ట్రంలో మీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రగీతంను ఆమోదిస్తూ, రాష్ట్రగీతంలో ఉన్న చిహ్నాలను చెరిపేసే ప్రయత్నాలు ఎందుకని అడుగుతున్నాను. ఈ విధంగా చేయడం తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ వారసత్వాన్ని, తెలంగాణ ప్రజానీకాన్ని అవమానపరిచినట్లే ఉన్నందున దీనికి సమాధానం ఇవ్వాల్సిందిగా మంత్రి శ్రీధర్‌బాబు గారిని అడుగుతున్నాను.

ఇంకొక విచిత్రమేమిటంటే.. వాటిని రాచరికపు చిహ్నాలు, గుర్తులు, రాచరికపు ఆనవాళ్లు అని అంటున్నారు. మరి మన అధికార చిహ్నంగా నాలుగు సింహాలు వాడుతున్నాము, ఈ నాలుగు సింహాల గుర్తు ఎక్కడి నుండి వచ్చింది మీరే ఆలోచించండి. అదే విధంగా ధర్మచక్రంగా అశోక చక్రం వాడుతున్నాము మరి ఇది ఎక్కడి నుండి వచ్చింది. ఈ చిహ్నాలు రాచరికపు ఆనవాళ్లు కాదా అని అడుగుతున్నాను. ఎర్రకోట మీద ఆగస్టు పదిహేనునాడు జెండా ఎగురవేస్తాం, అది మరి రాచరికపు ఆనవాళ్లు కాదా? అంటే ఏమి చేయలనుకుంటున్నారు మీరు అని అడుగుతున్నాను.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- శ్రీహరి గారు మీరు మాట్లాడండి.

శ్రీ కడియం శ్రీహరి:- నేను చెప్పే సబ్జెక్టు కాంగ్రెస్ పార్టీ సభ్యులకు అర్థం కావడం లేదు. ఈరోజు జాతీయ చిహ్నాలన్నింటిని కూడా.....

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

11.50 ఉ. **శ్రీ మందుల సామేలు**:- ఎవరిని అంటున్నారు. మంత్రి గారు మాట్లాడుతుంటే మీరు మాట్లాడతారా? అదేనా మర్యాద? మంత్రి గారు మాట్లాడుతున్నప్పుడు మీరు ఏం మాట్లాడారు, అదేనా సభా మర్యాద? గోల్కొండ కోటపై బండి యాదగిరి ఒక పాట రాశారు. నైజాం సర్కారోడా గోల్కొండ కోట కింద నిన్ను గోరీ కడతామని అన్నారు. ఆ మాట ఎందుకు అన్నారంటే దొరలు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు..పేదల పైన చేసిన దాడికి రజాకారులకు వంత పలికి పేదలను సర్వనాశనం చేశారు. అందుకోసమే ఆ గోల్కొండ కోటను ఏనాడో వదిలేశారు, అక్కడ మన జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చిన రోజున అక్కడ జెండాను ఎగరవేయడానికి కేటాయించారు. అక్కడ కాకుండా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఎందుకు ఆవిష్కరిస్తారు? అందుకోసమే మీ రాచరికపాలన సాగదు, నవంబరు 30వ తారీఖునాడు గుద్దుడు గుద్దితే డిసెంబరు 03 తారీఖునాడు మీరు ప్రతిపక్షంలోకి కూర్చున్నారు, ఇది ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యాన్ని రక్షించే అవగాహన కూడా మీకు లేదు. ప్రతిపక్ష సభ్యులు ప్రజాస్వామ్యాన్ని అవమానం చేశారు, ఇవ్వాళ ఒక మనిషిని మనిషిగా చూడలేదు, తెలంగాణ ప్రజానీకంని బానిసలను అనుకున్నారు, ఆ బానిసలు ఓటు అనే ఒక బాంబు పేలిస్తే మీరు వెళ్లి ప్రతిపక్షంలో పడ్డారు. మళ్లీ ఒకసారి ప్రతిపక్ష సభ్యులు మంత్రులను, వ్యవస్థను అవమాన పరిచే విధంగా శాసన సభలో మాట్లాడితే చరిత్ర క్షమించదని హెచ్చరిస్తున్నాను.

శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి:- (మైకు లేకుండా) ఒక్కదానిపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలి.

మిస్టర్ స్పీకర్:- శ్రీహరి గారూ, కంక్లూడ్ చేయండి.

శ్రీ కడియం శ్రీహరి:- నేను ఏమైనా విమర్శలు చేస్తున్నానా? నేనేమంటున్నానంటే రాచరిక చిహ్నము అనే పేరిట మన రాష్ట్ర అధికార ముద్ర నుంచి కాకతీయ తోరణాన్ని కానీ, చార్మినార్‌ను కానీ తొలగించవద్దని నేను చెబుతున్నాను. ఒక వేళ వాటిని తొలగిస్తామంటే అది వారి ఇష్టం, అది వేరు. భారతదేశ రాజముద్ర నాలుగు సింహాలు అశోక చక్రవర్తి గారు చెక్కించిన సారనాథ్ శిల్పాలలో ఉన్నవి. జాతీయ పతాకంలోని అశోక చక్రం కూడా రాచరిక చిహ్నమే, ఎర్రకోట కూడా రాచరిక

చిహ్నమే. అయినా 75 సంవత్సరాలుగా వాటిని కొనసాగిస్తూనే ఉన్నాము, తెలంగాణ అధికారిక ముద్రను మారుస్తామని చెప్పడం కరెక్టు కాదు. అంతమాత్రాన కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనడం కరెక్టు కాదు, అనుకోవడం కూడా కరెక్టు కాదు. ఎందుకంటే తెలంగాణ సాధించిన నాయకుడిగా, తెలంగాణ జాతిపితగా తెలంగాణ ప్రజల హృదయాలలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు చిరస్థాయిగా ఉంటారు.

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ఉదాహరణకు హైదారాబాద్ పట్టణంలో హైటెక్ సిటీలో సైబర్ టవర్స్ ఉంది, దాన్ని చంద్రబాబు నాయుడు గారు కట్టారని అనుకుంటాము, ఔటర్ రింగ్ రోడ్డు వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు హయాంలో నిర్మించారని అనుకుంటాము.

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- దయచేసి రన్నింగ్ కామెంట్స్ చేయకండి.

శ్రీ కడియం శ్రీహరి:- హైదరాబాద్‌లో అమరవీరుల స్తూపం, డా.బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్, డా.బి.ఆర్ అంబేద్కర్ గారి 125 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహం, పోలీస్ కంట్రోల్ రూంలను చూస్తే వాటిని కేసీఆర్ కట్టించారని అంటారే తప్ప రేవంత్ రెడ్డి గారు కట్టించారని అనరుకదా.. మీరు కేసీఆర్ ఆనవాళ్లు ఎట్లా చెరిపేస్తారు? కేసీఆర్ ఆనవాళ్లు ఎట్లా చెరిపేస్తారని నేను అంటున్నాను.

మిస్టర్ స్పీకర్:- దయచేసి మీరు కంక్లూడ్ చేయండి.

శ్రీ కడియం శ్రీహరి:- నేను కంక్లూడ్ చేస్తున్నాను, భారత రాష్ట్ర సమితి మీద ఉన్న కోపంతోనో, కేసీఆర్ మీద ఉన్న కోపంతోనో, కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న తపనతోనో తెలంగాణను అవమాన పరచకండి, తెలంగాణ అస్థిత్వాన్ని అవమానపరచకండి, కాకతీయుల రాజులను గౌరవించండి. లక్నవరం, రామప్ప, పాకాల, ఘనపురం చెరువులు మాకు కాకతీయులు ఇచ్చిన ప్రసాదం. వరంగల్ జిల్లా కేంద్రంగా... కాకతీయులు తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని, నీటిపారుదల రంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేశారు. బ్రహ్మాండమైన సరస్సులు కట్టారు, బ్రహ్మాండంగా గొలుసు కట్టు చెరువులను నిర్మించారు, బ్రహ్మాండంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. కాకతీయులు గొప్ప రాజులు వారి వల్లనే ఇప్పటికీ మన చెరువులు ఉన్నాయి, ఇప్పటికీ మన నీటి పారుదల వ్యవస్థ ఉన్నది. ఆ మహానుభావులు కట్టిన కాకతీయ కళాతోరణాన్ని తెలంగాణ రాజముద్ర నుంచి తొలగిస్తామంటే అది సబబా అని నేను అడుగుతున్నాను, ఇది ప్రజలను అవమానించినట్లు కాదా అని నేను అడుగుతున్నాను.

చార్మినార్ ఎందుకు కట్టారు? బహుశా చాలా మందికి తెలియదు, హైదరాబాద్ మహానగరంలో కలరా వచ్చింది, దీంతో ఉపాధి లేకుండా పోయింది. అనేక మంది కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో, కలరా సోకి చనిపోయిన వారి చిహ్నంగా చార్మినార్ కట్టారు. దాన్ని కూడా రాజముద్ర నుంచి తొలగిస్తామని అంటున్నారు, ఇది విచిత్రం, మంచిపద్ధతి కాదు. నేను కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, అభయ హస్తంలో మీరు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పెట్టిన అనేక హామీలు మొత్తంగా 420 హామీలను ప్రజలకు ఇచ్చారు. ఆ హామీలను నిలబెట్టుకునే విధంగా, వాటిని నెరవేర్చే విధంగా ఆర్థిక వనరులను సమీకరించుకొని ప్రజలకు మేలు చేసే ప్రయత్నం చేయండి, మీ సమయాన్ని ప్రతిపక్షంపైన దాడి చేయడానికో, భారత రాష్ట్ర సమితిని నిందించడానికో, కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయడానికో వెచ్చించకండి, తద్వారా తెలంగాణకు అన్యాయం చేయకండి అని ఈ సందర్భంగా అధికార పార్టీకి హితవు చెబుతూ నాకు సమయాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి:- ప్రతిపక్ష సభ్యులు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా ప్రవర్తించారో ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్న తరువాత కూడా వాళ్ల వైఖరి, బుద్ధి మారలేదు. వాళ్ల పద్ధతులు చూస్తుంటే ..బలహీన వర్గాల మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతుంటే కేటీఆర్ గారు అహంకారంతో కూర్చోవాలని అంటున్నారంటే కేటీఆర్ గారికి ఎంత అహంకారం ఉంది!

(ప్రధాన ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

తెలంగాణ ప్రజలు చెంప చెళ్లుమనిపించే విధంగా జవాబు ఇస్తే కూడా కేటీఆర్ వైఖరిలో మార్పు రాలేదంటే, వారి రాచరిక పాలనను వద్దని తెలంగాణ ప్రజలు మార్పు కావాలని బీఆర్ఎస్ పార్టీని ప్రతిపక్షంలోకి కూర్చోపెట్టారు, అయినా బుద్ధి రాలేదు.

నేను ఒక విషయం చెబుతాను, మొన్న కడియం శ్రీహరి గారు చాలా సీనియర్ నాయకులు, ఆయన సభలో మాట్లాడుతూ నా గురించి ఏమన్నారు? కడియం శ్రీహరి గారు చాలా సీనియర్ నాయకులు, మేధావి ఆయనంటే నాకు గౌరవం. ఆయన మొన్న సభలో నా గురించి ఏమన్నారు.. నీకు మంత్రి పదవి వచ్చేది లేదు, సచ్చేది లేదని అన్నారు. అంత సీనియర్ నాయకులు వారు, సభాపతి ద్వారా వారిని ఒక మాట అడుగుతున్నాను. మంత్రి పదవి నాకు వస్తదా రాదా? మా ప్రభుత్వం ఉంది, ముఖ్యమంత్రి, అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. కడియం శ్రీహరి గారూ, అది మీచేతిలో లేదు, నా చేతిలో లేదు. [1]*** రెండోసారి- [2]*** అది మాత్రం గుర్తు పెట్టుకోండి. అధ్యక్షా, నా గురించి అట్లా మాట్లాడవచ్చా?

(ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చారు)

మిస్టర్ స్పీకర్:- రాజగోపాల్ రెడ్డి గారూ ఒక్కనిమిషం, కేటీఆర్ గారూ, మాట్లాడండి.

12.00 మ. **శ్రీ కె. తారక రామారావు**:- అధ్యక్షా, మీరంటే మాకు అపారమైన గౌరవం ఉన్నది. మిమ్మల్ని మేం కోరేదేమంటే శాసనసభ బిజినెస్‌ను నడిపే క్రమంలో గౌరవ మంత్రులు, మేమేమైనా తప్పులు మాట్లాడినా లేదంటే ఏదైనా మాట్లాడకూడని మాట మాట్లాడినా, తప్పు మాట్లాడినా సవరించే అధికారం మీకున్నది. మీరు ఇంటర్‌వీన్ కావచ్చు, కరెక్షన్ చేయొచ్చు. కానీ దయచేసి తమరిని కోరేదేమంటే ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి 39మంది సభ్యులం ఉన్నాము. అధికారపక్షం నుంచి 64 మంది సభ్యులున్నారు. అధికారపక్ష సభ్యులకేమో మేం మాట్లాడేటప్పుడు మధ్యలో లేచినా మీరు సమయం ఇవ్వడమే కాకుండా వారు మమ్మల్ని వ్యక్తిగతంగా దూషించినా మీరు కనీసం మాకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదు. నా మొదటి డిమాండు ఏమిటంటే.. కడియం శ్రీహరిగారి మీద రాజగోపాల్‌రెడ్డి గారు చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడమే కాకుండా వారు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. ఉప ముఖ్యమంత్రిగా పనిచేయడంతోబాటు దాదాపు పదిహేను సంవత్సరాలపాటు మంత్రిగా పని చేసిన సీనియర్‌నాయకులైన గౌరవనీయులు కడియం శ్రీహరి గారి పట్ల రాజగోపాల్‌రెడ్డి గారు చేసిన వ్యాఖ్యలు సబబు కాదు. కాబట్టి ఆ వ్యాఖ్యలను దయచేసి రికార్డుల నుంచి తొలగించాలి. ఈ శాసనసభలో ఉన్న 119 మంది సభ్యులందరికీ ఒకటే రకమైన హక్కు ఉంటుంది. మా సభ్యులు అడిగితేనేమో మైకు ఇవ్వరు కానీ అధికారపక్షం నుంచి సభ్యులు ఎవరు అడిగినా మైకు ఇస్తున్నారు. వారు ఎప్పుడు అడిగినా మైకు ఇస్తున్నారు. వాళ్లను మాట్లాడమని మీరే ప్రోత్సహిస్తున్నారు. దయచేసి మీకు నా విజ్ఞప్తి ఏమిటంటే అందరు సభ్యులను ఒకటే పద్ధతిలో చూడాలి తప్ప ఈ రకంగా చూడటం భావ్యం కాదు. మీరు కూడా దయచేసి ఈ విషయంలో పునరాలోచించాలని నా విజ్ఞప్తి. ముందు రాజగోపాల్‌రెడ్డి గారు మాట్లాడిన మాటలను దయచేసి రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నాను. ఒకవేళ వారే ఉపసంహరించుకుంటే వారికే గౌరవం దక్కుతుంది. ఒక సీనియర్ దళిత నాయకుడి పట్ల ఒక సీనియర్ దళిత మంత్రి, వారు గతంలో పదిహేను సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన పెద్దల పట్ల ఆ రకంగా మాట్లాడటం మంచిది కాదు కాబట్టి, వారిని ముందుగా ఉపసంహరించుకోమనండి లేదంటే రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాను.

ఇందాక నేను మైకు అడిగినప్పుడు నాకు మైకు ఇవ్వలేదు కాబట్టి ఇప్పుడు ఇచ్చారని అనుకుంటున్నాను. ఇందాక పొన్నం ప్రభాకర్‌గారు మాట్లాడినప్పుడు....వారంటే నాకు గౌరవం ఉన్నది ఎందుకంటే పొన్నం ప్రభాకర్ గారు నేను 2009 నుంచి కలిసి పనిచేసిన సహచరులం, ఆనాడు వారు

1*** "Expunged as ordered by the Chair"
2*** "Expunged as ordered by the Chair"

ఎంపీగా, నేను ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచి అప్పటినుంచి మేం కలిసి పనిచేశాము. కానీ సత్యదూరమైన మాటలు చెబుతుంటే బాధతో తప్పకుండా అన్నాము. కానీ గౌరవ మంత్రి గారు కూడా మాట్లాడే ముందు తప్పనిసరిగా ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. ఇవ్వాళ వారి నియోజకవర్గమైన హుస్నాబాద్‌లో గౌరవెల్లి అనే రిజర్వాయర్ పూర్తయి ట్రయల్ రన్ అయిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఈ విషయం హుస్నాబాద్ ప్రజలకు తెలియదా? వేములవాడ నియోజకవర్గంలో మలక్‌పేట రిజర్వాయర్ పూర్తయి అందులో ఒక టిఎంసి నీళ్లు ఉన్న మాట వాస్తవం కాదా? ఇవ్వాళ కాళేశ్వరం గురించి మాట్లాడి అదేమీ జరగనట్లు నిన్న ఈ ప్రభుత్వం మేడిగడ్డకు వెళ్లొచ్చి మా మీద బురదజల్లే ప్రయత్నం ఏదైతే చేస్తున్నారో దాని గురించి నేను గౌరవ సభ్యులకు మీద్వారా ఒకటే మాట తెలియజేస్తున్నదేమంటే కాళేశ్వరం అనేది ఒక బరాజ్ కాదు. కాళేశ్వరం అంటే మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 19 సబ్ స్టేషన్‌లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1,531 మీటర్ల గ్రావిటీ కాలువలు, 141 టిఎంసిల స్టోరేజ్ కెపాసిటీ అదే విధంగా 240 టిఎంసిల యుటిలైజేషన్ ఉన్నది. శ్రీహరి గారు చెప్పింది ఏమిటంటే ఒక ప్రాజెక్టులో స్టెబిలైజేషన్‌ను కూడా తీసుకోవాలని చెప్పారు. కొత్తగా 97వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదని ఈ ప్రభుత్వం చెప్పినందున స్థిరీకరించిన ఆయకట్టు ఎంత అని అధికారిని అడుగుతుంటే ముఖ్యమంత్రిగారు మాట్లాడనివ్వలేదని అన్నారు.

నా నియోజకవర్గంలో అప్పర్ మానేరు అనే ప్రాజెక్టును 1945లో అంటే నిజాం టైంలో కట్టారు. ఆ అప్పర్ మానేరు అనే ప్రాజెక్టు కోసం ఆనాడు స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా పాదయాత్రలు జరిగాయి, దానిని ఎప్పటికప్పుడు స్థిరీకరించాలి, నింపాలనే ప్రయత్నాలు జరిగాయి. కానీ మొత్తానికి అది ఎప్పుడు నింపబడిందంటే మల్లన్నసాగర్ కట్టిన తరువాత మల్లన్నసాగర్ నుంచి ఏవైతే కూడవెల్లికి నీళ్లు వచ్చాయో ఈరోజు ఏప్రిల్ మాసం అంటే ఎర్రటి ఎండలో కూడా మా మిడ్ మానేరు, మా అప్పర్ మానేరు నిండుతున్న మాట వాస్తవం అనే విషయం కరీంనగర్ జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు గారికి, పొన్నం ప్రభాకర్ గారికి కూడా తెలుసు. అందుకే ఆ బాధతోనే మేం చెప్పడం జరిగింది. గౌరవెల్లి అయినా, మలక్‌పేట రిజర్వాయర్ అయినా, అదే విధంగా మా అప్పర్ మానేరు అయినా, స్థిరీకరించబడిన సింగూరు అయినా, స్థిరీకరించబడిన నిజాంసాగర్ అయినా, ఎస్సారెస్పీ పునరుజ్జీవమైనా ఇవన్నీ కాళేశ్వరం ద్వారా జరిగిన మాట వాస్తవం. గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ గారంటే మాకు గౌరవం, ఎందుకంటే వారు ఉద్యమ సహచరుడు. ఆనాడు పార్లమెంటులో వీరోచితంగా పోరాడారు కాబట్టే కేసీఆర్ గారు కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలోనే వారిని అభినందించారు. కాబట్టి మాకు మంత్రిగారిని అగౌరవపరిచే కుసంస్కారం లేదు. కానీ మంత్రిగారు కూడా వాస్తవాలు చెప్పాలి. గౌరవెల్లి పూర్తయిన మాట వాస్తవం. ఎన్‌జిటి స్టే ఉన్న మాట వాస్తవం, మలక్‌పేట పూర్తయిన మాట వాస్తవం, ట్రయల్ రన్ జరిగిన మాట వాస్తవం. ఇంత పెద్ద కాళేశ్వరంలో మూడు బరాజ్‌లు అదే విధంగా పదిహేను రిజర్వాయర్లు ఉంటే ఒక్క బరాజ్‌లో మూడు, నాలుగు పిల్లర్లకు ఇబ్బంది జరిగితే దానిని రిపేర్ చేయించండి. ఇందాకనే మా గౌరవ పెద్దలు కడియం శ్రీహరి గారు దానిని రిపేర్ చేయించాలని డిమాండు చేశారు. రైతుల మీద కోపం పెంచుకోకండి. కేసీఆర్ గారి మీద కోపం ఉంటే రాజకీయ ప్రయోజనం కావాలంటే ప్రయత్నం చేయండి గాని ఆ ప్రాంత రైతాంగం పట్ల కక్ష కట్టవద్దు, మేడిగడ్డ నింపండి, కాళేశ్వరంలో పంపింగ్ స్టార్ట్ చేయండి, ఇవ్వాళ 5వేల క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నాయి.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, గత మూడు రోజుల నుంచి శాసనసభలో తమరి అనుమతితో కృష్ణానది జలాల మీద కావచ్చు, గోదావరి నది మీద నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ కావచ్చు, అన్నారం కావచ్చు, సుందిళ్ల కావచ్చు లేదంటే పంప్‌హౌస్‌ల నిర్మాణం కావచ్చు.. చాలా విషయాల గురించి మనం చర్చించుకుందాం, ప్రత్యక్షంగా ఆ ప్రాజెక్టుల పరిస్థితులను చూసి వచ్చి ఈ సభలో వాస్తవాల ప్రాతిపదికన చర్చ జరపాలని తమరి అనుమతితో మనం నిర్ణయం తీసుకున్నాం. వాస్తవంగా ఈ రైతుల పట్ల

తెలంగాణ సమాజం పట్ల గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వ ఆహ్వానాన్ని దృష్టిలో పెట్టుకొని అందరం కలిసి అక్కడికి వెళ్లి ఆ ప్రాజెక్టులను పరిశీలించి అక్కడ జరిగిన నష్టాన్ని, రైతులకు వచ్చిన కష్టాన్ని అర్థం చేసుకొని ఆ సమస్యకు ఒక పరిష్కారం చూపించే అవకాశం ఉండెను. ఈ ప్రధాన ప్రతిపక్ష సభ్యులు అక్కడి రాకపోగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే ఏదో తప్పు చేసినట్లు ఈ తప్పుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానిదే బాధ్యత అయినట్లు అదే విధంగా పదే పదే భాష గురించి, మాటల గురించి మీరు ఇలా అంటున్నారు, మీరు అలా అంటున్నారు, మమ్మల్ని గౌరవించడం లేదని చర్చ జరుగుతున్నది. మాజీ ముఖ్యమంత్రి గారు నిన్న నల్గొండ జిల్లాలో వాడిన భాష మీద చర్చ చేద్దామా అని అడుగుతున్నాను. వారు నల్గొండ సభలో మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లు మేడిగడ్డకు ఏం పీకడానికి వెళ్లారని అంటారా? మాజీ ముఖ్యమంత్రిగా పదేండ్లు పనిచేశారు, కేంద్ర మంత్రిగా, రాష్ట్రమంత్రిగా, శాసనసభ్యుడిగా పనిచేసి, గొప్పలు చెప్పుకొని జబ్బలు చరుచుకొని ఉద్యమకారుడిని అని చెప్పుకునేటాయన, ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో ఉండి ఒక రాష్ట్రముఖ్యమంత్రిని పట్టుకొని ఏం పీకడానికి మేడిగడ్డకు పోయినవు అని అడుగుతే.. రా, ఇప్పటికే రాష్ట్ర ప్రజలు నీ ప్యాంటును ఊడబీకిండ్రు. ఉన్న అంగీ, చొక్కా కూడా ఊడబీకుతం, ఇప్పటికే తెలంగాణ ప్రజలు ....

(ఈ దశలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులు పోడియం దగ్గరికి వచ్చారు)

ఇప్పటికే తెలంగాణ ప్రజలు మొన్న జరిగిన ఎన్నికలలో మీ ప్యాంటు ఊడబీకిండ్రు. ఆ ప్యాంటును ప్రజలు ఊడబీకితే చెప్పుకునే దిక్కు లేక బొక్కబోర్లా పడితే వారికి బొక్కలిరిగాయి. అయినప్పటికీ వారికి బుద్ధి మాత్రం మారలేదు. ఒక ముఖ్యమంత్రిని పట్టుకొని మేడిగడ్డకు ఏం పీకడానికి వెళ్లావు అని నల్గొండ సభ ద్వారా అడగడం పద్ధతా? ఈ రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలు ఓట్లువేసి గెలిపించిన ముఖ్యమంత్రిని పట్టుకొని ఏం పీకడానికి వెళ్లావు అని అంటారా? ఇదేనా తెలంగాణ సాంప్రదాయం? మేడిగడ్డ మేడిపండు మాదిరిగా కుంగిపోతే అందులో నీళ్లు నింపడానికి అవకాశం ఉన్నదా అని అడుగుతున్నాను.

12.10 ప. ఈరోజు వారికే పెత్తనం ఇస్తాం. వారినే చేయమనండి. ఈరోజు ఏరకంగా మేడిగడ్డలో నీళ్లు నింపుతారో, మేడిగడ్డ నుండి నీళ్లు ఎత్తి అన్నారంలో పోస్తారో, అన్నారం నుండి సుందిళ్లలో ఎట్ల పోస్తారో బాధ్యత వారిని తీసుకోమనండి. మొత్తం కుంగిపోయి, కుప్పకూలిపోతూ ఉంటే, ఈరోజు అక్కడ నీళ్లు నింపడానికి ఏమాత్రం అవకాశం లేకపూర్తిగా ప్రాజెక్టు దెబ్బతిని ఖర్చు పెట్టిన రూ.94,000కోట్లు వృథా అయిపోయి, మొత్తం ప్రాజెక్టే దెబ్బతిన్న పరిస్థితుల్లో ప్రజల వద్దకు వెళ్లి సమాధానం చెప్పుకోలేక, శాసనసభకు రావాల్సిన ప్రతిపక్షసభా నాయకుడు ఇక్కడ సభలోకి రాకుండా పారిపోయి, చర్చ చేద్దామంటే రాకుండా ముఖ్యమంత్రి గారిని పట్టుకొని ఇట్ల మాట్లాడవచ్చా? అందుకే నేను ఒకటే మాట అడుగుతున్నాను. వారు ఈరోజు చర్చకు సిద్ధమైతే వారిని సభాపక్ష నాయకుడిని పిలవమనండి, చర్చ చేద్దాం. రేపు సాయంత్రం వరకైనా కాళేశ్వరం ప్రాజెక్టు పైనా, గోదావరి జలాల మీద ఈ ప్రభుత్వం చర్చ చేయడానికి సిద్ధంగా ఉంది. పారిపోయి ఫాంహౌజ్‌లో పండుకొని ప్రతిపక్షాల బాధ్యత నుండి తప్పించుకొని, వారి అవినీతి బయటపడుతుందని, కాళేశ్వరం దోపిడీలో జైలుకు వెళ్లాల్సి వస్తుందని.. కేసీఆర్‌ను చంపుతారా అని అంటున్నారు. చంపాల్సిన అవసరం ఎవరికి ఉంది? సచ్చిన పామును ఎవరైనా చంపుతాడా అధ్యక్షా? మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఆ పామును చేతితోని కాదు, కట్టెతోని కొట్టారు. ఆ పాము ఆల్‌రెడీ సచ్చింది. సచ్చిన పామును చంపాల్సిన అవసరం మాకేమి ఉంది అధ్యక్షా?

మిస్టర్ స్పీకర్:- మీరు మీ స్థానాలల్లో వెళ్లి కూర్చోండి. వెల్‌లోకి రావద్దు, మీరు మీ స్థానాల్లోకి వెళ్లి కూర్చోండి.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- ఈరోజు సానుభూతి కోసం వీల్ ఛైర్ నాటకాలు, వీధి నాటకాలు ఏంది అధ్యక్షా ఇది. ఈరోజు ఈ సభలో చర్చ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నిజాయితీ ఉంటే, వారు అవినీతికి పాల్పడకపోతే,

వారు చెప్పినట్లు మేడిగడ్డలో రెండో, మూడో పిల్లర్లు కూలిపోతే దానిమీద తీసుకోవాల్సిన నిర్ణయాల మీద మాజీ ముఖ్యమంత్రి గారు చంద్రశేఖర్ రావు గారిని సభలోకి రమ్మనమనండి. ప్రభుత్వం చర్చ చేయడానికి సిద్ధంగా ఉంది. పారిపోయి, అక్కడ ఎక్కడికో పోయి. అక్కడ ఏదో ప్రగల్భాలు ఏమిటి అధ్యక్షా? వారిని సభకు రమ్మనమనండి, వాస్తవాల మీద చర్చ చేద్దాం. మొత్తం ఇక్కడ పెడతాము. ఈరోజు ఆయన తప్పించుకుంటాడు, ఈయన వచ్చి ఇక్కడ కొత్త మాటలు చెబుతాడు. కాబట్టి, ఇప్పుడు దేనిమీదనైతే చర్చ జరుగుతున్నదో ఆ విషయంపై చర్చించమనండి. ఎట్లాగు సాగునీటి ప్రాజెక్టుల మీద శ్వేత పత్రం పెట్టడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వారి దగ్గర ఏమేమి విషయాలున్నాయో, ఏమేమి చర్చించాలనుకున్నారో మొత్తానికి మొత్తం శ్వేత పత్రం సందర్భంగా చర్చ చేద్దాం. లేదూ కాళేశ్వరం మీద చర్చ చేద్దామని అంటారా దానికోసం ప్రత్యేకంగా తమరు సమయం కేటాయించండి. కాళేశ్వరం మీద చర్చ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

మిస్టర్ స్పీకర్:- మీరు (వెల్ వద్ద నిలబడి ఉన్న బీఆర్ఎస్ పార్టీ సభ్యులను ఉద్దేశించి) మీ, మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. దయచేసి వెల్‌లోకి రావద్దు. ఈ ప్రాక్టీస్ బాగాలేదు. వెల్‌లోకి రావద్దు.

(గౌరవ సభాపతి సూచన మేరకు బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వెల్‌లో నుండి వెళ్లి వారి, వారి స్థానాల్లో కూర్చున్నారు.)

శ్రీ కడియం శ్రీహరి:- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు సభకు వచ్చిన తరువాత నిన్న మేడిగడ్డలో జరిగిన విషయాలపైన గానీ లేదా నల్లగొండలో జరిగిన విషయాలపైనా, కృష్ణా నదీ జలాలపైన మరియు గోదావరి నదీ జలాలపైన శ్వేత పత్రం పెడతామని అంటున్నారు. తప్పకుండా ఆ శ్వేత పత్రం అంశంపై మేమందరం కూడా పాల్గొంటాం. అన్ని విషయాలను కూడా మనం చర్చించడానికి అవకాశం ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి గారు వాడే భాషపట్ల మాకు అభ్యంతరం ఉంది. ఇప్పుడు, ఇక్కడ నేను ముఖ్యమంత్రి గారికి ఒక చిన్న సూచన చేయాలనుకుంటున్నాను. వారు కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్‌గా ఎన్ని విషయాలనైనా మాట్లాడవచ్చు. కానీ ముఖ్యమంత్రిగా, తెలంగాణ రాష్ట్రానికి ప్రతినిధిగా, తెలంగాణ ప్రజలకు ప్రతినిధిగా నిండు శాసనసభలో వారు సహనం కోల్పోయి, వారు వాడరాని భాషను మాట్లాడితే వారు ఒక ఉదాహరణను సెట్ చేసినట్లుగా భావించవలసి వస్తుంది. ఇది మంచి పద్ధతి కాదు. ముఖ్యమంత్రి గారు సంయమనం పాటించాలని కోరుతున్నాను. వారికి ఒక ప్రధానమైన బాధ్యత ఉంటుంది. వారిపట్ల రాష్ట్ర ప్రజలకు గౌరవం ఉంటుంది. ఆ గౌరవాన్ని కాపాడుకునే విధంగానే వారు మాట్లాడాలి తప్ప, సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాగా మాట్లాడితే బాగుండదని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.

అధ్యక్షా, ఇంతకు ముందు రాజగోపాల్ రెడ్డి గారు వ్యక్తిగతంగా నా పేరు తీసుకొని మాట్లాడారు. ఏమనంటే.....
[3] ***

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, కడియం శ్రీహరి గారు చెప్పిన మాటలకు సంబంధించి మాట్లాడుతున్నాను. వారు ఒక సీనియర్ శాసనసభ్యులు. అలాగే గౌరవ ప్రతిపక్ష సభ్యులు కూడా శాసనసభలో మాట్లాడినా, శాసనసభ బయట మాట్లాడినా కానీ, వారు చెప్పినట్లుగానే ఒక ఉదాహరణగా నిలబడాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి గారిని, మంత్రులందిరినీ కూడా శాసనసభ్యులందరి గురించి కూడా ఆవిధంగా మాట్లాడటం అనేది సరికాదని వారే చెప్పారు. ముఖ్యమంత్రి గారిని మాట్లాడవద్దని అంటున్నారు. సరే, వారు బయట గానీ, లోపల గానీ ప్రతిపక్ష నాయకులు ఆవిధంగా మాట్లాడాల్సిన అవసరం ఉంటుందా అధ్యక్షా? సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి ఆయన, పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వారి గురించి కూడా చెప్పాలి. వారు మాట్లాడిన దానికి అది సరికాదని చెప్పే రీతిలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు.

సభా సంప్రదాయాల్ని, సభా గౌరవాన్ని పెంచే ఉదాహరణగా నిలబెట్టే ప్రయత్నం మేము చేస్తున్నాము, దానికి

3*** "Expunged as ordered by the Chair"

తోడ్పడాలని నేను కోరుతున్నాను. శ్రీహరి గారికి ఎందుకు చెబుతున్నానంటే మొన్న సభ్యులు రాజగోపాల్ రెడ్డి గారు మాట్లాడినప్పుడు శ్రీహరి గారు ఒక విషయాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చారు. వారు మాట్లాడిన తరుణంలో వీరు మాట్లాడి ఉంటారు. కాబట్టి, వారు సీనియర్ శాసన సభ్యులు గనుక వారు ఉదాహరణగా నిలబడాలని కోరుతున్నాను. దాదాపు 55 మంది కొత్తగా ఎన్నికైన సభ్యులున్నారు. వారందరికీ ఒక ఉదాహరణగా నిలబడదాం. మనందరం కలిసి సభలో ఉన్నప్పుడు వారికి బాధ్యత ఉంటుంది, మాకు బాధ్యత ఉంటుంది. బాధ్యతగల వ్యక్తులుగా వారు బయటకు పోయి ఇష్టారాజ్యంగా అడ్డగోలుగా మాట్లాడుతాం. మీరు ఊరుకోండి, మేము చెప్పిందే నడవాలి, రాష్ట్ర ప్రజలందరు వినాలనే ఆలోచన సరికాదని తెలియజేస్తున్నాను.

ఏదైనా unparliamentary ఉంటే, రాజగోపాల్ రెడ్డి గారు ఏదైనా unparliamentary మాట్లాడితే తప్పకుండా expunge చేయాలి. అదేవిధంగా వారివైపు ఏదైనా unparliamentary words ఉంటేవారిది కూడా expunge చేయాలి. We will stand an example Sir. సార్, మీరు మీ discretion level లో precedent ను పెట్టుకొని సంప్రదాయాలని ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేద్దామని కోరుతున్నాను.

(బీఆర్ఎస్ ప్రతిపక్ష సభ్యుల నుండి అంతరాయం)

అధ్యక్షా, ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి, బడ్జెట్‌కు సంబంధించిన అంశంపైన చర్చిస్తున్న సందర్భంలో గౌరవ సభాపతి గారిని కోరుతున్నాను.

(బీఆర్ఎస్ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి నుండి అంతరాయం)

I understand you, young member.. మేము కూడా ఒక ఉదాహరణగా ఉంటామని చెబుతున్నాను. కానీ, అంతకంటే ముందు సీనియర్లుగా ఉన్న వారు కూడా ఉదాహరణగా నిలబడాలి కదా సార్. కాబట్టి, బడ్జెట్ చర్చకు సంబంధించిన అంశంపై మాట్లాడాలని కోరుతున్నాను. కడియం శ్రీహరి గారు బలహీనవర్గాల గురించి మాట్లాడారు. మేము తీర్మానం పెట్టబోతున్నాము. అందులో బలహీన వర్గాలకు ఎలా మేలు చేద్దామో చెప్పమని చెప్పండి. ఇంతకుముందు ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు శ్వేత పత్రం ప్రవేశపెడతాము. దానిపై మాట్లాడమని చెప్పండి. ఈరోజు బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది. అందులో భాగంగా వివిధ శాఖలకు సంబంధించిన అంశాలు మాట్లాడమని చెప్పండి గానీ, డీవియేట్ అయి మాట్లాడితే ఎలా సార్?

మిస్టర్ స్పీకర్:- రాజగోపాల్ రెడ్డి గారు సభ్యులు కడియం శ్రీహరి గారి మీద అనుచిత వ్యాఖ్యలు ఏమైనా చేసి ఉంటే రికార్డులను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి:- అధ్యక్షా, మొట్టమొదటగా సభలో నాగురించి అనుచిత వ్యాఖ్యలు చేసింది ఆ సీనియర్ నాయకుడు. కాబట్టి, నేను ఏమి అనకుండానే ముందే చెప్పాను. ఆయన పెద్దమనిషిఇటువంటి మాటలు నన్ను అనవచ్చా? ఏదైనా ఉంటే పార్టీ పరంగా మేము మాట్లాడుకుంటాం. అది మా పార్టీ అంతర్గత విషయం. మంత్రులు ఎవరు కావాలి, ఎవర్ని చేస్తారనేది పార్టీ అంతర్గత విషయం. అధ్యక్షా, మీరు రికార్డ్స్ చెక్ చేయండి. ఒకనాడు హరీష్ రావు గారు నా గురించి, మంత్రి పదవి గురించి మాట్లాడారు. మళ్లీ కడియం శ్రీహరి గారు మాట్లాడారు. మా పార్టీ అంతర్గత విషయం గురించి మా పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకుంటారు.

(అంతరాయం)

12.20 మ. **మిస్టర్ స్పీకర్:-** బడ్జెట్ పైన మాట్లాడండి.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి :- అధ్యక్షా, మా ముఖ్యమంత్రిగారు వందసార్లు చెప్పారు. ఈ ఆరు గ్యారెంటీల హామీలను విడతల వారీగా మేము అమలు చేస్తామని చెప్పాము. అమలు చేస్తామని మా ప్రభుత్వం ఒక కమిట్మెంటుతో ఉన్నాము. ఇప్పటికే కొన్ని అమలు చేశాము. వీళ్ళు ప్రతిసారి అసెంబ్లీలో, బయట అబద్ధాలు ఆడారు. మీరు ఎప్పుడు చేస్తారు, ఎప్పుడు చేస్తారు అని అంటున్నారు. మేము వచ్చి రెండునెలలు అయింది. మీరు పదేళ్ళపాటూ

డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు కట్టిస్తామని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు, మూడెకరాల స్థలం అన్నారు, లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ఐదేళ్ళ క్రింద 2018 సంవత్సరంలో చెప్పి ఎన్నేళ్ళకు చేశారు? వీళ్ళిచ్చిన హామీల విషయంలో .. వీళ్ళు గతంలో పదేళ్ళు పరిపాలించి..

(అంతరాయం)

మీరు పదేళ్ళకాలంలో ఒక్కహామీ నెరవేర్చలేదు. మాకు రెండు నెలలు సమయం కాలేదు. మేము రెండు నెలల్లో మా కాంగ్రెసుపార్టీ, మా ముఖ్యమంత్రిగారు అహర్నిశలు కష్టపడి మీరు ఆగం చేసిన తెలంగాణ రాష్ట్రాన్ని దారిలో పెట్టాలని మా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మీకెందుకు కళ్ళమంట, కడుపులో మంట? అంటే మేము చెయ్యొద్దా? మీకు రెండు సార్లు అవకాశం ఇచ్చారు. పదేళ్ళు పరిపాలించారు. మీరు విద్యని, వైద్యాన్ని గాలికొదిలేసిన మనుషులు, నిరుద్యోగాన్ని గాలికొదిలేసి మోసం చేసిన మనుషులు, నిరుపేదలకు ఇళ్ళు కట్టిస్తామని చెప్పి మోసం చేసిన మనుషులు, రైతులని నిట్టనిలువున ముంచేసిన మనుషులు ..

(అంతరాయం)

కమీషన్ల కోసం ప్రాజెక్టులను కట్టి దోచుకున్న ప్రభుత్వం మీది. తెలంగాణను ఇచ్చిన పార్టీ, ప్రభుత్వం మాది. కాంగ్రెస్ పార్టీ ఆనాడు హైదరాబాదుతో కూడిన తెలంగాణ ఎందుకు ఇచ్చింది? వీళ్ళు అప్పులు చేసి పోయారు. నిజం చెప్పాలంటే ఇది మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం. మనమే పది రాష్ట్రాలకు అప్పు ఇచ్చే పరిస్థితిలో ఉండె. అటువంటి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘన చరిత్ర వీళ్లది. హైదరాబాదు నగరం ఉంది. బోలెడంత ఆదాయం వస్తది. ఈ ఆదాయంతోటి తెలంగాణాని అభివృద్ధి చేసుకోవచ్చు. వీళ్ళ స్వార్థం కోసం అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. మళ్ళీ మీరిచ్చిన హామీలను ఎట్లా అమలుచేస్తారు అంటున్నారు. మేము చేస్తాం, మేము నిరూపిస్తాం. ప్రజలకిచ్చిన మాటను నెరవేరుస్తాం. వీళ్ళు తట్టుకోలేరు అధ్యక్షా. మమ్ములను తట్టుకునే శక్తి వీళ్లకు లేదు. దమ్మunteకేసీఆర్ గారిని సభలోకి రమ్మనండి మేము నిరూపిస్తాం. మీ నాయకుడిని రమ్మని మా ముఖ్యమంత్రిగారు మొన్న, నిన్న చెప్పారు. ఈరోజు కూడా చెప్పారు. ఆ దమ్ములేదు.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులందరూ సభనుంచి నిష్క్రమించారు)

ఇదిగో ఇప్పుడు సభనుంచి పారిపోతున్నారు. పారిపోతున్నారు, వాళ్ళు బయటకు వెళ్ళి మాట్లాడతారు. సభలో మాట్లాడి చర్చ చేయరు. ఈరోజు మా ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మేమందరం ఒక కమిట్మెంటుతో పనిచేస్తున్నాము. ఆర్థిక పరిస్థితుల మీద శ్వేతపత్రం ఇచ్చాము. కృష్ణా నదీజలాల దోపిడీ మీద చర్చ చేసి ప్రజెంటేషన్ ఇచ్చాము. మేడిగడ్డకు ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో అందరం వెళ్ళి చూసివచ్చాము. అది జీర్ణించుకోలేక వాళ్ళు చేసిన తప్పులను ప్రజలకు తేటతెల్లంగా కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాము కాబట్టి అది తట్టుకోలేక ఈ విధంగా మామీద వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారు. ఈరోజు మళ్ళీ చెపుతున్నాను. వీళ్ళ ఆటలు సాగవు.

ఏనాడైతే బీఆర్ఎస్ అని మార్చారో అప్పుడే వాళ్ల పనైపోయింది. వాళ్ల బ్రతుకుదెరువు కోసం, అధికారం కోసం, స్వార్థంకోసం పనిచేశారు. ఆనాడు తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టి .. అమాయకులైన పిల్లలను చంపారు, మీకు ఉసురు తగులుతుందని నిన్న రేవంత్‌రెడ్డిగారు అన్నారు. వాళ్ళ కుటుంబం లక్షల కోట్లు దోచుకున్నది. ఎవరో త్యాగం చేస్తే, త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో ఒక్క కుటుంబం బాగుపడి లక్షల కోట్లు దోచుకున్న చరిత్ర వాళ్లది. అది తెలంగాణ ప్రజలు తెలుసుకుని రెండు సార్లు తప్పుచేశామని గమనించి, గ్రహించి ఈరోజు మళ్ళీ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ఇది పేదల ప్రభుత్వం, పేదల రాజ్యం, పేదల కోసం పని చేస్తది. ఈరోజు మా మధ్య చీలికలు తీసుకువచ్చి నన్ను రెచ్చగొడుతున్నారు. నీకేం కాలేదా అంటారు. ఇంకొకరి దగ్గరకు పోతారు, నీకేం కాలేదా అంటారు. ఎంతసేపూ మమ్మల్ని చీల్చి మళ్ళీ అధికారంలోకి రావాలని

కుట్ర చేస్తున్నారు. కానీ వాళ్ల పప్పులు ఉడకవు. కాంగ్రెసు పార్టీ ఈరోజు మా ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో అందరం కలిసికట్టుగా ఐకమత్యంతో తెలంగాణ ప్రజల కోసం పనిచేసింది తప్పితే పదవుల కోసం పాకులాడే మనుషులం కాదు. థాంక్యూ.

శ్రీ ఆది శ్రీనివాస్:- సభ ప్రారంభమైనప్పటినుంచే బీఆర్ఎస్ పార్టీకి చర్చలో పాల్గొనే ఆసక్తి ఉన్నట్లు లేదు అధ్యక్షా. ఈరోజు సభ ఇంత అర్థవంతంగా గత ప్రభుత్వ పనితీరుపైన, బడ్జెట్ పైన మీరు అర్ధగంట సమయం కేటాయిస్తే వాళ్ళు గంట సమయం అడిగి, గంట సమయం కేటాయించినా వారు రాజకీయాలు మాట్లాడారు తప్ప మరొకటి మాట్లాడలేదు. నేను సభ ద్వారా ప్రజలకు ఈ విషయాలు తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నాను. సభ కోరం ఉన్నప్పటికీ, మమ్మల్ని లెక్క పెడుతున్నారు వాళ్ళు. మేము ఉన్నాం, ఎంఐఎం వాళ్ల ఉన్నారు, బీజెపి వాళ్ళు ఉన్నారు వారు కావాలనే సభను బదనాం చేద్దామని బయటకు వెళ్ళిపోయారు. మీరు సభని నడుపుతున్న తీరును నేను గమనిస్తున్నాను అధ్యక్షా. వాళ్ళు తెరచాటునుంచి పిల్లలు చూసినట్లుగా చూస్తున్నారు. సభ జరుగుద్దా? వాయిదా పడుద్దా అని చూస్తున్నారు. సభ జరుగుతుందని చూసి మళ్ళీ వచ్చారు. అబద్ధం కాదు మీరు చూడండి అధ్యక్షా. పిల్ల చేష్టలు. సభ ప్రారంభమైన దగ్గర నుంచి ఎప్పుడు బయటపడదామా అని చూస్తున్నారు. వాళ్లకివ్వాళ పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు ఉన్నట్టున్నాయి. వాళ్ళు కావాలనే గౌరవ ముఖ్యమంత్రిగారు రాకముందు బీసీ సంక్షేమ శాఖామాత్యులుగా పొన్నం ప్రభాకర్‌గారు మాట్లాడితే వారిని కూర్చో మంటారు. ఛైర్‌ని పట్టుకుని ఓయ్ ఓయ్ అంటున్నారు అధ్యక్షా. ఇదేం సంస్కారం? ఇంకా వాళ్ళ రాజ్యం ఉందని అనుకుంటున్నారు. ఇది కరెక్టు కాదు. నిన్న నల్గొండ సభలో వాళ్ళు మాట్లాడిన మాటలు దురహంకారంతో, దొరహంకారంతో రెండూ చెపుతున్నాను. దురహంకారం, దొరహంకారంతో మాట్లాడుతున్నారు. ఇది పద్ధతి కాదు.

నిన్న నల్గొండ సభలో గౌరవ ముఖ్యమంత్రిగారిని పట్టుకుని మాట్లాడిన తీరు.. ఈరోజు ప్రజలందరూ కూడా ఛీత్కరించి మీ నియంతృత్వ పోకడను దురహంకారాన్ని పక్కన పెట్టి రెండునెలలు కాలేదు, ఇంకా మీరు అధికారంలోనే ఉన్నారనుకుని గౌరవ ముఖ్యమంత్రిగారిని మాట్లాడే మాటలా అవి? ఆయన సభలోకి రారు. ముఖ్యమంత్రిగారు పదేపదే చెపుతున్నారు. ప్రతిపక్షనాయకుడు రావాలి, వారు అనుభవజ్ఞులు కాబట్టి సలహాలు ఇవ్వాలని పదేపదే చెపుతున్నారు. కానీ సానుభూతిని పొందడం కోసం వీల్‌ఛైర్‌లో ఈరోజు నల్గొండకు వెళ్ళి ఆయన మాట్లాడిన మాటలను ప్రజలు గమనిస్తున్నారు. నిన్నటిరోజు వారు మాట్లాడిన తీరు వారి ఆలోచన ఏంటో తెలియజేస్తుంది. ఇది సరైన పద్ధతి కాదు.

మా జిల్లాకు సంబంధించి పదో ప్యాకేజీ పూర్తవుతది, పదకొండో ప్యాకేజీ పూర్తవుతది. కానీ తొమ్మిదవ ప్యాకేజి అప్పర్ మానేరు పూర్తి కాలేదు. మా జిల్లాని ఇంత అభివృద్ధి చేశామని చెపుతున్నారు. మా దగ్గర ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు హరీష్‌రావుగారు నీటిపారుదల శాఖ మంత్రి హోదాలో వచ్చి 170 కోట్ల రూపాయలతో పునాది వేశారు. ఆ కుడి,ఎడమ కాలువలు ఆరేళ్ళయినా పూర్తి కాలేదు. ఇప్పుడు మా ముఖ్యమంత్రిగారు వచ్చిన తరువాత ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కలిగొండ సూరం ప్రాజెక్టు, మరిపెల్లి ప్రాజెక్టు, లచ్చపేట ప్రాజెక్టు, ఎల్లంపెల్లి ప్రాజెక్టు.. రాజన్న సిరిసిల్ల నుంచి అప్పర్ మానేరు ప్రాజెక్టును పట్టించుకోలేదు, శ్రీపాదసాగర్ ప్రాజెక్టును పట్టించుకోలేదు, వారు ఈరోజు గొప్పలు చెపుతున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు.. దానికి రూ.500 కోట్లు కావాలి. ఈ రోజు ట్రయల్ రన్ అయిందని కేటీఆర్‌గారు గొప్పగా చెపుతున్నారు. ఇవన్నీ కూడా వారు ఆర్థికంగా ఎదగడానికి చేసిన కార్యక్రమాలు తప్ప నిజంగా రైతులకు ఒక్క ఎకరానికి కూడా నీళ్ళు ఇవ్వలేదు.

అప్పర్ మానేరుకి ఎక్కడ నుంచో నీళ్ళు వస్తున్నాయి, మేము టెండర్లు వేశాము అంటున్నారు. అసలు అప్పర్ మానేరుకి ఎక్కడ నుంచి నీళ్ళు పోవాలి? మలకపేట్ నుంచి పైకి వెళ్ళాలి. కానీ ముక్కెక్కడుంది అంటే ఇలా ఉంది అన్నట్లు పదో ప్యాకేజీకి, పదకొండో ప్యాకేజీకి నీళ్ళు ఇచ్చామని మీరు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈయన అసమర్థత వల్ల.. తొమ్మిదో ప్యాకేజీ ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలి.

ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వేరే నియోజకవర్గాలకి నీళ్ళు ఇవ్వడంలో ఎందుకు విఫలం అయ్యారో చెప్పాలి. ఈరోజు బలహీన వర్గాల మంత్రిని పట్టుకుని, గౌరవ ముఖ్యమంత్రిని పట్టుకుని ఈ విధంగా వీళ్ళు మాట్లాడిన మాటలు సరైనవి కాదు. అసలు వారికి ఈరోజు చర్చలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నట్లు కూడా మాకు అనిపిస్తలేదు. కోరం ఉన్నప్పటికి కూడా. వారియొక్క ఆలోచన విధానాన్ని ప్రజలు గమనించాలి.

రాజగోపాల్‌రెడ్డిగారిని నిన్ననే రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. ఈరోజు వారు మాట్లాడుతుంటే వారిని.. అంటే ఎవరు మాట్లాడినా వారిమీద ఎదురు దాడి చేసే సంస్కృతి వారిది. ఇది సరైనది కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

12.30 మ. **శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్:-** అధ్యక్షా, మొదటిసారి సభలో అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నాను. కరీంనగర్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా నేను పనిచేసినప్పుడు, అక్కడ కూర్చున్న శాసన సభ్యులు కూడా జిల్లాపరిషత్ సభ్యులుగా ఉండేవారు. ఇక్కడికి వచ్చిన తరువాత శాసన సభ సమావేశాలు జరుగుతుంటే హరీష్‌రావుగారు మాట్లాడేతీరు గాని, కేటీఆర్‌గారి రన్నింగ్ కామెంటరీ గాని, పక్కనే ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డిగారు మాట్లాడే తీరుగాని ఎంత బాధాకరంగా అనిపిస్తుందంటే, ఒక గౌరవమైన చట్ట సభలో, తెలంగాణ ప్రజలచేత ఎన్నుకోబడిన గౌరవ మంత్రివర్యులు మరియు ముఖ్యమంత్రిగారు, శాసనసభ్యులందరూ కలిసి ప్రజల పక్షాన చట్టాలు చేసి, ప్రజలకు మేలు చేసే కార్యక్రమం చేపట్టాలనుకున్నాము. ఎప్పుడు చూసినా వాళ్లు మాట్లాడే మాటలేందంటే మనం మాట్లాడే మాటలకు కౌంటర్ ఏ విధంగా ఇవ్వాలి, ఏ విధంగా మనని ఇబ్బంది పెట్టాలి, మీరిచ్చిన గ్యారెంటీ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ఏకవచనంతో మాట్లాడుడు, దళితవర్గానికి చెందిన గౌరవ స్పీకర్‌గారిని పట్టుకొని ఏయ్, ఏయ్ అని మాట్లాడ్డం. మా బలహీన వర్గానికి చెందిన మా పొన్నం ప్రభాకర్‌గారిని పట్టుకొని నువ్ కూర్చో అంటాడు కేటీఆర్. మళ్లీ మాట్లాడతాడు, నా స్నేహితుడు, ఉద్యమంలో నాతో కలిసి పనిచేశాడని మాట్లాడతాడు. ఈరోజు వాళ్లు మాట్లాడిన ధోరణి ఏ విధంగా ఉందంటే నిన్నగాక మొన్న మనం పేపర్లో చూశాం. ఆరుగురు మంత్రులకు సమాధానం చెప్పాడు హరీష్‌రావు అని అంటాడు. ఏం సమాధానం చెప్పాడు? మా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు మా ధర్మపురి నియోజకవర్గం మేడారం రిజర్వాయర్ నుండి, మిడ్‌మానేర్ నుండి సిద్ధిపేటకు, సిరిసిల్లకు, గజ్వేల్‌కు పట్టుకుపోతరు, కాని మా కరీంనగర్ జిల్లాకు ఒక్క చుక్క నీళ్లు రాలేదు అధ్యక్షా. ఎంత బాధాకరం అధ్యక్షా? ఎందుకంటే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా మా కరీంనగర్ జిల్లాకు నీళ్లొస్తాయి, కాంగ్రెస్ పార్టీ హయాంలో కట్టిన వరద కాలువ ద్వారా నీళ్లొస్తాయి తప్ప ఈ ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మేడారం రిజర్వాయర్ నుంచి నీళ్లు పట్టుకుపోతాడు. మీరు నమ్మరు అధ్యక్షా, అక్కడికి హరీష్‌రావుగారు వచ్చి, మేడారం రిజర్వాయర్ దగ్గర రాత్రి నిద్ర చేశాడు. మా ధర్మపురి రైతాంగం అంతా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తే ఏమని మాట్లాడిండంటే ఇక్కడ మీ ధర్మపురి నియోజకవర్గానికి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తాము, దానికి పత్తిపాక రిజర్వాయర్ అని పేరు పెడతాము అని చెప్పి, అక్కడ పల్లె నిద్ర చేశాడు ఒక దొరగారింట్లో. పల్లె నిద్ర చేసి ఏం చెప్పాడు- మీ ధర్మపురి నియోజక వర్గానికి సాగునీరు, తాగు నీరు ఇస్తామని చెప్పాడు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రిగారితో కూడా ప్రకటన ఇప్పించాడు అధ్యక్షా 2016-17లో. అప్పుడు మేము కూడా అనుకున్నాము మాకు రిజర్వాయర్ ఏర్పాటు చేస్తారు, మా ప్రాంతానికి నీళ్లొస్తాయని అనుకున్నాము. తీరా రిజర్వాయర్ ఏర్పాటు చేసే విషయంలో ఆ సమస్య ఎక్కడా మాట్లాడకుండా, కాళేశ్వరం లింక్-2 తీసుకొచ్చారు, ఇరవై వేల కోట్ల రూపాయలతో, సుమారు 1700 ఎకరాలు మా రైతాంగం భూములు గుంజుకున్నారు అధ్యక్షా, పోలీసులను పెట్టి. మేము పోతే మా మీద 13 కేసులు పెట్టారు. అంత పెద్దమనిషి జీవన్‌రెడ్డి గారి మీద కూడా కేసులు పెట్టారు. ఇవ్వాళొచ్చి వాళ్లు మాట్లాడిన మాటల ఆలోచన విధానం ఎట్లున్నదంటే పేదవాళ్లకి సంబంధించిన ఆరు గ్యారెంటీ పథకాలు ఎక్కడ అమలు చేస్తారో, ప్రజల్లో మనకి ఎక్కడ మంచి పేరొస్తుందో, రేపు రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డిగారు గాని, గౌరవ మంత్రివర్యులుగాని , గౌరవ శాసనసభ్యులు గాని ఏ విధంగా ప్రజల ఆదరణ పొందుతారో అని, మనని ఏ విధంగా ఇరకాటంలో పెట్టాలనే ఆలోచన చేస్తున్నారు తప్ప మరొకటి కాదు.

కరీంనగర్ జిల్లాకు నీళ్ల విషయంలో ఏ విధంగా ద్రోహం చేశారో చెబుతాము. మా జిల్లాకు ఏ విధంగా అన్యాయం చేశారో ఒక శ్వేతపత్రం కూడా విడుదల చేస్తాం. దళితుల విషయానికి వస్తే, వారు సభనుండి వెళ్లిపోయారు. ఈరోజు చాలా కార్యక్రమాలు ఉన్నాయి, బయటకు పోవాలి అని చెబుతున్నారు. వాళ్ల ధోరణి ఏ విధంగా ఉందంటే మా గౌరవ పెద్దలందరికీ మనవి చేసుకుంటున్నాను. వాళ్లు కాగితాలు తీసుకొచ్చి మాట్లాడుతుంటారు. హరీష్‌రావు గారికి అరగంట సేపు టైం ఇస్తున్నారు. ఆయన ఇంగ్లీషులో మాట్లాడతాడు, ఏదో ఇంగ్లీషు మాకు తెలవదన్నట్లు. ఆయన మాట్లాడే సబ్జెక్టు మనకు తెలవనట్లు. స్వయంగా కృష్ణా జలాల మీద ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రే ప్రకటన చేశాడు. ఇంక మాట్లాడేది ఏమిటి అధ్యక్షా? చేతులెత్తి దండం పెడుతున్నా అధ్యక్షా. వాళ్లు మాట్లాడే ధోరణి గురించి ఒకసారి ఆలోచన చేసి, టైం కేటాయించే విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని మనవి చేసుకుంటూ, ముఖ్యంగా మా ప్రాంతం ధర్మపురి విషయంలో ఈ కేసీఆర్‌గాని, కేటీఆర్‌గాని, హరీష్‌రావుగారు గాని మా కరీంనగర్ జిల్లాకు చేసిన అన్యాయం గురించి మీరు టైం ఇస్తే మరొకసారి చెబుతానని మనవి చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా.టి. రామ్మోహన్ రెడ్డి (పరిగి):- తెలంగాణ రాష్ట్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంచనాలు రూ. 2 లక్షల, 75 వేల, 891 కోట్లతో గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగారు ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకవెళ్లాలనే ఆలోచనతో, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారి నాయకత్వంలో ప్రవేశపెట్టడం జరిగింది అధ్యక్షా. రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ. 29,669 కోట్లు. ఆరు గ్యారెంటీల కోసం రూ.53,196 కోట్లు కేటాయించడం జరిగింది. ముఖ్యంగా ఎన్నికలకు ముందు మేము తెలంగాణ ప్రజానీకానికి ఏదైతే హామీ ఇచ్చామో ఆ హామీలు నెరవేర్చే కార్యక్రమంలో భాగంగానే పెద్ద ఎత్తున రూ.53,196 కోట్లు కేటాయించడం జరిగింది. అదే విధంగా పంచాయతీ రాజ్ శాఖకు రూ. 40,080 కోట్లు కేటాయించుకున్నాము. గతంలో జాతిపిత మహాత్మా గాంధీగారు పల్లెలోనే మన దేశం యొక్క ఆత్మ ఉంటుందని, ఆ గ్రామాలు అభివృద్ధి చెందాలని చెప్పారు. మన ప్రభుత్వం రూ.40,080 కోట్లు ఈ శాఖకు కేటాయించడం జరిగింది.

అదే విధంగా నీటిపారుదల శాఖకు రూ.28,024 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ గురుకుల భవనాలకు రూ.1,250 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. వ్యవసాయ శాఖకు రూ.19,746 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ విధంగా వైద్య రంగానికి రూ. 11,500 గృహజ్యోతికి రూ.2,418 కోట్లు కేటాయించడం జరిగింది. గ్రామాల్లో విద్యుత్తు అధికారులు ఇప్పటికే ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వాళ్ల ఆధార్ కార్డులు, బిల్లులు సేకరించి, వచ్చే నెల నుండే ఈ పథకాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇన్ని కార్యక్రమాలు జరుగుతుంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు నిన్న నల్గొండలో ఏం మాట్లాడారు అధ్యక్షా? నిజంగా నీళ్లు మగోళ్లా అని మాట్లాడారు. ఈ రకమైన భాష మాట్లాడొచ్చా? చట్ట సభల్లో మనం మహిళలకు కూడా రిజర్వేషన్ ఇవ్వాలని చెప్పి మన శాసన సభలోనే తీర్మానం చేశాము. ఆ తరువాత పార్లమెంట్‌లో ఈ తీర్మానానికి సపోర్ట్ చేశాము. గతంలో యుపిఎ హయాంలో రాజ్యసభలో బిల్ కూడా పాస్ చేసుకున్నాము. అలాంటిది మహిళలను చులకన చేసే విధంగా మాజీ ముఖ్యమంత్రిగారు నిన్న మాట్లాడిన మాటలు మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయనే విషయం మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

అదే విధంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు జరిగిన అన్యాయం కంటే ఎక్కువ అన్యాయం ఈ పదేళ్లలో జరిగిందని చెబితే, దాన్ని వక్రీకరించి మాట్లాడుతున్నారు. ఒక ముఖ్యమంత్రిగా ఉండి, శాసన సభకు రాకుండా, బయట ఎక్కడో ఉండి మాట్లాడుతూ, మన రాష్ట్రాన్ని అధోగతి పాలు

చేసి, సుమారు ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి, కట్టిన ప్రాజెక్టు కూడా నిరర్థకంగా మారి నీళ్లు కూడా పారించలేని పరిస్థితి ఉంది. అప్పుడు మన వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ ప్రాంతాలకు నీళ్లు రావాలని అప్పుడు మనం కొందుర్గ్ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టాలని చెప్పి మనం ఆనాడు న్యాయబద్ధంగా డిమాండ్ చేశాము. వాళ్లు చేవెళ్ల దగ్గర ఆ ప్రాజెక్టును ఆపివేశారు. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో స్టార్ట్ అయిన ప్రాజెక్టులను రద్దు చేశారు, మన ప్రాంతానికి ప్రాజెక్టులను రానివ్వకుండా, మన ప్రాంతానికి గోదావరి జలాలను రానివ్వకుండా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పేరుని కూడా తీసేసి, కాళేశ్వరం అని మార్చి మన చేవెళ్ల దగ్గర పనులు జరగకుండా చేశారు అధ్యక్షా. వీళ్లా మన ప్రాంతం గురించి, మన ప్రాజెక్టులలో జరిగే అన్యాయం గురించి మాట్లాడేది? వాళ్లకు ఆ హక్కు ఉందా అని అడుగుతున్నాను. అదే విధంగా వీళ్లు రైతు బంధు గురించి మాట్లాడుతున్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందే మన కాంగ్రెస్ పార్టీ తరఫున పిసిసి అధ్యక్షుడు మన రేవంతన్న లెటర్ పంపించారు. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల కోడ్ రావడానికి ముందే రైతుబంధు డబ్బులు వేయండి, మేము దానికి వ్యతిరేకం కాదు అని మా నాయకుడు అప్పుడు పిసిసి అధ్యక్షుడు లిఖిత పూర్వకంగా లెటర్ పంపించారు.

12.40 మ. ఇది అఫీషియల్ రికార్డుల్లో ఎన్నికల కమిషన్ దగ్గర ఉన్నది. వాళ్లు చిత్తశుద్ధి లేకుండా ఈరోజు మేము రైతుబంధు వేయడం లేదని అంటున్నారు. సుమారు ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పుల్లో పెట్టి మన రాష్ట్రాన్ని ఆదోగతి పాలు చేశారు.

آج بہت سے لوگ کہتے ہیں:۔ اگر کوئی تمہیں اینٹ سے مارے تو تم اسے پتھر سے مارو۔

అని చాలా మంది అంటున్నారు. మా నాయకుడు అలా కాదు. ఆ విధంగా రాళ్లతో కొట్టమని చెప్పడం లేదు. రేవంత్‌రెడ్డిగారు ఏమంటున్నారంటే, వాళ్లు ఒక మాట మాట్లాడితే మాటకు కట్టుబడి జవాబు ఇద్దాము. అప్పుడే ఒక మెసేజ్ పోతుంది. మనం ఈ విధంగా ఉంటే ఈ భాషను వాళ్లు మార్చుకునే అవకాశం లేదు. ఈ భాషను మొదలుపెట్టింది ఎవరు? కేసీఆర్‌గారూ ఏ సభలోకి వెళ్లినా సరే మహిళలను కూడా సన్నాసులు, వెధవలు అని మాట్లాడారు. ఈ విధంగా చేయడం వల్ల తెలంగాణ సమాజంలోని కవులు, కళాకారులంతా బాధపడుతున్నారు. ఒక ముఖ్యమంత్రిగా ఇంత అనుభవం ఉండి, 80వేల పుస్తకాలు చదివానని మాట్లాడిన కె.చంద్రశేఖర్‌రావుగారు, ఈ తెలంగాణలో తెలుగు భాషను పూర్తిగా అధోగతి పట్టించిన వ్యక్తి గురించి మేము మాట్లాడుతుంటే, ఈరోజు శాసనసభలో వాళ్ల నాయకులు మేము ఏదో తప్పు మాట్లాడుతున్నామన్నట్లు మాటాడుతునారు.

ان کی بات ایسی ہی ہے جیسے کہ کہا جاتا ہے کہ ”شیر الٹا کوتوال کوڈانٹے“۔

ఆ విధంగా దొంగే దొంగ అన్నట్లుగా మాట్లాడుతున్నారు. తిట్టను పోరా గాడిద కొడకా అన్నట్లు ఈ బిఆర్ఎస్ నాయకుల విధానం ఆ విధంగా ఉన్నది. వాళ్లు తిడతారు మళ్లీ తిట్టను పోరా గాడిద కొడకా అంటారు. ఈ విధంగా వాళ్లు మన తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా మన భాషను తిరోగమనం చేశారు.

గత పది సంవత్సరాల పరిపాలనలో డొల్లతనం ఉన్నది. వాస్తవంగా చెప్పాలంటే గత పది సంవత్సరాల కాలంలో పాలకులు వాగ్దానాలతో మభ్య పెట్టి, మాటలు ఆకాశానికి తాకితే వాటి ఆచరణ మాత్రం నేల మీద సాము చేశారని చెప్పక తప్పదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితబంధు అందరికి అందకపోవడం, బీసీ బంధు అప్పుడు అధికార పార్టీకి చెందిన వారికే పరిమితం కావడం, నూతన రేషన్ కార్డులు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగించడం, నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తున్నప్పటికి పాలకుల్లో చలనం లేకపోవడం, పంటలకు కనీసం మద్దతు ధర లభించకపోవడం, నాటి ప్రభుత్వ పెద్దలు పాలకుల ద్వంద్వనీతి హెచ్చు పెరగడం ఈ విధంగా వీళ్లు ఈ పరిస్థితుల నడుమ మెగా డిఎస్సీ నిర్వహించి వచ్చే ఆరు నెలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని, టిఎస్‌పిఎస్సీ ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వం

చర్యలు తీసుకోవడం జరిగింది. యువత జాబ్ క్యాలండర్ విషయంలో చెప్పిన మాట ప్రకారం చర్యలు తీసుకోక పోవడానికి.... ఈ విధంగా ఎన్నో తప్పులు చేసి టిఎస్‌పిఎస్సీలో పేపర్ లీక్ చేసి ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాలుకావడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షదాయకం. గ్రామీణాభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం కేవలం ప్రచారానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చింది. అంతేకాదు స్థానిక ప్రజా ప్రతినిధులకు విలువ లేకుండా పోయింది. వాళ్లు గ్రామాల అభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా వారిని అప్పుల పాలు చేసి నానా అగచాట్లు పడేలా చేశారు. కావున అటువంటి అగచాట్లు పునరావృతం కాకుండా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

రాష్ట్రంలో డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టేందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం దృఢసంకల్పంతో ఉన్నది. 2013వసంవత్సరం నుంచి అప్పటి యుపిఏ ప్రభుత్వం ప్రకటించిన ఐటిఐఆర్ ప్రాజెక్టు కార్యాచరణలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకొమ్మని అంటామని చెప్పడం ప్రజాపాలన పట్ల నేటి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నాము. వాళ్లు ఏమని అడిగారంటే, ఏవిధంగా మీరు రెవెన్యూను సమీకరించుకుంటున్నారు. మేము ఐటిఐఆర్ ప్రాజెక్టును కేంద్రప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చి మన రాష్ట్రంలో ఏర్పాటు చేసి లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తాము. తద్వారా రాష్ట్రానికి ఆదాయం వచ్చే విధంగా కృషి చేస్తాము. అయితే గత పది సంవత్సరాల పాలనలో ప్రభుత్వ నిర్వాకం కారణంగా విద్యుత్తు సంస్థలు రూ.81,516కోట్లు అప్పుల్లో కూరుకొనిపోవడం, అదేవిధంగా రూ.50,275కోట్ల వరకు నష్టాల్లో కూరుకొనిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్థలను గట్టెక్కించే ప్రయత్నం చేయాలి.

అదేవిధంగా గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పౌరసరఫరా కార్పోరేషన్‌కు 56వేల కోట్ల రూపాయలు అప్పులు, నష్టాలు 11వేల కోట్ల రూపాయల వరకు చేరుకోవడం, ఇలా ప్రతి శాఖకు అప్పుల కుప్పగా మారిపోయాయి. గత పది సంవత్సరాల కాలంలో అనేక వర్గాలు సంఘాలు అణచివేతకు, వివక్షకు గురయ్యాయి. రైతులు, పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, మహిళా, యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఇలా ప్రతి వర్గం అణచివేతకు గురయింది. ఇదొక్కటేకాదు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడానికి కేవలం తాము మాత్రమే కారణమని తాము మరియు తమ కుటుంబ సభ్యుల త్యాగాల ఫలితమే అని మొన్నటి వరకు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ నాయకులు బుకాయించే ప్రయత్నం చేశారు. ఈ కారణంగా అమరవీరుల త్యాగాలకు, ఉద్యమకారుల తెగువకు, ఇక్కడి ప్రజల త్యాగ నిరతిని అవమానించే విధంగా ప్రయత్నాలు జరిగాయి. అదొక్కటే కాదు ప్రజాధనాన్ని వృధా చేస్తూ పరిపాలనా భవనాలను, కట్టడాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి కట్టే ప్రయత్నాలు జరిగాయి. ఈ విధంగా చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోవాలనే జిజ్ఞాస వాళ్లు కనబరిచారే తప్ప ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని బాధ్యత తమ మీద ఉందనే విషయాన్ని నిన్నటివరకు రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేసిన విషయం గత పాలకవర్గం మర్చిపోయింది. ఇంకొక విషయం తరతరాలుగా దగా పడ్డ ఇక్కడి యువతకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగ ఉపాధి కల్పనను కల్పించాల్సిన బాధ్యతను విస్మరించి తమ కుటుంబ సభ్యులను రాజకీయ పునరావాస కేంద్రాలుగా ప్రాముఖ్యతను ఇచ్చారు. లక్షల ఉద్యోగాలను ఇచ్చామని చెబుతున్న పాలకులు పార్టీ పెద్దలు పలు సందర్భాలలో లెక్కలు చెప్పినప్పటికీ ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువకులు తీవ్ర నిరాశ నిస్పృహకు గురయ్యారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి కల్పిస్తామని గత పాలకులు చెప్పినప్పటికి వాటన్నింటిని గత పాలకులు తుంగలో తొక్కారు. దీనికి తోడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కుంభకోణాలతో యువత భవిష్యత్తు అగమ్యగోచరంలోకి నెట్టేసింది. రైతుబంధు బడా బాబులకు సైతం ఇవ్వడం ద్వారా పెత్తందారి విధానాలకు గత పాలకపక్షం నాయకులు వాటిని బలపరచడం జరిగింది. ఈ పరిణామాలకు తోడు పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ

జరగకపోవడం రైతు రుణాలు వడ్డీలు రెట్టింపు కావడంతో రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది.

ఉద్యమకాలం నుంచి పార్టీలో ఉన్న వారిని కాదని అధినాయకత్వానికి భజన చేసే బి.టి టీమ్ (బంగారు తెలంగాణ) కు గత పాలకపక్షంలో ఉన్నవారు ప్రాధాన్యత ఇచ్చారు. దీనికి తోడు వారి రాజకీయ బరి తెగింపులకు పరాకాష్టగా ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను, నాయకులను మభ్యపెట్టి కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని గత పాలకపక్షనాయకులు తీసుకొచ్చారు. గత ముఖ్యమంత్రి ప్రజలకు మాత్రమే కాదు, మంత్రులకు, పార్టీ ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండేవారు కాదు. గత ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు ముచ్చటపడి కట్టించుకున్న నూతన సచివాలయానికి కూడా రాకుండా ఫామ్ హౌజ్‌లో నిలిచిపోయారు. క్షేత్రస్థాయిలో అధికారపార్టీ వారి దాష్టికాలను ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం అరెస్టులు చేయడం, మొత్తం మీద నాటి అధికార పార్టీ వారు అభివృద్ధి కంటే తమ అభివృద్ధి.. పార్టీ నేత రియల్‌ఎస్టేట్ వ్యాపారం మీదే దృష్టి,ప్రాధాన్యత కేంద్రీకరించేవారు. అలాగే రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం అధికారపార్టీ వారికి ఏటిఎంలాగా మారిపోయాయి. ఈ కారణంగా ఇరిగేషన్ పాలనా యంత్రాంగం అవినీతి అక్రమాల పుట్టగా తయారయింది. దీనికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ బ్యారేజీ కుంగిన సంఘటనలు వారి అవినీతి కార్యక్రమాలకు తార్కాణంగా పేర్కొనవచ్చు. ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఏదో మేలు జరుగుతుందని భావించిన తెలంగాణ ప్రజల కన్న కలలు నాటి పాలకపక్షం పార్టీ వాళ్ల దాష్టికాలు, అవినీతి, అక్రమ సంపాదనల కారణంగా కలలు కలలుగానే మిగిలిపోయాయి. ఈ విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేక భావనతో కూరుకొనిపోయారు. బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత పెరుగుతున్నప్పటికీ కేసీఆర్ దిద్దుబాటు చర్యలు చేపట్టకపోగా తమరికి ఎదురే లేదట్లుగా వ్యవహరించారు.

ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా రాష్ట్రాన్ని good to great నినాదంగా ముసుగులో పెట్టుకొని బిఆర్ఎస్ ప్రచారాన్ని కొనసాగించింది. మరోవైపు పాలకపక్షాల దుబారా అవినీతి కారణంగా ప్రభుత్వ ఖజానా నిండకపోవడంతో కనీసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తాజా పిఆర్‌సి ఇవ్వలేకపోయింది. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె సమయంలో కేసీఆర్‌గారు చేసిన అవమానాన్ని ఆర్‌సిటి కార్మికులు మరచిపోలేకపోతున్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌గారు ఆర్‌టిసి కార్మికులకు చెప్పడం జరిగింది, సమ్మె సమయంలో ఎవరైతే సమ్మెలో ఉన్నారో వాళ్లకు కావాల్సిన బకాయిలను చెల్లిస్తామన్నారు. రాష్ట్ర తెలంగాణ ఉద్యోగులకు పిఆర్‌సిని కూడా ఇస్తామని చెప్పడం జరిగింది. ఈ విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఏవైతే హామీలిచ్చారో ఆ హామీలేవి నెరవేర్చకపోగా ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టి నేడు వాళ్లు మా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారు ఒకరోజుకు 24గంటలు ఉంటే 18గంటలు ఆలోచిస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకొని రావాలన్న ఏకైక లక్ష్యంతో అహర్నిశలు కష్టపడి పని చేస్తూ నిన్న యావత్ భారతదేశానికి సంబంధించిన పత్రికా మిత్రులను, శాసనసభ్యులను, బీఆర్ఎస్, బిజెపి, ఎమ్ఐఎమ్ పార్టీ సభ్యులందరిని మేడిగడ్డ వద్దకు పిలిచారు. అక్కడ ఏ విధంగా పగుళ్లు వచ్చాయి, ఏ విధంగా భూమి లోపల కూడా పగుళ్లు వచ్చాయన్న విషయాన్ని ఈరోజు మన సమాజానికి తెలిసే విధంగా చేశారు. ఇప్పటికీ కూడా వాళ్లు ఏమి మాట్లాడుతున్నారు, అవి కేవలం రెండు మూడు పిల్లర్లు అని మాట్లాడుతున్నారు. రెండు మూడు పిల్లర్లు కాదు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన పోతే ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా కొట్టుకొని పోయే అవకాశం ఉన్నందున దీని పైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

12.50 మ. **శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:-** థాంక్యూ అధ్యక్షా. ఆకలై నిద్రొచ్చే టైం దాకా మీరు ఆగి, ఫస్ట్ అపోజిషన్ మాట్లాడిన తర్వాత సెకండ్ అపోజిషన్‌కు ఇవ్వాలి మంత్రి

గారూ. మీరు ఏం సభను నడుపుతున్నారు? ఇంతసేపు మీరు మమ్మల్ని ఒంటి గంట వరకు... (మైక్ కట్)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- సీనియర్ శాసనసభ్యులు.. ప్రతిపక్షం వారు మాట్లాడిన తర్వాత మళ్లా ట్రెజరీ బెంచెస్ తరఫున మాట్లాడిన తర్వాత మేము ఇవ్వాళ మాట్లాడలేదు.

(సభ్యులు ఏలేటి శ్రీ మహేశ్వర్ రెడ్డి గారి నుండి అంతరాయం)

నో..నో..నో బడ్జెట్ డిస్కషన్‌లో ఫస్ట్ ఆవిధంగా మాట్లాడి ఏ విధంగా నడుపుతున్నారు అని అంటే I have to stand here to correct the Hon'ble Members' statement here. సార్, నేను ఏం చెబుతున్నాను, మా సోదరులు వికారాబాద్‌కు సంబంధించిన పరిగి శాసనసభ్యులు మాట్లాడారు. వారు మాట్లాడినా, మీరు మాట్లాడినా ఒకటే సార్. వారినెందుకని ఎగ్గొడతాం.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి (నిర్మల్) :- అధ్యక్షా, తరాలు మారిన తలరాత మారదాయే, ప్రభుత్వాలు మారుతున్నాయి, ముఖ్యమంత్రులు మారుతున్నారు కాని రాష్ట్రంలో మా బతుకులు మారడం లేదని రాష్ట్రంలో అట్టడుగు బడుగు బలహీన వర్గాలు ఇంకా మనవైపే చూస్తున్నారు. ఏదో న్యాయం జరుగుతుందని, ఈ చట్ట సభలలో ఏదో మా గురించి మాట్లాడుతారని, మాకు ఇచ్చిన హామీని నెరవేరుస్తారని, మాకు ఇచ్చిన హామీలు ఖచ్చితంగా ఫుల్‌ఫిల్ అవుతాయని ఎన్నో ఆశలతో అట్టడుగు బడుగు బలహీన వర్గాలు మన మైపు చూస్తా ఉంటే, ఇక్కడ జరుగుతున్న చర్చలలో మీరు నన్ను దూషిస్తున్నారా, నేను మిమ్మల్ని దూషిస్తున్నానా? గతంలో మీరిచ్చిన హామీలు నెరవేరలేదని వీళ్లు, ఇప్పుడు ఎట్లా నెరవేరుస్తారని వాళ్లు కాదు అధ్యక్షా.. వాళ్లు నెరవేర్చలేదు. వాళ్లు ఈ రాష్ట్రాన్ని ధ్వంసం చేశారు. రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే కదా వాళ్ల నోరు కొట్టారు. ఈరోజు వీళ్లు ఇచ్చిన హామీలు నమ్మి, మిమ్మల్ని ప్రజలు ఓటు వేసి ఇవ్వాళ గెలిపించారు కదా. ఏ రకంగా మీరు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారో చెప్పాల్సిన బాధ్యత మీ మీద కూడా ఉన్నదని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

చట్ట సభలలో ఇక్కడ మాట్లాడుతున్నది ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్చలు ఉండాలే తప్ప ఇలా అనవసరంగా సమయాన్ని వృథా చేస్తున్నారు. అనవసరంగా సమయాన్ని వృథా చేస్తున్నారనే సంగతిని నేను మరొక్కసారి తెలియజేస్తున్నాను. ఈరోజు బడ్జెట్ ప్రసంగాన్ని ఒకసారి చూసినట్లయితే, పూర్తిగా మీ హామీలు, మీరు ఇచ్చిన మేనిఫెస్టోలో పెట్టారు కదా మరి బడ్జెట్‌లో ఎందుకు చదవలేక పోయారు? బడ్జెట్‌కి వచ్చేసరికి మీరు ఎందుకు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు? బడ్జెట్‌లో ఎక్కడా కూడా మీరిచ్చిన హామీలు మేనిఫెస్టోలో కాకుండా ఏదో ఒక రకంగా మీరు మాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏదో ఒక రకంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారనే సంగతిని నేను ఒకసారి తెలియజేస్తున్నాను. ఈరోజు సభలో ఫైనాన్స్ మినిస్టర్ గారు లేరు కాబట్టి గౌరవ ముఖ్యమంత్రి గారికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను పంపిస్తున్నాను.

(ఈ క్రమంలో సభ్యులు శ్రీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గారు కాంగ్రెస్ మేనిఫెస్టో బుక్‌ను గౌరవ ముఖ్యమంత్రి గారికి పంపించడం జరిగింది.)

బహుశ వెయున్న బడ్జెట్ ప్రసంగంలో మరచి పోయినట్లున్నారు. వారు ఇచ్చిన 412 హామీలు, 6 గ్యారంటీల స్కీమ్‌ల గురించి పూర్తిగా మరచిపోయినట్లున్నారు. విస్మరించారా, మరచిపోయారా? ఒకసారి గుర్తు చేయడం కోసం వారికి ఒకసారి మేనిఫెస్టోని ఇచ్చి గుర్తు చేస్తున్నాను. ఈరోజు ఒకసారి చూసినట్లయితే, గౌరవ ఆర్థిక శాఖమంత్రి గారు ఇక్కడ లేరు. ఈరోజు ట్యాక్స్ రెవెన్యూ రూ.20,100 కోట్లకు పెంచుతున్నారంటే మళ్లీ ప్రజల మీద భారం మోపుతున్నారు. ట్యాక్సులు పెంచుతారు కాబట్టి ఏ ట్యాక్సులు పెంచుతారో చెప్పవలసిన అవసరమున్నది. ఈనాడు కేవలం రూ.20,000 కోట్లకు ఈ రాష్ట్ర రెవెన్యూను పెంచుతారంటే మళ్లీ కల్లు సీసాల మీద పెంచుతరా, రిజిస్ట్రేషన్ దస్త్రాల మీద పెంచుతరా, లేకుంటే మీరు ఏ రకంగా ఈ రెవెన్యూను పెంచే ప్రయత్నం చేస్తారో ప్రజలకు చెప్పవలసిన అవసరమున్నది. అంతేకాదు గ్లోబల్ మార్కెట్‌లో అంటా గత ప్రభుత్వం గత సంవత్సరం రూ.40,000కోట్ల అప్పు తీసుకువస్తే, మేము

అంతకన్నా గొప్పోల్లం కదా, ఛాంపియన్‌లం కదా రూ.65,000కోట్ల అప్పు తీసుకొస్తామని బయలుదేరారు. రూ.65,000కోట్లు అప్పు తీసుకువచ్చి మళ్లీ పప్పు కూడు పెడతారంటా. మళ్లీ రూ.65,000కోట్లు అప్పు తీసుకువచ్చి పప్పు కూడు పెడతామని చెప్పడానికి ఈ ప్రభుత్వానికి ఏ రకంగా ధైర్యముంది? ఏ రకంగా మళ్లీ రీపేమెంట్ చేస్తారో దాని గురించి చెప్పాలి అధ్యక్షా.

మరి వారిచ్చిన హామీలు చూసుకుంటే కేవలం 6 గ్యారంటీల అమలుకు రూ.1,51,000కోట్లు కావలసి వస్తే, కేవలం రూ.50,000కోట్లు మాత్రమే ఈరోజు కేటాయించడం చాలా శోచనీయం. నేను ఒక్కటే అడుగుతున్నాను. ఈ రకంగా 6 గ్యారంటీలకు రూ.1,51,000కోట్లు అవుతా ఉంటే, ఇంకా 412 హామీలు పెండింగులో ఉంటే, 412 హామీల గురించి మాట్లాడకుండా, మీరిచ్చిన 6 గ్యారంటీలకు సరిపోని బడ్జెట్ పెట్టి ఈ రకంగా ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాల్సిన అవసరముంది. రూ.2,70,000కోట్ల బడ్జెట్‌ను మీరు ప్రవేశపెట్టారు. కాని దాంట్లో క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ మళ్లీ గత ప్రభుత్వం లాగానే రూ.29,000కోట్లే పెట్టారు. ఇది ఎంత అన్యాయం అధ్యక్షా? క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ కేవలం రూ.29,669కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారు. అంటే వాళ్లతోనే నడుస్తున్నారు. ఎందుకంటే, మీరు, వాళ్లు ఒకటే. గతంలో కలిసి క్యాబినెట్‌లో పని చేశారు కాబట్టి ఈరోజు కూడా మీరు కలిసే పని చేస్తున్నారు. ఇద్దరూ ఆడుతున్నటువంటి జగన్నాటకం ఇది. నేను తిట్టినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయమన్నట్లుగా వీళ్లు వీళ్లు మాట్లాడుకొని ఒకరేమో వాకౌట్ చేస్తరు.. ఈరోజు వీళ్లు సభను మొత్తం ఇది చేసేసి అటెన్షన్ తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారు గాని వాళ్లు ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా మోసం చేశారో, ఈ రాష్ట్ర ప్రజానీకానికి ఏ రకంగా అన్యాయం చేశారో, ఈరోజు కాంగ్రెస్ పార్టీ కూడా అదే తోవలో వెళుతున్న సంగతిని నేను గుర్తు చేస్తున్నాను. అధ్యక్షా, ఒకసారి ఆలోచన చేయండి. బడ్జెట్ అంకెలు చూస్తే సంక్షేమ కార్యక్రమాలు ఏ రకంగా నెరవేరుస్తారో చెప్పాల్సిన బాధ్యత వీళ్లమీద ఉన్నది. ఈరోజు వీళ్లు ఇచ్చిన లక్షల కోట్ల రూపాయల హామీలు ఈరోజు రూ50,000కోట్లు, రూ.60,000కోట్లతో ఏ రకంగా పూర్తి చేస్తారో చెప్పాల్సిన బాధ్యత వీళ్లమీద ఉన్నది.

ఈరోజు రెవెన్యూ విషయంలో కేవలం రూ.20 వేల కోట్లు పెంచారు. అది వస్తదో, రాదో తెలియదు. మరి ఏ రకంగా పెంచుతారో తెలియదు. మరి ఈ విధంగా ప్రజలను మోసం చేసి, వారిని మభ్యపెట్టి మోసపూరితమైన బడ్జెట్ అని నేను సభకు తెలియజేస్తున్నాను. అంతేకాదు ఈరోజు కేటాయింపులు చూడండి అధ్యక్షా. వ్యవసాయ రంగం తీసుకుంటే, 2 లక్షల రుణమాఫీ చేయాలంటే రూ.35,000కోట్లు కావాలి. 2 లక్షల రుణమాఫీ మీరు ఏ రకంగా చేస్తారో రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన అవసరముంది. 2 లక్షల రుణమాఫీ గురించి ప్రస్తావించారు గాని దానికోసం ఎంత ఫండ్ అలోకేషన్ చేశారో చెప్పలేదు. రైతుబంధు విషయంలో ఆరోజు చెప్పిన మీ మేనిఫెస్టోలో చెప్పిన అంశాలు – 2 లక్షల రుణమాఫీ, రూ.15,000/-లు రైతు భరోస, రూ.12,000/-లు కౌలు రైతులకు ఆసరా, పంటకు బోనస్ రూ.500/-లు, రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ రంగానికి ఉచిత కరెంటు, ఎరువుల మీద సబ్సిడీ అంటా, ఇన్‌పుట్ సబ్సిడీ అంటా వీటన్నింటికి ఇచ్చింది కేవలం రూ.19,746కోట్లు. ఈ డబ్బులు కేవలం రైతుబంధుకు సరిపోవు అధ్యక్షా. ఈరోజు రుణమాఫీ ఎట్లా చేస్తరు? రూ.500/-లు పంటకు బోనస్ ఎట్లా ఇస్తరు? కౌలు రైతులకు ఎట్లా రూ.12,000/-లు ఇస్తరు? మరి ఎంతమంది కౌలు రైతులను మీరు ఐడెంటిఫై చేశారు? అంటే కేవలం మీరు అధికారం కోసం, గద్దె కోసం, కుర్చీ కోసం, ప్రజలను మోసం చేసి, మాయ చేసి అధికారంలోకి వచ్చారు తప్ప, ఎక్కడా కూడా మీరు ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద పొంతన లేకుండా అంకెలున్నాయి. ఒక సీజన్‌కు ఎకరానికి రూ.5,000/-ల చొప్పున మనం చెల్లిస్తేనే రూ.6,889కోట్లు కావాలి. ఏడాదికి ఎకరానికి రూ.5,000/-ల చొప్పున రెండు సీజన్ పంటలకు మీరు చెల్లిస్తే రూ.13,778కోట్లు కావాలి.

1.00 మ. అంటే ఏడాదికి రెండుసార్లు మీ ప్రభుత్వం ఒప్పుకున్న ప్రకారం రైతుబంధు వేయాలంటే 20వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుంది. కేవలం మీరు రైతుబంధుకే 20వేల కోట్ల రూపాయలు ఇస్తే మరి ఋణమాఫీ

ఏ విధంగా చేస్తారు? రైతులకు లక్ష రూపాయల ఋణమాఫీ చేయాలంటే ఇరవైవేల పైచిలుకు నిధులు అవసరం పడుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 19వేల కోట్ల రూపాయలు కేటాయిస్తేనే రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ పూర్తిగా అంటే కనీసం 29 వేల 61 లక్షల మంది రైతులకు చేయలేకపోయింది. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలంటే దాదాపు 35వేల కోట్ల రూపాయలు అవసరం పడుతుంది. ఒకవేళ మీరు వాయిదా పద్ధతిలో ఇద్దామనుకున్నా గానీ దాని మీద ఎలాంటి క్లారిఫికేషన్ ఇవ్వలేదు, మరి ఏరకంగా ముందుకు వెళతారో ఇప్పటివరకు చెప్పడం లేదు కాబట్టి ఈ ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని చూస్తున్నందున కనీసం ఇప్పుడైనా తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాల్సిందిగా డిమాండు చేస్తున్నాను. రైతులకు రుణమాఫీ చేయాల్సిన 35వేల కోట్ల రూపాయలకు కావలసిన దానికి కేటాయింపులు చేయలేకపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని వాడుకొని మీరు ఇన్సూరెన్సు ఇస్తామని అంటున్నందుకు సంతోషం. నేను ఒకటే అడుగుతున్నదేమంటే ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని మీ ప్రభుత్వం వాడుకున్నప్పుడు మరి ప్రధానమంత్రి గారి పేరు ఎక్కడైనా ప్రస్తావించారా అంటే ప్రస్తావించలేదు ఆ అంశాన్ని ఎక్కడైనా చెప్పి ఉంటే బాగుండేది గాని ఈ విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని గుర్తించకుండా చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామని అంటున్న 500 రూపాయల బోనస్, 24 గంటల ఉచిత కరెంటు, 3లక్షల వడ్డీ లేని రుణాలు ఏరకంగా ఈ బడ్జెట్‌లో పెట్టిన 19వేలకోట్ల రూపాయలతో ఇవ్వాలనుకుంటున్నారో తెలంగాణ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది.

బీసీ శాఖ మంత్రిగారు ఇక్కడ ఉన్నారు, వారు ఒక్క నిమిషం కూర్చుంటే వారికే అర్థం అవుతుంది. ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన హామీలు చూస్తే బీసీలకు ప్రత్యేక నిధులు ఇస్తామన్నారు, స్థానిక సంస్థలకు రిజర్వేషన్, బీసీలకు సబ్‌ప్లాన్ ప్రవేశపెట్టి బీసీలకు ప్రతేక నిధులిస్తామన్నారు, అయిదేండ్లలో బీసీలకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి పది లక్షల రుణ సహాయం ఇస్తామని చెప్పారు. ఇన్ని చెప్పిన అధికార ప్రభుత్వం 52 శాతం ప్రజానీకం ఉన్న బీసీ వర్గానికి అన్యాయం చేశారు. బీసీలకు పది లక్షల రూపాయలు రుణ సహాయం చేయాలంటే దానికి కావలసిన లక్షల కోట్ల రూపాయలు ఏవిధంగా సమకూరుస్తారో చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉంది. అయిదు సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయలు బీసీలకు కేటాయిస్తామని చెప్పారు అంటే సంవత్సరానికి బీసీ సంక్షేమానికి 20వేల కోట్ల రూపాయలు ఇవ్వాల్సి వస్తుంది కానీ మీరు కేటాయించింది కేవలం 8వేల కోట్ల రూపాయలు మాత్రమే. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 82 శాతం బీసీలను ఈ రకంగా మోసం చేయడం మంచి పద్ధతి కాదు.

అంతే కాకుండా వీరు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో చెప్పిందేమిటంటే కులగణన చేస్తామని అన్నారు అది ఖర్చు లేని పని కాబట్టి సంతోషం. కానీ వారికి ఇస్తామన్న సబ్‌ప్లాన్‌లు, వారికి ఇస్తామన్న నిధుల గురించి మాట్లాడం లేదు. పాపం అక్కడి సభ్యులకు సాయంగా ఇద్దరు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారు, అందుకే కేబినెట్‌లో కనీసం ఆరుగురు బీసీ మంత్రులు ఉండాలి. అదేవిధంగా చేతివృత్తులకు సహాయం గాని, వివిధ సామాజిక వర్గాలకు సహాయం గాని, విద్యపై గాని, గొల్ల కుర్మలకు గానీ ఎన్నో రకాల హామీలిచ్చారు ఇంకా చెప్పడానికి చాలా ఉన్నాయి, నాకు ఇచ్చిన సమయం సరిపోదు కాబట్టి చెప్పలేకపోతున్నాను కానీ ఒక్కటి మాత్రం చెప్పదల్చుకున్నాను. బీసీ వర్గాలను విస్మరించి వారికి ఇచ్చిన హామీలను మరిచిపోయి బీసీలకు తీరని అన్యాయం చేసిన ప్రభుత్వం ఈ ప్రభుత్వమే అని తెలియజేస్తున్నాను. అంతే కాకుండా నిరుద్యోగ్యుల ఆశల మీద నీళ్లు చల్లిన సర్కారు, హైదరాబాదులో యూత్ డిక్లరేషన్ మేనిఫెస్టో, నిరుద్యోగులకు నాలుగు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు, ఈ నెల ఫిబ్రవరిలో ఉద్యోగాల నోటిఫికేషన్ జాబ్ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబరులోగా ఉద్యోగ నియమాకాలను పూర్తి చేస్తామని చెప్పి ఈ హామీలన్నీ నెరవేర్చలేకపోయారు కాబట్టి ముమ్మాటికి నిరుద్యోగులకు అన్యాయం చేసిన ప్రభుత్వం ఈ కాంగ్రెస్

ప్రభుత్వమేనని తెలియజేస్తున్నాను. గతంతో పీసిసి అధ్యక్షుడుగా ఉన్న రేవంత్‌రెడ్డి గారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారు. ఇప్పటికీ నిరుద్యోగ యువత ముఖ్యమంత్రిగారు మాకు నిరుద్యోగ భృతి ఇస్తామని మాట ఇచ్చారు. వారు ఇచ్చిన మాట తప్పరని ఎంతోఆశతో ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుండి ఈరోజు వరకు 1400 కోట్ల రూపాయలు బాకీ ఉన్నారు. ఇప్పటికైనా 1400 కోట్ల రూపాయలు వదిలేస్తాం, కనీసం ఈ నెల నుండైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. నిరుద్యోగులను, బీసీ వర్గాలను, అన్ని వర్గాలను మోసం చేసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.

అదేవిధంగా బడ్జెట్‌లో ఇళ్ల నిర్మాణానికి కేటాయించింది 7740 కోట్ల రూపాయలు మాత్రమే కానీ వీరు ఒక్కనియోజక వర్గానికి 3,300 ఇళ్లను ఇస్తామని చెప్పారు కాబట్టి ఆ 3,300 ఇళ్ల నిర్మాణం జరగాలంటే 22,000 కోట్ల రూపాయలు కావాలి. ఈ 22వేల కోట్ల రూపాయలకు గాను, 7740 కోట్ల రూపాయలతో ఈ రోజు బడ్జెట్ కేటాయింపులు చేసి మూడు సంవత్సరాలకు కూడా పూర్తి చేయలేని ఈ స్కీంను ఈ ఫైనాన్షియల్ ఇయరే పూర్తి చేస్తామనే విధంగా గొప్పలకు పోతున్నారు, ఇది ఎంత వరకు న్యాయమని అడుగుతున్నాను. దీంట్లో ఒక కిటుకు పెట్టారు దీనికి పి.ఎం ఆవాస్ యోజన సహాయం తీసుకుంటామని చెబుతున్నారు మరి పిఎం ఆవాస్ యోజన సహాయం తీసుకుంటూ ఇందిరమ్మ పథకం అని ఎందుకు పేరు పెడుతున్నారు. స్వర్గీయ మా వాజ్‌పేయి గారి పేరు కూడా పెట్టాలని కోరుతున్నాను. లక్షా నలభై వేల రూపాయలు ఆ స్కీంలో యాడ్ అయితే లక్షా నలభై వేల రూపాయలు మాఫీ అవుతుంది. మరి దాంట్లో వడ్డీ లేని రుణం వస్తుంది కదా అని అడుగుతున్నాను. పి.ఎం ఆవాస్ యోజన క్రింద ఇళ్లు ఇస్తామని అవాస్ యోజన స్కీంను వాడుకొని, కేంద్రప్రభుత్వం నిధులను ఇక్కడ వాడుకొని బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేరు ఎక్కడా ప్రస్తావించకుండా కనీసం కృతజ్ఞతలు తెలియజేయకుండా, కేవలం ఇందిరమ్మ పేరు మాత్రమే పెట్టుకుంటున్నారు సంతోషం కానీ మీరు వాజ్‌పేయి పేరు కూడా యాడ్ చేయాలని నేను డిమాండు చేస్తున్నాను. ఇళ్లు లేని వారికి అయిదు లక్షల రూపాయలు, ప్లాట్ లేని వారికి ప్లాట్ ఇస్తామని చెప్పారు, ఏరకంగా ప్లాట్ ఇస్తారు? ప్రభుత్వ భూమి ఇస్తారా లేదంటే ప్రయివేటు భూమి కొని ఇస్తారా లేక ప్రభుత్వ భూములు ఏ నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలున్నాయని బేరీజు వేసుకున్నారా, ఇండ్లు లేని వారు ఎంత మంది ఉన్నారో లెక్క చెప్పాలిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. కేవలం మాటల గారడీ, అంకెల గారడీతో ఈ తెలంగాణ ప్రజానీకాన్ని మోసం చేస్తున్న మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.

ఈ ప్రభుత్వం బీసీల తరువాత ఎస్సీలకైనా న్యాయం చేస్తారని అనుకున్నాను. సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారే ఫైనాన్స్ మినిస్టరుగా ఉన్నారు కనీసం ఆ వర్గం వారికైనా న్యాయం చేస్తారని ఆశించాను. వారు ఈ శాసనసభలో లేరు వారు ఎక్కడున్నా కనీసం నా మాటలు వింటారేమో, ముఖ్యమంత్రి గారు టివిలో చూస్తున్నారు కావచ్చు. వారికి నేను ఒక్కటే మాట చెబుతున్నదేమంటే మీ ప్రభుత్వం ఏ ఎస్సీలకైతే భరోసా ఇచ్చారో ఆ ఎస్సీలకు దళితబంధు పథకం కింద రెండు లక్షలు పెంచి పన్నెండు లక్షలు ఇస్తామని చెప్పారు కదా దానికి లక్షల కోట్లు సమకూర్చాలి, దానికి సంబంధించి ఎంత బడ్జెట్ కేటాయించారని అడుగుతున్నాను.

1.10 మ. ఈ బడ్జెటులో ఎస్సీ సంక్షేమం కోసం మీరు ఇచ్చింది రూ.21,874 కోట్లు, గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్ పార్టీని కాపీ కొడుతోంది. కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు కలిసి బడ్జెటు ప్రిపేర్ చేసినట్లు ఉంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంతంగా బడ్జెటు ప్రిపేర్ చేసినట్లు కనిపించడంలేదు. ఆ రెండు పార్టీలు ఒక నాటకం ప్రకారం ముందుకు వెళుతున్నాయి. చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్... మేనిఫెస్టోలోని హామీలలో మహాత్ముడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పేరును వాడుకున్నారు. మహాత్ముడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పేరును వాడుకుని అబద్ధాలు ఆడుతున్నారు, దాన్ని ఒప్పుకోము. నేను మీద్వారా ప్రజానీకానికి తెలియజేస్తున్నాను,

డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పేరును వాడుకుని మోసం చేస్తున్న మాట వాస్తవం కాదా? రూ.12,00,000 ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పారు కదా, దాని కోసం ఎంత బడ్జెటు కేటాయించారో చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉన్నది. దాదాపుగా పదహారు లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూర్చడానికి రూ.2,00,000 కోట్లు అవసరం ఉంటుంది, రూ.2,00,000 కోట్లను అయిదు సంవత్సరాలలో ఏ రకంగా సమకూర్చుకొని దళిత సామాజిక వర్గానికి న్యాయం చేస్తారో చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రతి బడ్జెటులో సరిపోను నిధులు ఇస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేరుస్తామని అన్నారు, ప్రతీసారి మోసం, మోసం కాంగ్రెస్ కాకపోతే టిఆర్ఎస్, టిఆర్ఎస్ కాకపోతే కాంగ్రెస్ నాయకులు, ఒకరు కాకపోతే మరొకరు తప్పుడు వాగ్దానాలతో తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తున్నారే తప్ప రాష్ట్ర ప్రజానీకానికి మనకు ఉన్న రెవెన్యూ ఎంత? మనం ఏం ఇవ్వగలుగుతామో ఆలోచన లేకుండా ఇష్టానుసారంగా పదవి ఆకాంక్షతో, అధికారంలోకి రావాడానికి ఇష్టానుసారంగా హామీలు ఇచ్చారు.

శ్రీ మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్:- బీజెపి, బిఆర్ఎస్ అలయన్స్ ఉండదని మీరు ఈ శాసన సభలో గ్యారంటీ ఇవ్వలగలుగుతారా? పార్లమెంటులో అలయన్స్ అవుతామని చెబుతున్నారు, బయట ప్రజలందరూ చెబుతున్నారు, దీనిపై సభలో మాట ఇవ్వగలుగుతారా? ధైర్యంగా చెప్పగలుగుతారా? దీనిపై జవాబు చెప్పండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- గౌరవ సభ్యులు మొదటిసారి శాసన సభలో మొదటి ప్రశ్న అడగడం సంతోషంగా ఉంది. బీఆర్ఎస్‌కు బీజేపీకి ఎప్పుడూ అలయన్స్ లేకుండే, ఎప్పుడూ అలయన్స్ లేదు. ఎప్పుడైనా ఉండే సమస్యే లేదు. ఎప్పుడైనా అలయన్స్ అంటూ ఉంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలవి విడదీయని బంధం, వారంతా ఒకటే, వారు కలిసి సంసారం చేశారు, కలిసి కాపురం చేశారు, కలిసి మంత్రివర్గం పంచుకున్నారు. కాంగ్రెస్ సభ్యులు సబ్జెక్టు డీవియేట్ చేయడానికి ఈ రకంగా మాట్లాడుతున్నారు.

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మేము కాళేశ్వరం వెళ్లి వచ్చాము, కాళేశ్వరం గురించి నేను మాట్లాడతాను, మీరు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. అన్నీ మాట్లాడతాను, అన్నీ ఆధారాలు తీసుకువచ్చాను. మీరు పిక్‌నిక్‌కు వెళ్లి వచ్చారు కదా.. లంచ్, డిన్నర్ బాగుందా? ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అయితే చూశాము. అక్కడ లంచ్ పెట్టారా, లేదా? బువ్వ పెట్టారా? మళ్లీ ఒకసారి పిక్‌నిక్‌కు తీసుకొని వెళతారు మన ముఖ్యమంత్రిగారు. ఎప్పుడు మూడ్ వస్తే అప్పుడు పిక్‌నిక్‌కు తీసుకొని వెళతారు, Don't worry మన ముఖ్యమంత్రిగారు మంచివారు.

అంబేద్కర్ అభయ హస్తంలో మోసం. పదహారు లక్షల కుటుంబాలు మనవైపు ఆశగా చూస్తున్నాయి, ఆ పథకానికి కావాల్సిన రూ.2,00,000 కోట్లలో కనీసం రూ.25,000 కోట్లు ఆ పథకానికి కేటాయించలేని పరిస్థితిలో ఉన్నారు. మన బడ్జెటు సరిపోదని తెలిసి కూడా.. మీరు ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణ రాష్ట్ర బడ్జెటే కాదు, దేశ బడ్జెటు కూడా సరిపోదు. కానీ ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలని, ఏదో ఒక రకంగా ప్రజలను మోసం చేయాలి, ప్రజలు మోసపోతూనే ఉంటారు, మేము మోసం చేస్తూనే ఉంటాము అన్నట్లుగా ప్రజలను మభ్యపెట్టి, అబద్ధాలు చెప్పి మోసం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేశారు, అధికారంలోకి వచ్చారు. కానీ, ప్రజలు గమనిస్తున్నారు, మీ మోసాన్ని గమనిస్తున్నారు, ఇది ఎక్కువ కాలం సాగే సంసారం కాదని తెలియజేస్తున్నాను. మీరు ఇచ్చిన హామీల ప్రకారమే చెబుతున్నాను... కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఎ, బి, సి, డి వర్గీకరణ గురించి మాట్లాడారు, కనీసం ఎ, బి, సి, డి వర్గీకరణ కోసమైనా శాసన సభలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టాల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మళ్లీ ఒకసారి తెలంగాణ కొత్త సభలో తీర్మానం చేద్దాము, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయింది, కొత్త సభలో తీర్మానం చేద్దాం, కాంగ్రెస్ పార్టీ సభ్యులకు ఏమైనా అభ్యంతరం ఉందా? కేంద్ర ప్రభుత్వం చేయడానికి ఒప్పుకున్నది, ఇస్తున్నాము,

ఇప్పటికే కమిటీ కూడా వేశాము. మేము చెప్పిన మాటకు కట్టుబడి ఉంటాము, కాంగ్రెస్ పార్టీలాగా తప్పుడు వాగ్దానాలు చేసే పార్టీ కాదు బీజేపీ, ఎప్పుడైనా ఇచ్చిన హామీలను నెరవేరుస్తాము.

మూసీ ప్రక్షాళనను స్వాగతిస్తున్నాము, దాని కోసం వెయ్యి కోట్లు మంజూరు చేశారు. బీజేపి వాస్తవాలను ఒప్పుకునే పార్టీ కచ్చితంగా మేము ఆ ప్రాజెక్టును స్వాగతిస్తున్నాము. కానీ, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు కావాల్సిన నిధులు ఎంత? బడ్జెటులో కేటాయించిన నిధులు దేనికి సరిపోతాయి. హుస్సేన్‌సాగర్ పక్కనే మనం ఉంటాము, మూసీ నదితోపాటు హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన గురించి కూడా మాట్లాడి ఉంటే బాగుండేది. మేము చిన్నగా ఉన్నప్పుడు పాఠశాలకు అక్కడినుంచే వెళ్లే వాళ్లము, అప్పుడు అవి తాగే నీరు అని చెప్పేవారు, ఆ నీటిని బిందెలతో మోసుకొని వెళ్లేవారు, అటువంటి హుస్సేన్‌సాగర్ పక్కన కూడా కూర్చునే పరిస్థితి లేదు. దాని గురించి కూడా ఆలోచిస్తే బాగుండేదని సభకు మనవి చేస్తున్నాను.

Micro & Small Enterprises Cluster Development Programmeలో చేనేత పరిశ్రమ, మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం పీఎం మిత్ర, పీఎం ఆవాస్ యోజన పథకాలను వాడుకుంటున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. హైదరాబాద్ ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుంటే ఫార్మాసిటీని ఎందుకు ఔటర్ రింగ్ రోడ్డు బయటకు పంపడంలేదు? ఫార్మాసిటీని ఎందుకు అక్కడే పెట్టవలసి వస్తుంది? కాలుష్యం గురించి ఇంతగా మాట్లాడుతున్నాము, ఫార్మాసిటీని ఎందుకు తరలించడం లేదు. గతంలో ఫార్మాసిటీ కాలుష్యం గురించి పోరాటం చేసిన రేవంత్ రెడ్డి గారు దాన్ని అక్కడి నుంచి తరలించడానికి ఎందుకు ఆలోచన చేయడంలేదో చెప్పాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను.

కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలకు దాదాపుగా లక్షా యాభై మూడు వేల కోట్లు అవసరమైతే, బడ్జెటులో కేటాయించింది కేవలం యాభై మూడు వేల కోట్లు. 412 హామీలను పూర్తిగా విస్మరించారు, దాని గురించి ఎక్కడా ప్రస్తావన చేయలేదని తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ సర్కారు విద్య, వైద్యాన్ని విస్మరించింది, వాటికి గత ప్రభుత్వం ఇచ్చిన మొత్తంలోనే బడ్జెటు కేటాయించడం జరిగింది. గత ప్రభుత్వం వైద్య రంగానికి కేటాయించిన ప్రకారం తెలంగాణ భారతదేశంలోనే చిట్టచివరి స్థానంలో ఉంది, విద్యారంగం 32వ స్థానంలో నిలిచింది. ఈ విధంగా గత ప్రభుత్వం కేటాయించిన బడ్జెటుకు దగ్గరగా కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయింపులు చేసి, అట్టడుగు వర్గాలకు అవసరమైన వైద్యం, విద్యని ఎందుకు విస్మరిస్తున్నారో ఖచ్చితంగా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.

మంగళవారం నాడు కాళేశ్వరం పర్యటనకు రాలేదు కాబట్టి బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని చెప్పే ప్రయత్నం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా తెలివైన వారు, నేను చిన్నప్పటినుంచి చూస్తున్నాను. గతంలో కూడా ఇదే ప్రాపగండాను, స్లోగన్‌ను వాడుకొని ముఖ్యమంత్రి అయ్యారు, మళ్లీ పార్లమెంటు ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి అదే స్లోగన్‌ను వాడుకుందామంటే అది పని చేయదని చెబుతున్నాను, ముఖ్యమంత్రిగారూ, ప్రతీసారి సేమ్ ఫార్ములా పనికిరాదు. నేను మీకు ఒక విషయం తెలియజేస్తున్నాను, ఏ రోజు కూడా భారతీయ జనతా పార్టీ, బీఆర్ఎస్‌తో కలిసి పని చేసే సమస్యే లేదు, కలిసి పని చేయబోదని మనవి చేస్తున్నాను.

1.20 మ. ఏది ఉన్నా కూడా సంసారం మీ మధ్యలోనే ఉన్నది, రిలేషన్‌షిప్ మీ మధ్యలోనే ఉన్నది. నిజంగా రేవంత్‌రెడ్డి గారికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లడం ఎందుకండీ? కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎమ్మెల్యేలు వెళ్లడానికి వారేమైనా టెక్నికల్ పర్సన్స్ కాదు కదా అని అడుగుతున్నాను. మేం అక్కడికి వెళ్లినా దాని గురించి మాకేం అర్థమవుతుంది.

శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్:- అధ్యక్షా, గౌరవసభ్యులు ముఖ్యమంత్రి గారి పేరు తీసుకొని మాట్లాడుతున్నారు. వారు తెలంగాణ ప్రజానీకానికి ఏం చెప్పారంటే గడచిన పది సంవత్సరాల నుంచి ప్రాజెక్టులలో లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన ప్రాజెక్టు అవకతవకల

మీద ప్రజలతో ఎన్నుకోబడిన శాసనసభ్యులను అంటే అన్ని పార్టీలకు చెందిన శాసనసభ్యులను అందులో బీజెపి శాసనసభ్యులను కూడా ఆహ్వానించడం జరిగింది. ప్రాజెక్టు సందర్శనకు బీజెపి చెందిన శాసనసభ్యులు రాకుండా ఇవ్వాళ ముఖ్యమంత్రి గారి మీద మాట్లాడటం మంచిది కాదు. వారు ప్రధానమంత్రి గారితో గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల నుంచి భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండి దళితులకు గాని, బలహీనవర్గాలకు గాని, పేద ప్రజానీకానికి గాని కేంద్ర ప్రభుత్వం ద్వారా చేసినటువంటి మంచి పనులేంటనేది చెప్పమనండి. ఈరోజు బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాలతో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా రావలసిన నిధులను గురించి ఒకమంచి సలహా ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, లక్ష్మణ్ కుమార్ గారు ఈ శాసనసభకు మొదటిసారి ఎన్నికై వచ్చారు. కాబట్టి పద్ధతుల గురించి మీరు చెప్పొద్దు. రేవంత్‌రెడ్డి గారు ఏ రకంగా మాట్లాడారనేది నేను ఇప్పుడు చెప్పదల్చుకోలేదు. రేవంత్‌రెడ్డి గారి భాష గురించి నేను ఇక్కడ మాట్లాడటం లేదు.

SRI D.SRIDHAR BABU:- No, we take a strong objection. As a Legislative Affairs Minister I would like to intervene with your kind permission. లక్ష్మణ్ కుమార్‌గారు చాలా రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి. వారు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా చేశారు. వారు మొదటిసారి శాసనసభకు వచ్చి ఉండొచ్చు, రాజ్ ఠాకూర్ గారు కూడా మొదటిసారి శాసనసభకు వచ్చి ఉండొచ్చు కానీ సభా సాంప్రదాయాలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే వారు ఆ పరిధిలోనే మాట్లాడుతున్నారు. మీరు సీనియర్ శాసనసభ్యులుగా కొద్దిగా ఓపికతో వినిపించే సదవకాశాన్ని వారికి కల్పించాలి గానీ మీరు వారిని ఉద్దేశించి మొదటిసారి శాసనసభకు వచ్చారు, సాంప్రదాయాలు తెలియవని అంటే సరి కాదని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మా లక్ష్మణ్ కుమార్‌గారు ఒకటే అడిగారు. మీరు పదే పదే అంటున్నారు. మా ముఖ్యమంత్రిగారు అంటుండొచ్చు, మేం అంటున్నాము. బీజెపి, టిఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని రాష్ట్రప్రజానీకం అనుకుంటున్నారు. మా రాజ్ ఠాకూర్ గారు అడిగిందేమంటే రాబోయే కాలంలో మీరు, వారు బయట ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని కలవరని ఏ విధమైన నమ్మకం కలిగిస్తారు? రేపు శాసనసభలో కూడా వారు, మీరు మమేకం కామని రాబోయే కాలంలో ఏ విధంగా చెబుతారనేది స్పష్టంగా సమాధానం కోరుతున్నామని రాజ్ ఠాకూర్ గారు అడిగారు. గోదావరి నదీ జలాలకు సంబంధించి జరిగిన అనేక అక్రమాలు, తప్పిదాల విషయంలో లక్ష్మణ్ కుమార్‌గారు మాట్లాడటం జరిగింది. గౌరవ సభ్యులు మొత్తం సమాచారంతోనే సభకు వచ్చానని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి అధికారాలున్నాయి కాబట్టి ఆ అధికారాలను ఉపయోగించుకొని రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి ప్రత్యేకించి రాష్ట్ర విభజన చట్టం కింద తెలంగాణ రాష్ట్రానికి రావలసిన అనేక హక్కులున్నాయి, దాని గురించి కూడా ప్రస్తావన చేస్తే బాగుంటుందని మీద్వారా వారికి తెలియజేస్తున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, శ్రీధర్‌బాబు గారు చాలా తెలివిగా సబ్జెక్టును డీవియేట్ చేస్తారు, చాలా తెలివైన వాడు. వారు చాలా సీనియర్ శాసనసభ్యులు. వారు కూడా నా చిన్ననాటి స్నేహితుడే. వారు ఏ రకంగా చేస్తారనేది నాకు తెలుసు. నేనేమన్నానంటే గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా ఏ రకంగా మాట్లాడతారనేది మీకు తెలుసు అన్నాను. నేను సభలోని ఏ సభ్యుడి పేరు ప్రస్తావించినా గౌరవ సభ్యుడు అని ప్రస్తావిస్తాను. నేను ఎవరిని పిలిచినా ఏరోజు కూడా అన్ పార్లమెంటరీ భాష మాట్లాడే అలవాటు నాకు లేదు, అలాంటి భాష కూడా నేను మాట్లాడను. గౌరవ ముఖ్యమంత్రిగారు నిన్న మాట్లాడిన భాషగురించి మాత్రమే నేను ప్రస్తావన చేశాను. గౌరవ ముఖ్యమంత్రి గారు బీజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కలవరని, ఈ రెండు పార్టీలకు ఫర్దర్‌గా కూడా లోపాయికారి ఒప్పందం ఉండదని, రేపు

పార్లమెంటులో మీరు, వాళ్లు కలవరా, భవిష్యత్తులో ఎప్పటికీ కలవరా అనేది చెప్పండి. భవిష్యత్తులో బిఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోరా అనేది మంత్రిగారు చెప్పకుండా మమ్మల్ని చెప్పమంటే ఎలా అని అడుగుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలో ఉన్నది కాబట్టి అవసరమైనప్పుడు అలయెన్స్ పెట్టుకున్నది మీరు, గతంలో కూడా అలయెన్స్ పెట్టుకున్న చరిత్ర ఈ కాంగ్రెస్ పార్టీకి ఉన్నది. అది చెప్పకుండా మమ్మల్ని తప్పు పట్టడమనేది మంచిది కాదని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రి గారిని నేను అన్న మాటను మరొక్కసారి ప్రస్తావన చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారూ, కేవలం మేం పిక్‌నిక్‌కు రాలేదని చెప్పి మాకు బిఆర్ఎస్ పార్టీతో అంటగట్టే ప్రయత్నం చేశారు. నిన్న ఈ ప్రభుత్వ పెద్దలు మేడిగడ్డకు వెళ్లిన సందర్భంగా బీజెపి పార్టీ సభ్యులం అక్కడికి రాలేదని వారు మమ్మల్ని విమర్శిస్తున్నారు. అంటే వారితోబాటు మేం వెళితేనేమో మంచివాళ్లం, వెళ్లకపోతేనేమో ఇదవుతామా? గతంలో గౌరవ శాసనసభ్యులుగా ఉన్నటువంటి ఈటెల రాజేందర్ గారు, రఘునందన్‌రావు గారు, కేంద్ర మంత్రిగా ఉన్నటువంటి కిషన్‌రెడ్డి గారు, మా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ గారు అందరు కలిసి మేడిగడ్డకు వెళ్లి వచ్చిన తరువాత ఆ ప్రాజెక్టు పగుళ్ల గురించి బయట పెడితే ఆరోజు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి గారు ఒక స్టేట్‌మెంటు కూడా ఇచ్చారు, వారు ఏమని స్టేట్‌మెంట్ ఇచ్చారంటే...........

(ఈ సందర్భంలో వీడియో క్లిప్పింగును సభకు చూపించే ప్రయత్నం చేశారు)

SRI D.SRIDHAR BABU:- Speaker Sir, What is this? Without permission of the Chair and the House, nobody can display or try to put Audio recordings in this House.

SRI ALETI MAHESHWAR REDDY:- Sir, why they did not stop Harish Rao Garu, when he has played Audio yesterday? వారికి వినడానికి ఓపిక ఉండాలి, వారు స్వయంగా పిసిసి అధ్యక్షుడిగా నన్ను కేంద్ర ప్రభుత్వం దగ్గరికి తీసుకెళ్లి అమిత్‌షాను కలిపిస్తే నేను ఆధారాలతో సహా బయట పెడతాను. ఒకవేళ నిరూపించకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి గారు జరిగిన అవినీతి గురించి సిబిఐకి అప్పజెబితే నేను సిబిఐకి ఆధారాలతో సహా ఇస్తాను, నిరూపిస్తాను లేదంటే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి గారు ఈరోజు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనేది చెప్పాల్సిన అవసరమున్నది.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, మా మేనిఫెస్టోలో చెప్పిందేమంటే మా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జూడీషియల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పాము. మా మేనిఫెస్టోలో ప్రజలకు చెప్పిన విషయాన్ని మేము అమలు చేసే కార్యాచరణలో ఉన్నాము. ఈరోజు కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరైనా ఆపారా, మీరేమైనా విచారణ చేయాలని అంటే మేమేమైనా ఆపినమా? మీ కేంద్ర ప్రభుత్వం ఉన్నది, మీకు అధికారాలున్నాయి, మీరెందుకు సిబిఐ ఎంక్వైరీ చేయలేకపోతున్నారు, మీరు, వారు లోపాయికారికంగా ఒప్పందంతో నడుస్తున్నారు కాబట్టే కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అంటున్నాము. జరిగిన తప్పిదాలను కప్పిబుచ్చడానికి ముఖ్యమంత్రి గారి పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారు. ముఖ్యమంత్రిగారు కూడా జ్యుడీషియల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ గురించి ఈరోజు హైకోర్టును కూడా అనుమతి కోరుతూ హైకోర్టు నుంచి సిట్టింగు జడ్జికి ఇవ్వాలని వారిని కోరడం జరిగింది. సోదరులు మహేశ్వర్‌రెడ్డి గారిని నేను కోరేదేమంటే కేంద్ర ప్రభుత్వంలో బీజెపి పార్టీ అధికారంలో ఉన్నందున వారికి పూర్తి స్థాయి అధికారాలు ఉన్నాయి. కేంద్రం తల్చుకుంటే ఏదైనా చేసే హక్కు, అధికారం ఉన్నప్పటికీ ఎందుకు ఇప్పటివరకు చెయ్యలేకపోయారని అడుగుతున్నాను. కేంద్రం ఎందుకు చెయ్యలేదనే దాని గురించి కారణాలను కూడా చెప్పాల్సిన అవసరముంటుంది.

1.30 మ. **శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:-** అధ్యక్షా, this is purely misleading the House. ఒక శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రిగా ఇంత మిస్‌లీడ్ చేయడం కరెక్టా అధ్యక్షా? సార్ ఎంత మిస్‌లీడ్ చేస్తున్నారంటే, కేంద్రానికి అధికారం ఉందంటా? కేంద్రం అనుకుంటే డైరెక్ట్‌గా ఒక అటానమస్ బాడీతో ఎంక్వైరీ చేయవచ్చని అంటున్నారు.

నిజంగా వారికి అంత చిత్తశుద్ధి ఉంటే వారు ఒక లెటర్ ఇవ్వాలి. 48 గంటల్లో సిబిఐ ఎంక్వైరీ మొదలు పెట్టించుకుంటే నేను కూడా ఈ రాజకీయాల నుండి తప్పుకుంటా అని తెలియజేస్తున్నాను. ఈరోజు ఈవిధంగా సభను తప్పుదోవ పట్టించడం మంచి పద్ధతి కాదు. అదేవిధంగా హైకోర్టును అడిగారని చెబుతున్నారు. సిట్టింగ్ జడ్జీని ఇవ్వడం పాజిబుల్ కాదని హైకోర్టు ఇప్పటికే చెప్పింది. సిట్టింగ్ జడ్జీని ఇవ్వలేమని హైకోర్టు చెప్పిన తరువాత కూడా గమ్మున ఉన్నారంటే మళ్లీ దానివెనక ఏదో మతలబు ఉంది. దానివలన వీళ్లిద్దరు కొల్యూడ్ అవుతున్నారని చెప్పడానికి ఇదొక ఆధారం చాలు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, దీనిని ఈరోజైనా సరే సిబిఐకి ఇవ్వండి. లేదంటే, match fixing లో భాగముని, మీ కంట్రోల్‌లో పెట్టుకొని వారిని బ్లాక్‌మెయిల్ చేసి మీరు ముందుకు సాగాలని ఆలోచిస్తున్నారని, ఖచ్చితంగా ఒక *mala fide* intention తో ముందుకు వెళ్తున్నారని, మీరిద్దరు కలసికట్టుగా ఆడుతున్న నాటకమని చెప్పి రుజువు అవుతుంది.

వారు ఈ రకంగా తప్పుడు సమాచారం ఇవ్వడమేంటీ అధ్యక్షా? ఒక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి గారు, ఒక మంత్రి హోదాలో శ్రీధర్‌బాబు గారు......

(Mike was cut. Member continued without mike: He is not Minister, I am not yielding…)

SRI YENNAM SRINIVAS REDDY:- This is the most appropriate thing Speaker Sir. Baseless allegations రూలింగ్ పార్టీ మీద చేస్తామంటే, ఖచ్చితంగా కౌంటర్ వస్తుంది. గౌరవ సభ్యులు ఇది అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, కేంద్రంలో ఫైనాన్స్ మినిస్ట్రీలో పని చేసిన అనుభవంతో నేను మాట్లాడుతున్నాను. కేంద్రం తలచుకుంటే, వేల కోట్ల రూపాయలు ఎక్కడ తిన్నారో, అప్పనంగా ఏ కాంట్రాక్టర్‌కు నిధులు పోయాయో, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల నుండి లోన్ తీసుకున్న తరువాత అవి దుర్వినియోగం అవుతున్నాయా? సద్వినియోగం అవుతున్నాయా? అని చూసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే ఎక్కువగా ఉంటుంది.

ఎందుకు Enforcement Directorate విభాగం ఎందుకు వీళ్ల మీదకు రాలేదు అధ్యక్షా? ఎందుకు Income Tax raids జరగలేదు? ఎన్నికలు జరిగినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నాయకులందరి మీద రెయిడ్స్ జరుగుతాయి. మొన్న జరిగిన ఎన్నికల్లో ముఖ్యమైన అభ్యర్థులు శ్రీనివాస్ రెడ్డి గారిమీద, ఇంకా చాలామంది మీద ఐటి దాడులు జరిగాయి. ఎవరు అనుమతి పత్రాలు ఇచ్చారు? ఎవరు concurrence ఇచ్చారు? ఎన్నికల ముందు దాడులు ఎందుకు జరిగాయో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరుతున్నాను. ఈరోజు వారికి మరియు తెలంగాణ సమాజానికి తెలియజేసేది ఏమిటంటే, కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగింది. అందులో 30శాతం మాత్రమే రాష్ట్ర ఖజానా. మిగతావన్నీ కూడా కార్పొరేషన్ల పేరుమీద వేలకోట్ల రూపాయలు అప్పుగా తీసుకువచ్చి దుర్వినియోగం చేస్తే .. ప్రధానమంత్రి గారు అంటే మాకు గౌరవం, ప్రతి ఒక్క రూపాయికి నేను జవాబుదారీగా ఉంటానని వారు అంటుంటారు. నల్లధనాన్ని తీసుకువస్తానని చెప్పారు. కళ్లముందే నల్లధనం గుట్టలు, గుట్టలుగా పేరుకొంటూ ఉంటే, నోరు మూసుకొని చేష్టలుడిగి చూస్తున్నారు. కానీ, ఇప్పుడే వచ్చిన ప్రభుత్వం నిజాయితీతో, మా మ్యానిఫెస్టోలో ఉన్న ప్రతి ఒక్క అంశాన్ని జ్యుడిషియల్ ఎంక్వైరీ వేస్తానన్న సాహసం ఈ ప్రపంచంలో గానీ, ఈ భారతదేశంలో గానీ ఏ ప్రభుత్వం వచ్చినా తొలి నాళ్లలో చేయదు. మేము చేసి చూపిస్తానంటే, వారికి ఏమి ఉలికిపాటు అని అడుగుతున్నాను. దొంగలు, దొంగలు కలసి ఊర్లు దోచుకుందామనా అధ్యక్షా వారి అభిప్రాయం.

అందుకే చాలా స్పష్టంగా, ఈ వేదికద్వారా గౌరవ సభ్యులు మహేశ్వర్ రెడ్డి గారిని అడుగుతున్నాను. వారు కూడా వారి బాధ్యత మరవ వద్దని, ప్రతిదాన్ని రాజకీయం చేయవద్దని తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రాన్ని కష్టపడి సంపాదించుకున్నాం, లక్షల కోట్లు దుర్వినియోగం జరుగుతూ ఉంటే బట్టకాల్చి మీద పడవేయవద్దని కోరుతున్నాను. గౌరవ శాసనసభ్యులుగా మీ బాధ్యత మీరు నిర్వర్తించాలని సభా వేదికగా కోరుకుంటున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, వారు ఎక్కడ పని చేశారో నాకైతే తెలియదు. ఒకవేళ నిజంగా ఆయనకు అన్నీ తెలిస్తే మాత్రం ఈరకంగా మాట్లాడటం సరి అయినది కాదు. ఎందుకంటే, ప్రభుత్వ రంగంలో రాష్ట్ర ప్రభుత్వంగా వారు కాన్సెంట్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం సిబిఐ ఎంక్వైరీ చేసే అధికారం లేదు. కాబట్టి, దానికోసం మేము పదే, పదే అడుగుతున్నాం. ముఖ్యమంత్రి గారిని ఒక లెటర్ ఇవ్వమనండి, లేదంటే ఇక్కడ తీర్మానం చేయండి 48 గంటల్లో సిబిఐ ఎంక్వైరీ చేపించే బాధ్యత మాది. సిబిఐ ఎంక్వైరీకి ఎందుకు భయపడుతున్నరో నాకు అర్థం కావడం లేదు. అందులో వాళ్ల పేర్లు ఏమైనా ఉన్నాయా? వారి మిత్రుల పేర్లు ఏమైనా ఉన్నాయా? ఊరికే పిల్లర్ల క్రాక్స్ చూసివస్తే ఏమి వస్తుంది? కడుపు నిండుతుందా? పిల్లర్లను చూసి వద్దాం, నీటిని చూసి వద్దాం, కాళేశ్వరం పోయివద్దాం అన్నారు. గత ప్రభుత్వం కూడా నీళ్లను చూసి వద్దామని ఒకసారి బస్సులు పెట్టారు. వీళ్లేమో పిల్లర్లను చూసి రావడానికి బస్సులు ఏర్పాటు చేశారు. దీనివల్ల కాదు అధ్యక్షా. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, వారిద్దరు ఒకటి కాదంటే, వారిద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం లేదంటే వారు ఈరోజైనా సిబిఐ ఎంక్వైరీకి సిద్ధం కావాలని, 48 గంటల్లో సిబిఐ ఎంక్వైరీ చేయించే బాధ్యత భారతీయ జనతా పార్టీ తీసుకుంటుందని తెలియజేస్తున్నాను.

గెలవడానికి ఇక్కడ సభ్యులు కానీ వ్యక్తి గురించి తమరి అనుమతితో మాట్లాడుతాను. ఈటల రాజేందర్‌గారిని ఆరోజు ఓడగొట్టడానికి కేవలం ఒక లక్ష్యంగా పెట్టుకుని దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారు తప్ప దళితుల మీద ప్రేమతో కాదన్న విషయాన్ని స్పష్టంగా తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను. నిజంగా ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో ఉన్న అన్ని దళిత కుటుంబాలకు దళితబంధును ఎందుకు అందజేయలేదు? దళితబంధు అనే పథకాన్ని మనం పత్రికలలో కూడా చూశాము. కేవలం ఆనాడు ఉన్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు వాళ్ల ఖర్చులకు జేబులు నింపుకునే నిధిగా మలిచి అది కొంత మందికి మాత్రమే ఆనాడు దళితబంధును ఇచ్చారు తప్ప, ఈ రాష్ట్రంలోని చాలా మంది దళితులకెవర్వికి దళితబంధును అందజేయలేదు. నేడు ఆరు గ్యారెంటీల గురించి వారు మాట్లాడుతున్నారు. గతంలో ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో అత్యధిక కాలం పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కానీ, ఎన్నికల మేనిఫెస్టోలో కానీ ఎక్కడ హామీ ఇచ్చినా ప్రతి హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలియజేస్తున్నాను. అందుకే తమరి ద్వారా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, వారి సభ్యులకు తెలియజేసేదేమంటే, 2014లో గానీ, 2018లో కానీ మేనిఫెస్టోలో మీరిచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు. ఒక్కసారి మీ మేనిఫెస్టోను చదువుకోవాలని వారిని కోరుతున్నాను.

3.30 సా. ఆనాడు ఎన్నికల ముందు కేజీ టు పీజీ విద్యను అందిస్తామని పేద విద్యార్థులు, గిరిజనులు, దళితులందరికీ కూడా అనేక ఆశలు కల్పించి, ఏ ఒక్కవర్గానికి అందకుండా కేజీ టు పీజీ విద్యనే ప్రవేశపెట్టనటువంటి ప్రభుత్వం కేసీఆర్ గారి టీఆర్ఎస్ పార్టీ అని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కాని ఇవ్వాళ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ఈరోజు రాష్ట్రంలో ఉన్న దళిత, గిరిజన, బలహీన వర్గాలు ఇంగ్లీషు చదువులకు దూరమైపోయి, ఎక్కడైనా కాంపిటీషన్ పరీక్ష పత్రం రాస్తే ఉద్యోగం రాని పరిస్థితుల్లో ఈనాడు ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క పబ్లిక్ స్కూల్‌ని ఏర్పాటు చేయబోతున్నామని ఇవ్వాళ ప్రకటించినందుకు ఈ రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరూ కూడా ఈ ప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్నారనే మాటను మీద్వారా తెలియజేసుకుంటున్నాను.

ఇంకొక విషయం అధ్యక్షా, వాస్తవంగా ఈ రాష్ట్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2014 వరకు నేను కూడ శాసన సభ్యుడిగా పెద్దలు శ్రీధర్‌బాబు గారితో ఉన్నాను. ఆనాడు ప్రభుత్వ పాఠశాలలు అన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలలో, గూడాలలో ఉన్న పిల్లలు చదువులకు దూరమైపోతున్నారని, అక్కడ ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేస్తే టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత.... ఏకఉపాధ్యాయ పాఠశాలలు అని ఉండేవి. ఆ పాఠశాలలన్నింటినీ కూడా ఎత్తివేసి గిరిజనులకు, దళితులకు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసింది టీఆర్ఎస్ ప్రభుత్వమని ఈ సందర్భంగా తమరికి తెలియజేస్తున్నాను. ఎందుకంటే, గిరిజనులు, దళితులు చదువుకొని పైకి రావడం టీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఇష్టం ఉండదు. అందుకే ఆనాడు ఆ పాఠశాలలన్నింటినీ కూడా ఎత్తివేసి, మా పిల్లలకు విద్యను అందకుండా చేసింది కేసీఆర్ గారి టీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకనే గౌరవ ముఖ్యమంత్రి గారు మొన్న ఒక ప్రకటన చేశారు. గిరిజన తండాలుగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలు, గిరిజన గూడాలుగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలు, దళిత వాడలలో ఉన్న పాఠశాలలన్నింటినీ కూడా మళ్లీ పునరుద్ధరించి మెగా డీఎస్సీ ద్వారా మళ్లీ పేద పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పింది రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమని చెప్పి మరొక్కసారి మీద్వారా ఈ సభకు తెలియజేసుకుంటున్నాను.

మీకు తెలుసు అధ్యక్షా, ఇంతకుముందు రైతు భరోసా అనే కార్యక్రమం గురించి చెబుతుంటే వారికి వినడం ఇష్టం లేక వెళ్లిపోయారు. రైతుబంధు ఎవరికి ఇచ్చారు? హరిజనులు, గిరిజనులు, బలహీన వర్గాలకు ఒక అర ఎకరమో, ఎకరమో, రెండెకరాలో ఉంటాయి. పది ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉండదు. కాని అర ఎకరమో, ఎకరమో, చిన్న, సన్నకారు

రైతులకు రైతుబంధు ఎంత వస్తుంది రూ.5,000/-లు తప్పితే రూ.10,000/-లు. కాని వీళ్లు రైతుబంధు ఎవరికి ఇచ్చారు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఇక్కడ ఉన్న మాజీ మంత్రి మల్లారెడ్డి గారికి, పల్లా రాజేశ్వర్ రెడ్డి గారికి, చంద్రశేఖర్ రావు గారికి. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి పొలాల చుట్టూ వందలాది ఎకరాలు ఉన్న భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ విధంగా వందల ఎకరాలతో ఫాంహౌజ్‌లు ఉన్న రైతాంగానికి మీరు రైతుబంధు ఇచ్చి లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్మును ధారాదత్తం చేసి ఒక మాఫియాలాగ తయారు చేయడం వల్ల ఈ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఏర్పడి, దివాలా తీయడానికి కారణం మీరే అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఎవరైతే పొలాల్లో పంటలు పండించుకొని వ్యవసాయం చేస్తున్న రైతులున్నారో వారందరికీ రైతు భరోసాను అందజేస్తామనే మాటను స్పష్టంగా ఈ సభద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారు తెలియజేశారు. ఇవ్వాళ రైతులను రెచ్చగొట్టే కార్యక్రమం చేస్తున్న టీఆర్ఎస్ పార్టీకి చెప్పేది మీరు రైతుబంధు కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరానికి రూ.10,000/-లు ఇస్తే, రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతాంగానికి, ప్రతి సంవత్సరం రూ.15,000/-లు రైతు భరోసా ఇచ్చే కార్యక్రమం చేయబోతుందనే విషయాన్ని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

మేము రైతులకు వ్యతిరేకం కాదు అధ్యక్షా. కాని ఇవ్వాళ కేసీఆర్ గారు, కేటీఆర్ గారు, హరీష్‌రావు గార్లు మాట్లాడుతున్న మాట వందల ఎకరాల భూములు ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేము రైతుబంధు ఇవ్వొద్దని అంటున్నాం. కాని పంటల మీద ఆధారపడే పేద, చిన్న, సన్నకారు రైతుల విషయంలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా లేదనే విషయాన్ని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఈనాడు గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా స్పష్టంగా మాట్లాడారు. నిజంగానే తెలంగాణ రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రశేఖర్ రావు గారు ఈ సభకు వచ్చి, ఈ సభ ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలలో ఏవైనా లోపాలు ఉంటే చెబుతూ.. నిన్ననే మా గౌరవ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి గారిని అడిగాను కాని ఎందుకో నాకు సమయం దొరకలేదు ఆరోజు. ఇరిగేషన్ శాఖ పట్ల నల్గొండ జిల్లాలో సభ పెట్టారు. ఇవ్వాళ దేనికి సభ పెట్టారు? తెలంగాణ రాష్ట్రంలో బాగా దగాపడ్డ జిల్లా నల్గొండ జిల్లా. అందులో మొదటి ప్రాంతం నా శాసనసభ నియోజకవర్గం అధ్యక్షా. గిరిజనులు అధికంగా ఉండి, కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు లేని ప్రాంతం దేవరకొండ ప్రాంతం. నల్గొండ జిల్లాలో నీటిని శాశ్వతంగా దూరం చేసే కార్యక్రమాన్ని అమలు చేసి, రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులను మీరు అప్పజెప్పి, కాంగ్రెస్ ప్రభుత్వం పైన నెట్టే అపనింద చేస్తున్నారు.

మా నియోజకవర్గంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్.. మా సోదరుడు అచ్చంపేట శాసన సభ్యులు ఇక్కడే ఉన్నారు. ఆ టన్నెల్‌ని ఆనాడు స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. దాదాపు 23 కిలోమీటర్లు పూర్తి చేసింది. వీళ్లు కేవలం 10 కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేదు. ఆరోజు వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తే ఆ తండాలు పూర్తయి ఇవ్వాళ నల్గొండ జిల్లాకు దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే కార్యక్రమం పూర్తి అయి ఉండేది. కాని ఎక్కడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పేరు వస్తుందేమోనని శాశ్వతంగా మాకు కరవు బారిన నిలబెట్టిన వ్యక్తి చంద్రశేఖర్‌రావు గారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈరోజు ఒక ఎకరానికి కూడా సాగునీరు అందని ప్రాంతాలు దేవరకొండ, అచ్చంపేట, మునుగోడు ప్రాంతాలని చెప్పి ఈ సభలో మాట్లాడటం వల్ల ఎంతో బాధ కలుగుతుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. టన్నెల్ పూర్తయి ఉంటే మాకు సాగు నీరు కొంతలో కొంతభాగమైనా వచ్చేది.

దానితోపాటు పాలమూరు-రంగారెడ్డి నుంచి మాకు నీటిని తీసుకువస్తామని అందులోనే సొంతంగా మరొక డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రవేశపెడుతున్నామని దానికి 8సార్లు

సర్వే చేశారు. 8 సార్లు సర్వేకు డబ్బులు ఖర్చు పెట్టారు తప్ప మీరు నార్లాపూర్ నుంచి నీళ్లు తీసుకొస్తారా, లేక ఏదుల నుంచి తీసుకొస్తరా ఎక్కడి నుంచి నీళ్లు తీసుకురావాలో ఇప్పటివరకు 10 సంవత్సరాలలో నిర్ణయం జరగలేదు. నిర్ణయం జరుగకపోగా మా దగ్గర రిజర్వాయర్లు కట్టారు. అసలు నీళ్లు ఎక్కడి నుంచి తేవాలో నిర్ణయం జరుగకముందు.. ఎవ్వరైన తెలివైన నాయకుడు గాని, తెలివైన పరిపాలనాదక్షుడు గాని.. నీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలో నిర్ణయం జరుగకముందే మాదగ్గర గొట్టిముక్కల, సింగరాజుపల్లి, మునుగోడులో చర్లపల్లి దగ్గర రిజర్వాయర్లు కట్టారు. రిజర్వాయర్లు కట్టారు తప్ప ఎక్కడి నుంచి నీళ్లు తీసుకురావాలి ఈ ప్రాజెక్టులకు ఎక్కడి నుంచి నీళ్లు ఇయ్యాలో నిర్ణయం చేయకుండా మా ప్రాంతాలను దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టింది కేసీఆర్ గారని ఈ సందర్భంగా తమరి ద్వారా ఈ సభకు తెలియ జేసుకుంటున్నాను.

3.40 సా. నల్గొండ జిల్లాలో సభ పెట్టే నైతిక హక్కు వారికి లేదు. ఎందుకంటే మా ప్రాంతాన్ని కరువు బారిన నెట్టింది మీ బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిగారు కూడా మొన్ననే సభలో ఇరిగేషన్‌పై మాట్లాడారు. నల్గొండ జిల్లాలో నా అనుభవంలో ఉన్నంత వరకు ఇప్పటి వరకు ఒక్కసాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. కనీసం ఉన్న ఉదయ సముద్రం దాదాపు 90శాతం పూర్తయింది. అది మరో పది శాతం పూర్తయి ఉంటే మాకు ఆ సాగునీటి ప్రాజెక్టు పూర్తయి ఉండేది. ఒక పది శాతం నక్కలగండి, పెల్లిపాకాల పూర్తి చేయనటువంటి పరిస్థితి ఉన్నది. అంటే వారు కేవలం ప్రజలను మభ్యపెట్టారు తప్ప ఎక్కడ కూడా ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రారంభించిన ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. నల్గొండ జిల్లా ప్రజలు బీఆర్ఎస్ నాయకులకు తగినంత బుద్ధి చెప్పారు. మా ఉమ్మడి జిల్లాల్లో 12సీట్లుంటే, ఒక్కొక్క సభ్యులను సుమారు 50వేలు, 60వేలు, 70వేల మెజారిటీతో మా నల్గొండ జిల్లా ప్రజలు మమ్మల్ని గెలిపించి బీఆర్ఎస్ పార్టీ వారికి తగినంత బుద్ధి చెప్పారు. నల్గొండ జిల్లాలో సభ పెట్టే నైతిక హక్కు కేసీఆర్‌గారికి లేదు. నిజంగా నల్గొండ జిల్లాకు ముఖ్యంగా నా దేవరకొండ ప్రాంతానికి నువ్వు తలవంచుకొని క్షమాపణ చెప్పాలని నేను కేసీఆర్‌గారిని డిమాండ్ చేస్తున్నాను. నిజంగా రాజకీయాలలో చదువుకున్నవాడిగా నాకు కూడా ఒక్కొక్కసారి సిగ్గు అనిపిస్తున్నది. పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన ఒక వ్యక్తి..... చెప్పులతో కొట్టండి మీకు చెప్పులున్నాయని కదా రైతులను ముఖ్యమంత్రిగారి మీద రెచ్చగొట్టిన మాటలు మాట్లాడారు. చెప్పులతో వారు కాదు నల్గొండ జిల్లా ప్రజలు.. నిన్న మా కోమటిరెడ్డి వెంకట రెడ్డి గారు చెబితే అదేదో నేరమైనట్లు ప్రతిపక్షం నుంచి మాట్లాడారు. చెప్పులతో మమ్ములను కాదు కొట్టేది మిమ్ములను నల్గొండ జిల్లా ప్రజలంతా చెప్పులతో కొట్టినట్లుగా మొన్ననే ఓడించారు. నల్గొండ జిల్లాలో వారు మాట్లాడిన ప్రతి మాటకు నల్గొండ జిల్లా ప్రజానీకానికి, తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి క్షమాపణ చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్‌పైన ఉన్నదని మరొక్కసారి తమరి ద్వారా తెలియజేస్తున్నాను. బీఆర్ఎస్‌పార్టీ వారిని మొత్తం ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారు. బీఆర్ఎస్‌పార్టీ నాయకుడికి నిజంగానే సభకు రావడానికి చేతకాదు. వారు పడిపోయారంటే మాకు బాధ అనిపించింది. ఒక దశలో ఇంత పెద్ద మనిషి పడిపోయాడు ఇక లేస్తాడో లేడో అనుకున్నాము. కానీ నిన్నటివరకు ఆసుపత్రిలో ఉండి నిన్న నల్గొండ జిల్లాకు మాత్రం బ్రహ్మాండంగా కర్రలు పట్టుకొని స్టేజ్ ఎక్కి మీకోసం నేను కర్రలు పట్టుకొని వచ్చానని సానుభూతి తెలిపే ప్రయత్నం చేసినా నల్గొండ ప్రజలు ఎప్పుడూ కేసీఆర్ నిన్ను నమ్మరు. నువ్వు నల్గొండ జిల్లాకు చేసిన ద్రోహం నల్గొండ జిల్లా ప్రజలు ముఖ్యంగా దేవరకొండ, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు నిన్ను జీవితంలో కూడా క్షమించరన్న విషయాన్ని మరొక్కసారి సభకు తెలియజేస్తున్నాను.

నేడు ఇందిరమ్మ గురించి వాళ్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలసీ తమరికి తెలియంది కాదు. మా గౌరవ మంత్రిగారు సభలో ఉన్నారు. ఆనాడు 2004 నుంచి 2014వరకు ఇందిరమ్మ ఇండ్లు అంటూ ఇచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా ఇండ్లు ఇచ్చారు. తమరు కూడా గతంలో శాసనసభ్యులుగా ఉన్నారు. ఆరోజు ఎమ్మెల్యే

కోటా అని సుమారు 500 నుంచి 1000ఇండ్లు ఇచ్చేవారు. కానీ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లు అనే స్కీమ్ ద్వారా ఎవరైతే పేదవారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కులంతో, మతంతో,జాతితో సంబంధం లేకుండా ఆనాడు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసిన ఘనత ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానిది. పది సంవత్సరాలు బీఆర్ఎస్పార్టీ అధికారంలో ఉన్న తర్వాత ఏ ఒక్క నియోజకవర్గంలో గ్రామానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టివ్వలేదు. ఆనాడు ఎన్నికల సభలో వారు చెప్పారు. సామెతలు నాకు పెద్దగా రావు. ముఖ్యమంత్రిగారు అయితే బ్రహ్మాండంగా చెబుతారు. ఆనాడు వారు ఏమి చెప్పారు. ఈ ఇందిరమ్మ ఇండ్లు అగ్గిపెట్టె ఇండ్లు, మీ బిడ్డ వస్తే ఏడ పండుకుంటుంది, మీ అల్లుడు ఏడ పండుకుంటాడు, నీ కొడుకు, కోడలు ఏడ పడుకుంటారు, మీరు ఎక్కడ పడుకుంటారు, నీ కోడిపెట్టను ఎందులో దాచిపెడతావు, మీ మేకపిల్లను ఏడ కట్టేస్తావు, ఏంది ఈ డబ్బా ఇండ్లని ఆరోజు కేసీఆర్గారు మాట్లాడారు. కేసీఆర్గారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తానని చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత .. నేను మొత్తం రాష్ట్రమంతా తిరగలేదు కానీ నా నియోజకవర్గంలో చూస్తే నాకు తెలిసినంతవరకు మొత్తం నియోజకవర్గంలో ఒక్క దేవరకొండ పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతంలో మొత్తం కలిసి ఐదు వందల నుంచి ఏడు వందల ఇండ్లు ఆ పట్టణంలో కట్టారు తప్ప ఒక్క గ్రామంలో కూడా ఒక్క ఇల్లు కట్టనటువంటి పరిస్థితి ఉన్నది. ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి మాట్లాడే నైతిక హక్కు టిఆర్ఎస్ పార్టీ వారికి లేదని తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఒక మాట ఇచ్చింది. మా ప్రభుత్వం వస్తే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మాట ఇచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బడ్జెట్లో పెట్టారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 3500 ఇండ్లు నిర్మాణం చేయడం కోసం రూ.7740 కోట్లు ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో కేటాయించడం అనేది గౌరవ ముఖ్యమంత్రిగారికి,మా మంత్రులకి తెలంగాణ ప్రజల తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎస్సీ,ఎస్టీల గురించి కడియం శ్రీహరి గారు సభలో ఉంటే బాగుండేది. నేను అక్కడ వారిని చూస్తే సంతోషపడుతాను. ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే నైతిక హక్కు వాళ్లకు లేదు. ఇంతకు ముందే దళిత బంధు గురించి చెప్పాను. ఉపఎన్నికలు వస్తే చాలు కేసీఆర్గారికి, గిరిజనులు, దళితులు వెంటనే జ్ఞాపకం వస్తారు. గిరిజనులకు సంబంధించి ఏమి చెప్పారు. ఇక్కడున్న రాజగోపాల్రెడ్డిగారు బిజెపి నుంచి పోటీ చేసి అక్కడున్న టిఆర్ఎస్ వారు టిఆర్ఎస్ నుంచి ఆనాడు పోటీచేస్తే వీరిని ఓడగొట్టడానికి ఏమి చెప్పారంటే, అక్కడ గిరిజనులకు సుమారు ముప్పైవేల ఓట్లు ఉంటాయి. మీకు దళిత బంధుతోపాటు మీకు కూడా గిరిజన బంధు ఇస్తామని చెప్పారు. మా వాళ్లందరికి భ్రమలు కల్పించారు తప్ప ఒక్కరికి కూడా గిరిజన బంధు ఇవ్వలేదు. ఆనాడు దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూపంపిణీ చేస్తామని కేసీఆర్గారు మాటిచ్చారు. ఎన్నికల మేనిఫేస్టోలో పెట్టారు. వాళ్లు ఎన్నికల మేనిఫేస్టో కూడా ఇక్కడే ఉన్నది. కానీ ఏ ఒక్క దళిత, గిరిజనులకు, దళితబంధు ఇవ్వలేదు. నా నియోజకవర్గంలో ఒక గ్రామంలో సుమారు ఐదు ఎకరాలో, ఆరు ఎకరాలో తీసుకున్నారు. దాని తర్వాత ఒక్క నియోజకవర్గంలో కూడా నాకు తెలిసి గిరిజనులకు కానీ, దళితులకు కానీ మూడెకరాల భూపంపిణీ జరగలేదు. అది కేసీఆర్ మాటకు ఉన్న విలువ. కడియం శ్రీహరిగారు గతంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆరోజు కడియం శ్రీహరిగారు మా దళితులకు ద్రోహం చేస్తున్నావు, మాటిచ్చావు ఎందుకు మాట తప్పుతున్నావు, గిరిజనులకు, దళితులకు దళితబంధు, మూడెకరాలు ఎందుకు పంపిణీ చేయలేదని ఎందుకు కేసీఆర్గారిని అడగలేదు.

ఇవాళ ఆయనకు ఇందిరమ్మ ఇండ్ల గురించి, అదేవిధంగా దళిత, గిరిజనుల గురించి జ్ఞాపకం వచ్చిందా అని అడుగుతున్నాను. ఈ సభలో చాలా మంది నా కంటే సీనియర్లు ఉన్నారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నేను చదువుకున్న రోజుల నుంచి ఈ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా అంబేద్కర్ జయంతికి, గాంధీ జయంతికి దండ వేయని ముఖ్యమంత్రిని నా జీవితంలో ఇప్పటి వరకు నేను చూడలేదు. ఇక పెద్దలు ఎవరైనా చూశారేమో నాకు తెలియదు. ఈ రాష్ట్రంలో అంబేద్కర్గారి విగ్రహానికి కానీ, జాతిపిత

మహాత్మాగాంధీ పుట్టిన రోజుకు, వర్ధంతికి కానీ ఆనాడు దండ వేయని ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే కేవలం చంద్రశేఖర్‌రావుగారే అని చెప్పవచ్చు. చిన్న బొమ్మ పెట్టి ఆయన ఇంట్లో అయితే చేసుకుంటారు. క్యాంపు ఆఫీసు నుంచి అంబేద్కర్ విగ్రహం ఎంత దూరముంటుంది. ట్యాంక్ బండ్ దగ్గరలోనే ఉంటుంది. అంటే అంబేద్కర్‌గారిని వారు గౌరవించే విధానం గురించి ఆనాడు ఎందుకు కడియ శ్రీహరిగారు అడగలేదు. ఇవాళ వారు గొప్పగా మేము అంబేద్కర్ విగ్రహాన్ని గొప్పగా పెట్టామని చెబుతున్నారు. వారికి మనసులో ప్రేమ ఉండాలి. విగ్రహాన్ని పెట్టింది కేవలం ఎన్నికల కంటే ముందు దళితుల ఓట్లు దండుకోవడానికి తప్ప అంబేద్కర్‌గారి మీద ప్రేమతో కానీ, మా దళితుల మీద ప్రేమతో కాదు. అందుకే నేడు ఇంత మంది సీనియర్లు మాట్లాడినప్పుడు నాకు చాలా బాధ అనిపించింది. శ్రీహరి గారు అంటే మాలాంటి వారందరికి చదువుకున్న వ్యక్తిగా గౌరవం ఉండేది.

3.50 సా. దళితులు, గిరిజనుల కొరకు 2023-24బడ్జెటులో రూ.17,000 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎస్సీ, ఎస్టీ సంబంధించిన సబ్-ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు పెట్టడంలేదని భట్టి విక్రమార్క గారి నాయకత్వంలో మేమంతా శాసన సభ్యులుగా ఉన్నాము, పెద్దలు దామోదర రాజనర్సింహ గారు ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధులను భట్టి విక్రమార్క గారు మేమంతా కలిసి ఆనాటి ముఖ్యమంత్రి గారి దగ్గరకు వెళ్లి దళితులు, గిరిజనుల కొరకు కేటాయించిన సబ్-ప్లాన్ నిధులను తప్పకుండా ఖర్చు పెట్టాలని, ఒక వేళ ఆ నిధులను ఖర్చు పెట్టలేకపోతే ఫార్వర్డ్ చేసి వచ్చే బడ్జెటులో కేటాయించాలని చట్టాన్ని తీసుకువచ్చి సోనియా గాంధీ గారు ఢిల్లీ నుంచి ఆదేశించారు, ఇక్కడ అమలు చేసి ఒక చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిది. కానీ, ఆ సబ్-ప్లాన్ నిధులు ఎటు పోయాయో తెలియదు, సబ్-ప్లాన్ నిధులను దేనికి వినియోగించారో కూడా తెలియదు. ఎస్సీ, ఎస్టీ, గిరిజనుల పట్ల బీఆర్ఎస్ నాయకులకు నైతిక హక్కులేదని ఈ సందర్భంగా మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

మా సోదరుడు మహేశ్వర్ రెడ్డి గతంలో మాతోపాటు ఎమ్మెల్యే ఉండే, ఇప్పుడు కూడా ఉన్నారు. ఆయన మాట్లాడితే బాధ అనిపించింది. నిజంగా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కట్టి... ప్రాంతం ఏదైనా నేను బాధపడడంలేదు, ఏ ప్రాంతంలోని ప్రజలైనా తెలంగాణ ప్రజలే, లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రాజెక్టు కట్టి ఆ ప్రాంతం రైతాంగానికి సాగునీరు ఇవ్వలేక పోయారు. కనీసం కట్టిన ప్రాజెక్టులోనైనా నిర్మాణలోపాలు లేకుండా ఉంటే, ఆ ప్రాంతానికి శాశ్వతంగా సాగునీరు అందించి ఉంటే, ఆ ప్రాంతం ప్రజలైనా బాగుపడ్డారని మేము సంతోషించే వారిమి. గోదావరి ఆయకట్టు కింద ఉన్న రైతులు బాగుపడి ఉంటే, ఆ రైతులకు అయినా సాగునీరు అందిందని సంతోషించే వారిమి. కానీ, ఇవ్వాళ ఆ ప్రాజెక్టు నిట్టనిలువునా కూలిపోయే దశలో, నిన్న మనందరం చూశాము. మాజీ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ నిస్సిగ్గుగా, నిజంగా నాకు బాధ అనిపించింది, వారి వయస్సును గౌరవించాలి కాబట్టి వేరే భాష మాట్లాడడంలేదు. ప్రాజెక్టు కూలిపోతే మూడో, నాలుగో పిల్లర్లు కూలిపోయాయి రిపేర్లు చేసుకోవచ్చు కదా అని అంటున్నారు. ఎక్కడైనా ప్రపంచంలో ఒక నాయకుడు నిజంగా తప్పిదాలు జరిగితే దాన్ని ఎట్లా రెక్టిఫై చేసుకోవాలి, గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా సందర్భాలలో అడిగారు. మీరు ఏమైనా సలహాలు ఉంటే ఇవ్వండి మీరు ప్రాజెక్టులను వదిలిపెడితే రేపు ఆ ప్రాజెక్టులు కొట్టుకొని పోతే ఎవరి మీద ఆ నెపాన్ని నెట్టాలని చూస్తున్నారు, ముఖ్యమంత్రి మీద, కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టాలని చూశారు.

అక్కడ ప్రాజెక్టులు కూలిపోయేటట్లు కట్టారు, దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మంలో ఉన్న ప్రాజెక్టులకు ఒక్కపైసా ఖర్చు పెట్టకుండా గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల దక్షిణ తెలంగాణ, నల్లగొండ, దేవరకొండ ప్రాంతాలు కరువు బారినపడి శాశ్వతంగా కరువును ఎదుర్కొనే పరిస్థితి. సభలో నేను బడ్జెటు గురించి మాత్రమే మాట్లాడుతున్నాను.

మిషన్ భగీరథ ద్వారా ఎంత నీళ్లు ఇస్తామని చెప్పి రూ.40,000 కోట్లు ఖర్చు పెట్టి మా నియోజకవర్గంలోని ఒక్క తండాకు అయినా తాగు నీరు వచ్చి ఉంటే... వస్తాయి పది రోజులకో, పదిహేను రోజులకో ఒకసారి వస్తాయి. ఆ రకంగా డబ్బులను వృధా చేసి ప్రాజెక్టును కట్టకుండా కనీసం తాగు నీరు అందించే పరిస్థితి లేదు. గౌరవ ముఖ్యమంత్రి గారికి, ఇరిగేషన్ శాఖ మంత్రి గారు లేనప్పటికీ శ్రీధర్ బాబు గారు సభలో ఉన్నారు వారి ద్వారా మా ప్రాంతంలో ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నల్, దిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రాబోయే రోజుల్లో మా ప్రాంతాన్ని కరువు బారినుండి కాపాడాలని మీ ద్వారా ఈ సభ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి, ఇరిగేషన్ శాఖ మంత్రి గారికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. మాది కరువు ప్రాంతం రాబోయే రోజుల్లో కనీసం మంచి నీరు కూడా దొరకని హీన పరిస్థితులు వస్తాయి, కాబట్టి దయచేసి ఒక ఆలోచన చేసి మంచి మనస్సుతో ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ఉప ముఖ్యమంత్రి గారు గతంలో పాదయాత్ర చేస్తూ మా నియోజకవర్గంలోని నక్కలగండికి, మా వంశీకృష్ణ అన్నగారి నియోజకవర్గానికి, దిండి ఎత్తిపోతల ప్రాజెక్టును తిరిగి చూసి ఆ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని హామి ఇచ్చారు. రాబోయే రోజుల్లో తప్పకుండా ఆ ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సభ ద్వారా వారిని కోరుతున్నాను. ఇంకా చాలా విషయాలు ఉన్నాయి.

చాలా వరకు రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఆడపిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఆ ఇబ్బందులు తొలగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా భవన నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని చెప్పినందుకు ముఖ్యమంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. గతంలో ఆర్టీసీకి నేను గౌరవ అధ్యక్షుడిగా ఉన్నాను, ఆర్టీసీని దివాళా తీయించారు, గతంలో ఆర్టీసి సిబ్బంది 40 రోజులు సమ్మె చేశారు, వారితోపాటు మా కమ్యూనిస్టు సోదరులు కూడా ఉన్నారు, ఆ పరిస్థితులలో దాదాపుగా 20 మంది సిబ్బంది చనిపోయారు. ఆర్టీసీని దివాళీ తీయించి, ఆర్టీసి సిబ్బంది భవిష్యత్తు లేకుండా చేసిన ఘనుడు ఎవరైనా ఉన్నారంటే అది కేసీఆర్. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చి, ఇవ్వాళ ఫాంహౌజ్‌లో దుప్పటి వేసారు, ప్రజలు ఇంటికి వెళ్లిపోయారు.

ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి, రూ.300 కోట్లు ఓటాన్ అకౌంట్ బడ్జెటులో కేటాయించిందంటే ఆర్టీసిని అన్ని విధాలుగా ఆదుకోవాలనే ప్రయత్నంలో ఈ ప్రభుత్వం ఉందని మరొకసారి మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఆఖరుగా... గిరిజనులకు సంబంధించి మా ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ గత ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా కార్యక్రమాలను చేస్తానని చెప్పి, బడ్జెటులో నిధులు కేటాయించారు, కానీ నిధులను విడుదల చేయలేదు. అటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితుల్లో గిరిజనులను, లంబాడీలను చూశాము. సేవాలాల్ జయంతి 15వ తారీఖునాడే ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆప్షనల్ హాలిడేగా ప్రకటించిన ముఖ్యమంత్రి గారికి, ఈ ప్రభుత్వానికి ప్రతి లంబాడీ సోదరుడి తరుపున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇవ్వాళ జీ.ఓ విడుదల చేశాము, ఆ కార్యక్రమాలకు కావాల్సిన కోటి రూపాయలను కూడా విడుదల చేశాము. ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తూ, ఆప్షనల్ హాలిడే ఇచ్చినందుకు ముఖ్యమంత్రి గారికి తెలంగాణ రాష్ట్రంలోని లంబాడీ జాతి తరపున వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

4.00 సా. **శ్రీ కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం)**:- అధ్యక్షా, సభాపతిగా మీరు ఉన్నారు, మాట్లాడటానికి నేనున్నాను. ప్రభుత్వం తరపున కూడా సభ్యులు సభలో ఉన్నారు. అలాగే శ్రీధర్‌బాబు గారికి తప్పనిసరి పరిస్థితులలో రెప్రజెంటేటివ్‌గా ఆయనున్నారు. ప్రధాన ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేస్తున్నామని వెళ్లారా లేదంటే స్వచ్ఛందంగా వెళ్లారా అనేది నాకైతే తెలియదు. ఇవ్వాళ సబ్జెక్టు బడ్జెట్‌కు సంబంధించింది కాబట్టి ఇది చాలా ముఖ్యమైన సమావేశంగా నేను భావిస్తున్నాను.

గౌరవ సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ గారు ఇప్పుడు సభలో లేరు గాని నేను మనస్ఫూర్తిగా వారిని అభినందిస్తున్నాను. ఎందుకంటే ఈ ప్రభుత్వం ఎంత గొప్పగా చేస్తున్నదో అంతకంటే ఎక్కువగా ఎక్సర్‌సైజ్ చేసి అనేక అంశాల గురించి "స్కై టు బాటమ్" అంటే పైనుంచి కింద వరకు ఏదీ వదలకుండా మాట్లాడారు. I am very much impressed. ఆరు గ్యారంటీలకు సంబంధించి దానిపైన ఒక వైట్ పేపరు ఉంటే మంచిదని కూడా చెప్పారు. నేను కూడా దానితో ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే వైట్ పేపరు ఉంటే ఎవరి అభిప్రాయాలు వారు చెబుతారు, దానిని బట్టి ప్రభుత్వానికి కూడా దానిని ఎలా ఫేస్ చెయ్యాలి, ఆ హామీలను ఎలా నెరవేర్చాలి అనే అంశంపైన ప్రభుత్వానికి కూడా సులభతరమవుతుంది. కాబట్టి అటువంటి సలహాలు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన అవసరమున్నది.

నేను ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకులను కోరేదేమంటే.. ఇంకొక సంవత్సరం పాటు ప్రధాన ప్రతిపక్షానికి ఈ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని వారికి తెలియజేస్తున్నాను. ఒక సంవత్సరం ఎట్టి పరిస్థితులలో వాళ్లు మాట్లాడకూడదు. ప్రజలు అమాయకులేం కాదు. ప్రజలు శాసనసభలో జరిగే చర్చలను చూస్తుంటారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి కేవలం రెండు నెలల ఏడు రోజులయింది. రెండు నెలల ఏడు రోజులైన తరువాత ఈ ప్రభుత్వం ఏం చేయాలి, బడ్జెట్ శాసనసభలో పెట్టాలా వద్దా? ఒకవేళ బడ్జెట్ పెట్టకపోతే రాష్ట్రం ముందుకు వెళుతుందా, జీతభత్యాలు ఉంటాయా, పనులు జరుగుతాయా లేదంటే బడ్జెట్ పెట్టి మా దగ్గర ఏం లేదని చెప్పాలా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయాలి? కొత్త ప్రభుత్వంగా వచ్చినప్పుడు ఆ ప్రభుత్వం మీద బాధ్యత ఉన్నదా లేదా అని అడుగుతున్నాను. గత ప్రభుత్వమేమో అప్పులు చేసి ఆ అప్పుల నుంచి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా బయటపడుతుందో చూద్దామన్నట్లుగా చేయడమంటే ఇదా వారు చేసే సలహా? గత ప్రభుత్వమేమో వ్యవస్థలను విధ్వంసం చేస్తుంది, దీనిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా బాగు చేస్తుందో మేం చూస్తామనే విధంగా చేయడం ఇదేం పద్ధతని అడుగుతున్నాను. ఇది న్యాయం కాదు. ప్రజలు అమాయకులేం కాదు, అన్ని విషయాలను గమనిస్తుంటారు. నేను ఇవ్వాళ ఆదుర్దా పడి అసహనంతో ఎక్కువెక్కువ మాట్లాడినా, ఎక్కువెక్కువ శాపనార్థాలు పెట్టినా ప్రజలు గమనిస్తారు. శాపనార్థాలు పెడితే మన ఒంటికి మంచిది కాదు, మనకు మంచిది కాదు, సమాజానికి మంచిది కాదు. సదుద్దేశం లేని వారు ఎవరైనా శాపనార్థాలు పెడితే ప్రజలు మరలా మంచి తీర్పు ఇస్తారు. అందువల్ల ప్రజలను గమనంలో పెట్టుకోవాలి. గత ప్రభుత్వం ఇష్టమొచ్చిన పద్ధతుల్లో అప్పులు చేసి ఆ అప్పులను ఎలా తీరుస్తారనే రీతిలో వ్యవహరిస్తే కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలి కదా అని చేశారు. గత ప్రభుత్వంలో 2 లక్షల 90 వేల కోట్ల రూపాయలను 2023-24 బడ్జెట్‌లో పెట్టారు. సహజంగా కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏం చేస్తుందంటే గత ప్రభుత్వానికంటే మేం ఇంకా ఎక్కువ బడ్జెట్ పెట్టాం, వారికంటే ఎక్కువ నిధులు మేం సమకూరుస్తున్నామని పెంచాలి కానీ ఈ ప్రభుత్వం వాస్తవిక బడ్జెట్‌ను పెట్టినట్లుగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే 2లక్షల 75వేల కోట్ల రూపాయలకు పరిమితం చేసుకున్నారు, పరిమితం చేసుకోవడమంటే అర్థం వాస్తవికతను ప్రాతిపదిక చేసుకొని దానిని డెవలప్ చేసుకోవాలనే ఉద్దేశంతో బడ్జెట్‌ను పెట్టినట్లుగా నేను భావిస్తున్నాను.

రెండవది, నిన్న మేమందరం కలిసి మేడిగడ్డ సందర్శనకు వెళ్లాము. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నదని చూసి రావడం నేరమా? అక్కడికి వెళ్లామని ప్రభుత్వాన్ని తిడుతున్నారు, వాళ్లతోబాటు వెళ్లిన వారందరిని కూడా తిడుతున్నారు. అందులో అన్‌పార్లమెంటరీ పదాలు పెద్ద స్థాయిలో ఉన్నవాళ్లు మాట్లాడటం గౌరవప్రదం కాదు. వారికి మంచిది కాదు, మాకు మంచిది కాదు, మన తెలంగాణ సమాజానికి, రాష్ట్రానికి అంతకంటే మంచిది కాదు. ఇంతకంటే నేను ఎక్కువ చెప్పలేను. గౌరవసభ్యులు కడియం శ్రీహరి గారు మంచిగానే చెప్పారు. దానిని కంటిన్యూ చేస్తారా లేదంటే ఏ పద్ధతుల్లో చేస్తారు, వారు మేడిగడ్డలో రెండు, మూడు పిల్లర్లు కుంగిపోయాయనే దాని గురించి చెప్పారు. ఏదున్నా ఆ మేడిగడ్డ నుంచే నీళ్లు

వెళ్లాల్సింది కాబట్టి ఆ మేడిగడ్డ పిల్లర్లను బాగు చేయకుండా నీళ్లు వెళ్లవు. మేడిగడ్డలో వాడిన టెక్నాలజీనే ఇతర బ్యారేజిలలో కూడా వాడటం జరిగిందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇసుక ప్రాబ్లమ్ అని వాళ్లు చెబుతున్నందున దానిని అధ్యయం చేసి ఆ పద్ధతుల్లో చేయకుండా మేడిగడ్డ లేకుండా కాళేశ్వరం లేదు. ఇవ్వాళ మేడిగడ్డకే ప్రమాదం వచ్చిందని నిన్న వెళ్లాను. వాస్తవానికి నిన్న నేను మేడిగడ్డకు వెళ్లకుండా ఇతర పని మీద వెళదామని అనుకున్నాను కానీ ఎందుకో కొంత మంది వెళ్లొద్దని అంటుంటే నన్ను కూడా ఆ ఖాతాలో వేస్తారేమోనని చెప్పి నేను వెళ్లడం మంచిదైంది. మేడిగడ్డకి వెళ్లడం వలన చాలా విషయాలు కూడా తెలిశాయి. అక్కడి పరిస్థితులను నేరుగా చూశాము. ఇవ్వాళ ప్రధాన ప్రతిపక్షానికి ఏమైనా మంచి ఆలోచన ఉంటే వారు ఏం చేయాలంటే కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, సిపిఐ పార్టీ మాట్లాడిందని ఆ పద్ధతులు అవసరం లేదు. నిన్న అక్కడికి వందల మంది పాత్రికేయులు వచ్చారు. వాళ్లను ప్రైవేట్ టాక్‌గా మాట్లాడమని చెబితే ఉన్న వాస్తవమేంటో వాళ్లే చెబుతారు. దాని గురించి బుకాయించడం లేదంటే ఇంకొక పద్ధతుల్లో మాట్లాడటం కరెక్టు కాదు.

గత ప్రభుత్వం అప్పులు ఎందుకు చేసిందని అడిగితే ఆస్తులు పెరిగాయని చెబుతారు. ఏం ఆస్తులు వారు కూడగట్టారని నేను అడుగుతున్నాను. కాళేశ్వరం లాంటి ఆస్తులు కూడగట్టారా, కాళేశ్వరం లాంటి ఆస్తులు వ్యక్తిగతమా, సమాజపరమా లేదంటే రాష్ట్రానికి ఉపయోగమా అని అడుగుతున్నాను. మొత్తం పేద ప్రజలు కట్టిన శిస్తులన్నీ, లేదంటే మన పేరుతో చేసిన అప్పులన్నీ తీసుకెళ్లి కాళేశ్వరం మీద పెడితే ఎలా? కాళేశ్వరంలో జరిగిన పగుళ్లు అవి కాళేశ్వరం ప్రాజెక్టు పగుళ్లు కాదు, తెలంగాణ ప్రజల గుండె పగుళ్లు అని నిన్న నేను చెప్పాను. ఇది వాస్తవం అయినప్పుడు దానిని మేం చూసి రావద్దా? ఈ ప్రధాన ప్రతిపక్ష సభ్యులకు మంచి ఆలోచన ఉంటే ప్రాజెక్టుకు డ్యామేజీ జరిగింది కాబట్టి విచారణ చేసి తప్పు ఎవరిదైతే వారిపైన చర్యలు తీసుకోండి, కానీ ఆ ప్రాజెక్టు వృథా కాకుండా ఆ ప్రాజెక్టును వాడుకలోకి తీసుకురాండని సలహా ఇవ్వాలి. కానీ ఈ ప్రధాన ప్రతిపక్షానికి అలాంటి ఆలోచనే లేదు.

అదే విధంగా బడ్జెట్‌కు సంబంధించి లాజికల్‌గా ఆలోచించినప్పుడు ఈ ప్రభుత్వం ఏం చేయాలి, ఎలా చేయాలి, ముందుకు ఎలా వెళ్లాలి అనేదానిపైన సలహాలివ్వకుండా నువ్వు ఎప్పుడు చస్తావు, నిన్న నువ్వు గెలిచావు కాబట్టి నువ్వు తొందరగా చావాలి, నువ్వు చస్తే ఆ కుర్చీలో మేం కూర్చోవాలి అనే ఆలోచనలు చేయకూడదనేది నా అభిప్రాయం. గౌరవ సభ్యులు కడియం శ్రీహరి గారు పేరామీటర్స్ గురించి మాట్లాడుతూ తెలంగాణ గడచిన పది సంవత్సరాలలో ఎలా ముందున్నదనే దానికి సంబంధించి చాలా అంశాలు చెప్పారు. అదే పద్ధతులో నేనొక మాట చెబుతాను. నీతి ఆయోగ్ తీసిన ఒక రిపోర్టు ప్రకారంగా జాతీయ బహుముఖ పేదరికంలో 18వ స్థానంలో మన తెలంగాణ రాష్ట్రం ఉన్నది. పౌష్టికాహార లోపం, పోషణ లోపానికి సంబంధించి మన తెలంగాణ రాష్ట్రం 31వ స్థానంలో ఉన్నది. సెంటు గుంట ఆస్తి కూడా లేనటువంటి వాళ్లు 12.79 శాతంలో ఉన్నారు. పాఠశాల విద్యలో 23వ స్థానంలో మన తెలంగాణ రాష్ట్రం ఉన్నది. నేర్చుకునే విధానంలో 12వ స్థానంలో మన తెలంగాణ రాష్ట్రం ఉన్నది. యాక్సెస్‌కు సంబంధించి 19వ స్థానంలో ఉన్నాం, మౌలిక వసతుల కల్పనలో 21వ స్థానంలో ఉన్నాం, ఈక్విటీలో 26వ స్థానంలో ఉన్నాం, గవర్నెన్స్ ప్రాసెస్‌లో 26వ స్థానంలో ఉన్నాం, ఒక్క హెల్త్ మరియు పర్ క్యాపిటా రెండు మాత్రం 6వ స్థానంలో ఉన్నాం, వీటన్నింటి గురించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని అడుగుతున్నాను. గడచిన పది సంవత్సరాలలో చాలా అద్భుతాలు చేశామని చెప్పారు. అసలు పేదరికంలోనే మన రాష్ట్రం 18వ స్థానంలో ఉన్నది. పర్ క్యాపిటా 6వ స్థానంలో ఉన్నది. పర్ క్యాపిటా ఉన్నప్పుడు ఈ పేదరికాన్ని ఎందుకు తగ్గించలేదని అడుగుతున్నాను. పర్ క్యాపిటా లెక్కల గురించి మనందరికీ తెలుసు. జిఎస్‌డిపి గురించి మనందరికీ తెలుసు. ఇవన్నీ పేదవాడి రూపాయి పెద్దవాడి లక్ష అన్నీ కలిపి లెక్కలేసేవి. ఆ లెక్కల్లో కొద్ది మంది డబ్బులే ......ఇప్పుడు పర్ క్యాపిటాలో నాకు వెయ్యి

రూపాయలు ఆదాయం వస్తుంది, ఇంకొకరికి లక్ష రూపాయల ఆదాయం వస్తుంది. ఈ రెండింటిని కలిపి లెక్కలేసి యావరేజ్ తీస్తే అది ఎవరికి ఉపయోగమని అడుగుతున్నాను. కేవలం లెక్కలుగా చూస్తే అది ఆరోగ్యదాయకంగా అనిపిస్తుంది గాని ప్రాక్టికల్‌గా పేదవాడికి అందుతుందా లేదా అనేది చెప్పాలి. అందుకే మన రాష్ట్రంలో పేదరికం ఇలానే ఉన్నది, పర్ క్యాపిటాలో మాత్రం మన రాష్ట్రం 6వ స్థానంలో ఉన్నది.

4.10 సా. కాబట్టి, జిఎస్‌డిపిది కూడా అదే పరిస్థితి. జిఎస్‌డిపిలో కూడా అప్పుడప్పుడు జాతీయ జిడిపి కంటే మనం బాగున్నట్లుగా కనబడతాము. దేశంలో కూడా అదే సమస్య, రాష్ట్రంలో కూడా అదే సమస్య. కేవలం ఆ లెక్కల ద్వారా మనది ధనిక రాష్ట్రమా? పేద రాష్ట్రమా అనే లెక్కలు వేసి ఈ రాష్ట్రంలోనూ, ఈ దేశంలోనూ పేదవారికి అన్యాయం చేసేటువంటి పద్ధతుల్లో ఈ ప్రభుత్వాలు, బడ్జెట్‌లు, ఈ రూపకల్పనలు ఉన్నాయని చెప్పి నేను భావిస్తున్నాను.

అదేవిధంగా ధనిక రాష్ట్రమా, పేద రాష్ట్రమా అనేది దేనినిబట్టి లెక్కవేస్తారు అధ్యక్షా? ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య గారు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు వారిని నేను ఒక ప్రశ్న అడిగాను. నేను అప్పుడు మొదటిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాను. మన రాష్ట్రం ధనిక రాష్ట్రమని ఎలా చెప్పవచ్చు అని ఆయనను అడిగాను. అడిగితే, రెవెన్యూ సర్‌ప్లస్ నాలుగేళ్లుగా కంటిన్యూగా ఉంది కాబట్టి ధనిక రాష్ట్రమని ఆయన తెలియజేశారు. అసలు రెవెన్యూ సర్‌ప్లస్‌ను బట్టి లెక్క వేయడమే unscientific(అశాస్త్రీయం). ఎందుకంటే, రెవెన్యూ ఆదాయమంటే కేంద్ర పన్నుల్లో వాటా, స్వంత పన్నులు, పన్నేతర ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు. ఇవన్నీ కలిపితేనే అది రెవెన్యూ ఆదాయం. ఖర్చులు చూసుకుంటే, ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, సబ్సిడీలు, వడ్డీలు, అసలు చెల్లింపులు. అంటే, ఇందులో మిగలాలంటే జీతాలు తగ్గిస్తే రెవెన్యూ మిగులుతుంది. పింఛన్లు తగ్గిస్తే రెవెన్యూ మిగులుతుంది. అలాగే నేను చదివినవి ఏవి తగ్గించినా రెవెన్యూ మిగులుతుంది. దానినిబట్టి, రెవెన్యూ సర్‌ప్లస్ చూపెట్టవచ్చు. కానీ, అలా రెవెన్యూ సర్‌ప్లస్ చూపిస్తే అది ధనిక రాష్ట్రం ఎలా అవుతుందీ? ధనిక రాష్ట్రమంటే, రెవెన్యూ సర్‌ప్లస్, రెవెన్యూ మైనస్‌లు కాదు అధ్యక్షా.

ధనిక రాష్ట్రమంటే, ఆ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి పేదవాడికి కూడా ఈ బడ్జెట్ ఫలాలు ప్రతి చివరి మనిషికి కూడా అందుతున్నాయా? లేదా అనేది చూడాలి. దానిని బట్టి, అది ధనిక రాష్ట్రమా? పేద రాష్ట్రమా అనేది అర్థం అవుతుంది. ఈరోజు మనం ఒక జనరల్ నానుడి వింటున్నాం. సంపన్న భారతదేశం, పేద భారతదేశం అని రెండుగా వింటున్నాం. Within the same country, we have two countries. ధనిక దేశం, పేద దేశం. అలాగే నా దృష్టిలో ధనిక తెలంగాణ, పేద తెలంగాణ. ధనిక రాష్ట్రం, పేద రాష్ట్రం. నేను ఎందుకు చెబుతున్నానంటే, ఉన్నవాళ్ల దగ్గర, కొద్దిమంది దగ్గర డబ్బులు ఉన్నాయి. లేనివాళ్ల లెక్కలు తరువాత చెబుతాను. లేనివాళ్లపరిస్థితి ఏమిటీ? ఉన్నవాళ్లను చూసి తలసరి ఆదాయాలు, లేకపోతే ఎస్‌జిడిపిలు, జిఎస్‌డిపిలు వీటిని చూసే లెక్కలు వేస్తే అసలు పేదరికం అక్కడే ఉంటుంది. మనం నిజాం నవాబు కాలంలో చూశాం. నిజాం నవాబు ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు. కానీ, ఆ కాలంలో వెట్టి బానిసలు కూడా ఉన్నారు. వెట్టి బానిసలు కూడా లక్షలాదిమంది ఉన్నారు. అందుకే తెలంగాణ సాయుధ పోరాట యుద్ధం జరిగింది. ఆ పరిస్థితే ఇప్పుడు, ఈరోజు కనబడుతోంది. ప్రస్తుత కాలంలో కొత్తరకం నిజాంలున్నారు. కొత్తరకం మాఫియాలు, జమీందారులు ఉన్నారు. కొత్తరకం జాగీర్దారులు ఉన్నారు. అంతా కొత్తరకం. అంతా మాఫియాల మయం. ఉన్నవాళ్ల ఆస్తులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నాయి, పేదవాడి పరిస్థితి అలాగే ఉంది. కాకపోతే, ఇంతకుముందు రెండు జతల బట్టలు వేసుకున్న వాడు, ఇప్పుడు నాలుగు జతల బట్టలు వేసుకోవచ్చు. కానీ, పేదరికంలో మార్పు లేదు.

మరి ఎట్లా ఈ పేదరికాన్ని పారద్రోలాలి. అంటే, దానికి కొత్త పద్ధతి అవసరం ఉంది. అంటే ఇక్కడా మన రాష్ట్రానికి సంబంధించి ఇవాళ్ల ఈ అప్పులున్నాయి. వాటిని ఎలా తీరుస్తారు? ఈ బడ్జెట్‌లో ఈ డబ్బులు ఎలా సమకూర్చుకుంటారు? మళ్లీ రూ. 50,000 కోట్లు అప్పు చేస్తున్నారు. ఇటువంటివి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవు

తుంటాయి. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఉన్నప్పుడు నేను వారికి కూడా చెప్పాను. రాజశేఖర్ రెడ్డి గారు అన్ని శాచురేషన్‌కి తీసుకువెళ్లారు. ఇండ్లు శాచురేషన్, రేషన్ కార్డులు శాచురేషన్, పింఛన్లు శాచురేషన్. అంటే, అతను ఎలా చేశాడు. అంటే మనకు మనసు ఉండి కృతనిశ్చయంతో ఉంటే, దృఢసంకల్పంతో ఉంటే, సమాజానికి సేవ చేయాలనే ఆలోచన ఉంటే, గత ప్రభుత్వాల వైఫల్యాలను మనం నేర్చుకుంటే ఖచ్చితంగా ఆ హామీలను నెరవేర్చగలరనే విశ్వాసం నాకు ఉంది.

దానికి సంబంధించి, నాకున్న పరిచయాలతో కొంత వర్క్అవుట్ చేయడం జరిగింది. ఎలా చేయగలుగుతామనే నమ్మకం వచ్చిందంటే, ఎక్కువగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిశీలిస్తే. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన హామీల డబ్బులను మరికొంత పెంచుతున్నారు. ఉదాహరణకు ఇంతకు ముందు రైతుబంధు, సంవత్సరానికి రెండు పంటలకు రూ.10,000/- ఉండేది. దానిని ఇప్పుడు రూ.15,000/- చేశారు. దానిని ఎలా తగ్గించుకోవాలో ఆలోచన చేయాలని కోరుతున్నాను. రేషన్ కార్డులు కూడా మొదటి నుండి ఉన్నవే. వాటి విషయమై కొంతమంది మేధావులతో మాట్లాడిన తరువాత తెలిసింది ఏమంటే, గతంలో కంటే మూడు, నాలుగు వేల కోట్లు అదనంగా అవుతుందనేది నా అంచనా. అలాగే పింఛన్ల అమౌంట్ కూడా గతంకంటే కొద్దిగా పెరుగుతుంది. ఇంతకుముందు వెయ్యి కోట్లు ఉంటే, ఇప్పుడది రెండు వేల కోట్లు అవుతుంది. విద్యుత్ అంశాన్ని చూసుకుంటే, కొన్ని సెక్షన్లకి 250 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. దానికి గతంలో రూ.1300 కోట్లు ఉంటే, ఇప్పుడది రూ. 2,600 కోట్లు అవుతుంది. గ్యాస్‌కి అదనంగా రూ.4,000 కోట్లు అవుతుంది. ఉచిత బస్సు పథకానికి నెలకి రూ.300 కోట్లు చూసుకుంటే, సంవత్సరానికి రూ.3,600 కోట్లు అవుతుంది. ఆరోగ్యశ్రీ కింద గతంలో రూ.1,000 కోట్లు ఇచ్చేవారు. ఇప్పుడు పది లక్షలు చేశారు కాబట్టి, దానికి రూ.10,000 కోట్లు అవుతుంది. ఇండ్లు గతంలో వారు ఏమీ ఇవ్వలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ఇచ్చే లెక్క ప్రకారం చూసినా కూడా రూ.20,000 కోట్లు అవుతుంది. మహిళలకు సంబంధించి నెలకు రూ. 2,500/-. మహిళల్లో కూడా 18 ఏళ్లు దాటిన వారందరూ కూడా ఈ రూ.2,500/-లకి అర్హత ఉండరు. మహిళల్లో కూడా చాలామంది ఉద్యోగాలు చేసుకుంటున్నవారు ఉన్నారు. మహిళల్లో చాలామంది తెల్ల రేషన్ కార్డులు లేనివారు కూడా ఉంటారు. అంటే, దానికి కూడా ఒక ప్రాతిపదిక ఉంటుంది. సాధారణంగా మహిళలందరికీ రూ. 2,500/-లు ఇస్తారన్నారు కాబట్టి, దానిని ఇంకోవిధంగా వక్రీకరణ చేయడం అవసరం లేదు. అందులో కూడా వారికి ఉన్న సామాజిక స్థితి ఏమిటి? వారికి ఉన్న నేపథ్యం ఏమిటీ? ఇలా ఆ లెక్క తీసుకుంటే మహిళలది కూడా పెద్ద కష్టమని నేనేమి అనుకోను.

అలాగే రైతు బంధుకు సంబంధించి ఇంతకుముందు దాదాపు రూ.11,000 కోట్లు ఉండేది. ఇప్పుడు పెరిగిన దానితో కలిపితే రూ.16,000 కోట్లు అవుతుంది. అందులో కూడా ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనేది ఒక పరిమితి పెట్టాలి. వందల ఎకరాలు, ఫాంహౌజ్‌లు, ఇంకేదో, ఇంకేదో తీసేస్తే నాలుగైదు వేల కోట్లు మిగులుతాయి. ఆవిధంగా దానిని ప్రూనింగ్ చేసుకుంటే, జాగ్రత్తగా లెక్కలు వేసుకుంటే ఆరు గ్యారంటీలు అమలు చేయడమనేది కష్టమేదీ కాదు. ఖచ్చితంగా చేయగలుగుతారు, నాకు నమ్మకం ఉంది. ఇంకా అదనంగా డబ్బులు కావాలంటే, హైదరాబాద్ వంటి నగరాల్లో మాఫియాలుగా ఉన్నటువంటి వారి చేతుల్లో ఎన్నెన్ని భూములున్నాయో, వాటిపైన ఒక కమిటీ వేయాలి. కమిటీ వేసి సంబంధిత భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ఉదాహరణకు దేవాదాయ భూములు ఆక్రమణలో ఉన్నాయి. భూదాన భూములు ఆక్రమణలో ఉన్నాయి. వక్ఫ్ భూములు ఆక్రమణలో ఉన్నాయి. చెరువు కింద ఉన్నటువంటి భూములు ఆక్రమణలో ఉన్నాయి. ఇలా వందల, వేల ఎకరాలు ఆక్రమణలో ఉండి. అదే పెద్ద సంపదగా ఉంది. ఇందాక నేను చెప్పిన ప్రకారం రెండు తెలంగాణలు ఉంటాయి. హైదరాబాద్‌లో కూడా రెండు హైదరాబాద్‌లు ఉంటాయి. ఒకటేమో సంపన్నుల హైదరాబాద్‌గా ఉంటుంది. ఇంకోటి పేదల హైదరాబాద్. దీనిపైన ప్రభుత్వం దృష్టిపెడితే ఖచ్చితంగా ప్రభుత్వానికి డబ్బులనేది పెద్ద సమస్య కాదు.

కాకపోతే ఈ సంవత్సరం ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ సంవత్సరం constitutional compulsion కాబట్టి, బడ్జెట్ పెట్టాల్సిందే. అప్పులు ఉన్నాయని చెప్పి అన్నం తినకుండా ఉండలేము. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చడానికైనా మళ్లీ అప్పులు చేయాలి. ఆ అప్పులు కేసీఆర్ చేశారు, మాకు సంబంధం లేదని ప్రస్తుత ప్రభుత్వం చేతులు ఎత్తివేయలేదు కదా. అందువల్ల ఏదైనా మాట అన్నా, ఏదైనా విమర్శించినా ఆలోచన చేసి చేయవలసిన అవసరం ఉందని నేను మీద్వారా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా మన రాష్ట్రంలో కోటిమంది అసంఘటిత కార్మిక రంగంలో ఉన్నారు. అందులో యాభై లక్షల మంది వ్యవసాయ కార్మికులున్నారు. బీడీ కార్మికులు 4,24,000 మంది, చేనేత కార్మికులు 37,296 మంది ఉన్నారు. గీత కార్మికులు 65,668 మంది ఉన్నారు. కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్‌లో 1,25,000 మంది ఉన్నారు. అలాగే హోంగార్డులు, అంగన్‌వాడీలు, విద్యా వాలంటీర్లు, మధ్యాహ్న భోజనం, కాంట్రాక్ట్ లెక్చరర్స్, టీచర్స్, హమాలీలు, వీధి వ్యాపారులు, క్యాబ్, ట్యాక్సీ, ఆటో ఇటువంటి వారు మరొక యాభై లక్షల మంది వరకు ఉంటారు. ఏదేమైనా సరే, మన రాష్ట్ర జనాభాలో దాదాపు రెండు కోట్ల మంది ఈవిధంగా అసంఘటిత రంగం గానీ, వ్యవసాయ కూలీలుగా గానీ ఈ పద్ధతుల్లో ఉన్నారు. వీళ్లని ఎలా ఆదుకోవాలనే ఆలోచన గత ప్రభుత్వాలు చేయలేదు. ఇప్పుడైనా ఈ కొత్త ప్రభుత్వం ఇప్పటికిప్పుడే బడ్జెట్ రూపాలను మార్చమని, దానిమీద కొత్తరకంగా బడ్జెట్‌ను ఎలా తయారు చేయాలి. Person Centric Budget ఎలా తయారు చేయాలని చెప్పే సమయం ఇది కాదు.

4.20 సా. కానీ ఈ క్రొత్త ప్రభుత్వం కూడా ప్రతి మనిషికీ ఆ బడ్జెట్ ఫలాలు అందేవిధంగా ప్లాన్ చేయాల్సిన అవసరం ఉంది. నా దృష్టిలో ఈరోజు ఒక పర్మినెంటు ఎంప్లాయికి ఆయన రిటైర్ అయ్యే సమయానికి ఒక 15 నుంచి 20 వేల రూపాయలు డ్రా చేస్తారు. కానీ అంతకంటే ఎక్కువ కష్టం చేసే ఒక హమాలీలో, ఒక ఆటో డ్రైవరో, లేకపోతే ఒక భవన నిర్మాణ కార్మికుడో 60 ఏళ్ళ తరువాత ఆయనకి మిగిలేది ఏమీ లేదు. అందుకని ఒక పి.ఎఫ్ సిస్టంని ఏర్పాటు చేసి .. దానిమీద కొద్దిగా ఎక్సర్‌సైజు చేయాల్సిన అవసరం ఉంటది. పి.ఎఫ్‌లాగ ఒక సిస్టంని ఏర్పాటు చేసి వాళ్ళు పదవీ విరమణ చేసే టైంకి వాళ్ళకి 10 వేలో,15 వేలో వచ్చేవిధంగా ప్లాన్ చేయడానికి పెద్ద ఇబ్బంది ఏమీ లేదు. దీనిలో ఇన్స్యూరెన్సు కంపెనీ వాళ్ళని ఇన్వాల్వ్ చేసుకోవచ్చు.

అదేవిధంగా ఆరోగ్యానికి సంబంధించి ఒక డిజిటల్ హెల్త్ కార్డు ఇస్తామని మంచి ఆలోచన చేశారు. అది కూడా నా దృష్టిలో చాలదు. అందులో కూడా హెల్త్ ఇన్స్యూరెన్సు తీసుకున్న వాళ్ళు కార్పోరేటు వైద్యం చేయించుకుంటున్నారు. ఇన్స్యూరెన్సు సిస్టంను ఇన్వాల్వ్ చేయాలి. అందులో మెంబరుగా చేరడానికి ప్రభుత్వపరంగా మనమేమి చేయాలి. ఆ వైపుగా కూడా అవేర్‌నెస్‌ని పెంచితే ఆరోగ్యం అనేది సమస్య కాదు. అదేవిధంగా నెలకు ఎంతో కొంత ఆదాయం వచ్చే విధంగా పర్మినెంటు సోర్సు చూడాలి. మూడవది ఇళ్ళు ఏర్పాటు చేయాలి. చదువు, వైద్యం ఈ రెండు ఉచితంగా., ఉచితంగా అంటే దాదాపు 50 నుంచి 60 శాతం నిధులు కేటాయిస్తుంది. ఇందాక అక్బరుద్దీన్ గారు చెప్పారు. ఇది ఇప్పటితో అవ్వదు. ఈ లెక్కలే కాదు. ఇంకా కానరాకుండా ఈ కొత్త ప్రభుత్వం తీర్చవలసినటువంటి బాకీలు దాదాపు రూ.50,000- 60,000 కోట్లకు ఉంటాయి. అవి ఈ లెక్కల్లోకి రాలేదు. దాదాపు ఐదారు వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్సుమెంటు కానీ లేకపోతే స్కూళ్లు కానీ మీరు ఇవ్వాలి.

పంచాయితీ వర్కర్లకు గత మూడు నాలుగు నెలల నుంచీ జీతాలు లేవు. ఇంక ముందు నుంచే లేవనుకుంటా. ఆ డబ్బులెటుపోయాయయ్యా అంటే అవి మీరిచ్చేవి కాదు, ప్రభుత్వం ఇచ్చేది కాదు. పంచాయితీలు వారి పేరుతో ట్రెజరీలో వేస్తే ఆ డబ్బులు కూడా వాడుకుంటున్నారు. పోలీసులకు ఇవ్వాల్సిన డబ్బులు ఉన్నాయి. ఆ డబ్బులు కూడా వాడుకున్నట్టు ఉన్నాయి. హోంగార్డులకు ఇవ్వాల్సిన డబ్బులు ఉన్నాయి. అవి కూడా వాడుకున్నారు. ఆ డబ్బులన్నీ తీయాలి. చెల్లించవలసిన బాధ్యత మీపైన ఉంది. మీ పైన వచ్చినపుడు దాన్ని ఎలా చెల్లించాలి ఇవన్నీ కూడా

కలిపితే చాలా భారమే అవుతుంది. అయినా సరే బాధ్యతగా తీసుకుని ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉంది.

చివరిగా కొన్ని అంశాలు మీ దృష్టికి తీసుకువచ్చి నేను సెలవు తీసుకుంటాను. ఎందుకంటే ఫుల్ ఫ్లెడ్జ్‌డ్ బడ్జెట్‌లో పద్దులు అన్నీ ఉంటాయి కాబట్టి అప్పుడు అన్నీ మాట్లాడొచ్చు. సెక్రటేరియట్, అసెంబ్లీ చట్టసభల్లో, చట్టాలు చేసే మన దగ్గర ఉన్న వాళ్ళ పరిస్థితిని మనం బాగుచేస్తే అంతా బాగైనట్లే. 1,25,000 మంది ఉంటే అవుట్ సోర్సింగ్ పేరుతో వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నాయని పేపర్లో వార్తలు వచ్చాయి ఈ ఏజెన్సీ సిస్టం వల్ల. ప్రక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు జీతభత్యాలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల మధ్యలో ఉన్న ఏజెన్సీలు తినేస్తున్నారు. దానికి ఉదాహరణ ఇక్కడిదే నేను చెపుతాను. అవుట్ సోర్సింగ్ కేటగిరీకి మనం ఇవ్వాల్సింది రూ.18,759/-లు, కానీ అతనికి ఇస్తున్నది ఎంతంటే రూ.13,601/-లు. మిగిలిన డబ్బులు ఎటు పోయాయంటే మధ్యలో ఉన్న ఏజెన్సీలు లాగేస్తున్నాయి. అదేవిధంగా అసిస్టెంటు డి.ఇ.ఒల జీతం రూ.29,403/- ఉంటే రూ.17,014/-లు ఇస్తున్నారు. యుడి స్టెనో రూ.27,056/- ఉంటే వారికి రూ.19,631/- ఇస్తున్నారు. అంటే మధ్యలో ఉన్న వ్యవస్థ వల్ల దానికి ఏమి పేరు పెట్టాలో నాకు తెలీదు కానీ ఆ వ్యవస్థ వల్ల పేదవారికి ఇచ్చే జీతాలే తక్కువ, దానిలో కూడా మింగేస్తున్నారు. అధ్యక్షా మీరు ఆలోచన చేయండి, రూ.13,000/లతో ఎవరైనా ఎట్లా బ్రతుకుతారు? అంటే నేను మన కళ్ళ ముందు ఉన్న ఉదాహరణ చెపుతున్నాను. ఈ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సిస్టం పెట్టుకుంటే పరిస్థితులు ఇలాగే ఉంటాయనేది నేను మీకు మనవి చేస్తున్నాను.

చివరిగా నేను అనేది ఏంటంటే డబ్బులు కావాలి. ఎలా కావాలి, ఎక్కడ నుంచి వస్తాయి. చాలా మంది ఎగతాళి చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న ప్రధాన మంత్రి దగ్గర నుంచి మన రాష్ట్రంలో ఉన్నటు వంటి బాగా మేధావులు దీన్ని సబ్సిడీగా ఏదో సహాయం చేస్తే రేవడీ కల్చర్ అంటున్నారు. పేదవాడిని పెంచి పోషిస్తున్నారు, ఈ రాష్ట్రం బ్రతకదు, ఈ రాష్ట్రం దివాళా తీస్తుంది ఇటువంటి భాషవాడుతున్నారు. వాస్తవం ఏమిటీ అనేది మనం తీసుకుంటే పేదవాడి జిఎస్‌టి దాదాపు రూ.18 లక్షలు కోట్లు ఉంటే అందులో మూడు శాతం మాత్రమే సంపన్నులు కడుతున్నారు. మిగిలినదంతా పేదవాడు కట్టే జిఎస్‌టినే. పేదవాడు, మధ్యతరగతి లేకపోతే బిలో యావరేజ్, ఎబౌ యావరేజ్ వీళ్ళు కట్టే డబ్బులే అవి . మరి ఆ డబ్బులన్నీ ఎటుపోతున్నాయి? ఆ డబ్బులన్నీ సంవత్సరానికి ఐదు లక్షల కోట్లు , పది లక్షల కోట్లు ..పెద్ద పెద్ద కంపెనీలకేమో రాయితీలు ఇస్తున్నారు. పేదవానికి ఏదైనా గ్యారంటీలు ఇస్తే రాష్ట్రాన్ని దివాళా తీస్తున్నారు అనే మాటలు వస్తున్నాయి. అందువల్ల సంపద పన్ను అనేది మన చేతుల్లో లేకపోయినా కూడా అది కేంద్రానికి సంబంధించిది అయినప్పటికీ కూడా అవసరమనుకుంటే మన నుంచీ కూడా ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారంగా ఒక శాతం ప్రజల చేతుల్లో 45.05 శాతం సంపద ఉంటే పది శాతం ప్రజల చేతుల్లో 80 శాతం సంపద ఉంది. 50 శాతం ప్రజల చేతుల్లో కేవలం మూడు శాతం మాత్రమే సంపద ఉంది. అందువల్ల ఈ పెద్ద పెద్ద సంపన్నుల పైన ఎంతో కొంత.. కొన్ని దేశాల్లో ఆ సిస్టం ఉంది., ఎంతో కొంత సంపద పన్ను విధిస్తే పేదవాడి డబ్బులే అవి ఆ డబ్బులు తిరిగి పేదవాడికి వచ్చే వీలుంటుంది.

ఈ మధ్య ముఖ్యమంత్రిగారు ఒక ఒప్పందం చేసుకుని వచ్చారు. దానికి సంబంధించి దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో రూ.40,000 కోట్లు ఒప్పందం చేసుకున్నట్లుగా మనం పేపర్లో చదివాము, మీ అందరికీ కూడా తెలిసిందే. కొద్దిగా ఆ అప్పులు తీసుకునే దగ్గర జాగ్రత్తగా లేకపోతే మన రాష్ట్రాన్ని వాళ్లు మింగేస్తారు. పెట్టుబడులకు సంబంధించి వాళ్ళు చాలా విషను కండిషన్లు పెడుతుంటారు., కొద్దిగా జాగ్రత్తగా ఉండాలని నేను కోరుతున్నాను.

చివరగా మా శ్రీధర్ బాబుగారు కూడా ఇక్కడ ఉన్నారు. నేను చెప్పిన ఆ సూచనలను ఖచ్చితంగా చివరలో ఏదో ఫండు అందే విధంగా మీరు ఈ సామాన్య అసంఘటిత రంగ కార్మికులు, పేద వారు, హమాలీలు.. వాళ్లకి కూడా 58, 60 ఏళ్ళు నిండినాక వారిచేతుల్లో పర్మినెంటుగా ఎంతో కొంత ఆదాయం వచ్చే విధంగా చేయాలి. అది పెద్ద ఇబ్బంది కూడా

కాదు. ఇన్స్యూరెన్సు కంపెనీలతో మాట్లాడుకోవచ్చు, ప్రావిడెంటు ఫండుని ఏర్పాటు చేసుకోవచ్చు, ప్రభుత్వ వాటా కొంత, అతనిది కొంత వాటా లేకపోతే ఉపాధి కల్పించేవారి వాటా. ఈ మూడు వాటాలు కలిపితే ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉంటారని తెలియజేస్తూ , ఇందాక అక్బరుద్దీన్‌గారు చెప్పినట్లుగా ఆంధ్రా, తెలంగాణాలలో పనిచేస్తున్న ఉద్యోగులు .. మన తెలంగాణకు సంబంధించిన వాళ్ళు అక్కడ ఇబ్బంది పడుతున్నారు. అక్కడ వాళ్ళు ఇక్కడ ఉండి ఇబ్బంది పడుతున్నారు. గౌరవ మంత్రిగారు దీన్ని గమనంలోకి తీసుకోవాలని నేను కోరుతున్నాను. ఎందుకంటే చాలా కాలం నుంచీ ఈ రెండు రాష్ట్రాలు విడిపోయిన తరువాత ఇబ్బందిపడుతున్న వాళ్ళు ఉన్నారు.

ఉస్మానియా రీసెర్చ్ స్టూడెంట్స్ ఫీజులు రూ.2000/- నుంచి ఒక్కసారే రూ.1,25,000/లకు పెంచారు. వారికి ఫెలోషిప్‌లు కూడా ఇవ్వడం లేదు. దాన్ని గమనంలోకి తీసుకోవాలని కోరుతున్నాను.

గ్రంథాలయ సంస్థలో ఉద్యోగ నియామకాలు పూర్తిగా బందయ్యాయని వాళ్లందరూ రిప్రజెంటు చేశారు. దాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి. నాగార్జున యూనివర్సిటీలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ చదివిన వందల, వేలాది మంది డిగ్రీలను గుర్తించడం లేదని చెబుతున్నారు. తెలంగాణకు సంబంధించిన వాళ్ళు కూడా అనేక మంది అక్కడ చదువుకున్నారు. వారు చదివిన చదువుకి, ఆ డిగ్రీలకు గుర్తింపు లేకపోతే వారి జీవితం వృథా అవుతుంది. దానిమీద కూడా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నాను. అలాగే ఉద్యమ కాలంలో చాలా కేసులు పెట్టారు. నాకు తెలిసి ఉద్యమ కాలంలో పెట్టిన కేసులు అందరి పైనా ఇంకా ఎత్తివేయలేదు. తెలంగాణ ఉద్యమ కాలంలో కానీ, లేక పోతే ఈ మధ్య కాలంలో కానీ, గత ప్రభుత్వ కాలంలో కానీ ఆ ఉద్యమ కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలి.

4.30 సా. అలాగే ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తే, వాళ్ల పైన కూడా కేసులు పెట్టారు. అవన్నీ కూడా ఈ ప్రభుత్వం ఆలోచన చేసి, ఈ కేసుల నుండి విముక్తం చేయవలసిన అవసరం ఉంది. అలాగే అగ్రి గోల్డ్ అనేది పెద్ద స్కాం. 1995లో ఇది జరిగింది. నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలను దోపిడీ చేసినటువంటి పెద్ద స్కాం ఇది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళ్‌నాడు, కర్నాటక రాష్ట్రాల్లో దాదాపు ఐదువేల కోట్ల రూపాయలను ఆ సంస్థ వసూలు చేసింది. మన తెలంగాణ నుంచే ఐదు లక్షల మంది బాధితులు ఉన్నారు. నేను కూడా దానికి గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. మా ఖమ్మం జిల్లా వాళ్లు చాలామంది నష్టపోయిన వాళ్లలో ఉన్నారు. వాళ్లవి ఐదొందల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను. సదరు కంపెనీ ఆస్తులని వెంటనే జప్తు చేసుకోవాలి. వెయ్యి కోట్లకి పైగా ఉన్న ఆస్తులవి. కోర్టు కూడా తీర్పు ఇచ్చింది. వాళ్లందరికీ క్లియర్ చేయవలసిన అవసరం ఉంది.

అదే విధంగా పోడు భూముల కేసులు ఉన్నాయి. ఈ పోరాటంలో మేమందరం కూడా ఇన్‌వాల్వ్ అయి ఉన్నాము. అనేక మంది మీద కేసులు పెట్టారు. వాటిని ఎత్తివేయాలి. పేదల ఇళ్ల స్థలాల గురించి నేను గత పర్యాయం కూడా చెప్పాను. నా మీద కూడా నాలుగు కేసులున్నాయి. నా మీద ఉన్నా పర్లేదు కాని, పేదలు ఇళ్ల స్థలాల కోసం చేసిన పోరాటంలో పెట్టిన కేసులు ఎత్తివేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఒక హామీ ఇచ్చింది. శెట్టి బలిజ, తూర్పు కాపు లాంటి ఒక 26 కులాలున్నాయి. ఆ కులాలకి అంతకుముందు బీసి సర్టిఫికెట్ ఇచ్చేవాళ్లు. గత ప్రభుత్వ కాలంలో వారికి బీసీల క్రింద ఇవ్వకుండా, వారికున్న ఎలిజిబిలిటీ లేకుండా చేయడం జరిగింది. దాని గురించి కాంగ్రెస్ పార్టీ కూడా హామీ ఇవ్వడం జరిగింది, ఎన్నికల ముందు. కాబట్టి ఈ విషయాన్ని సీరియస్‌గా గమనంలోకి తీసుకుని, శెట్టి బలిజ, తూర్పు కాపు, ఇంకా అనేక పేర్లతో 26 కులాలు ఉన్నాయి. వాళ్లందరికీ వాస్తవ ప్రాతిపదిక పైన కుల సర్టిఫికెట్లు ఇవ్వవలసిన అవసరం ఉందని నేను కోరుతున్నాను. అలాగే ఇందాక నేను ప్రస్తావన చేసినట్లుగా పోలీసులకు టి.ఏ, డి.ఏ.లు మరియు వాళ్లకు రావలసిన ఇతర బకాయిలన్నీ ఆగిపోయి ఉన్నాయి. పంచాయతీ కార్మికులు

కూడా సమ్మక్క సారక్కకి డబ్బులు లేవని అడుగుతున్నారు. హోం గార్డుల సమస్యలు ఉన్నాయి. అలాగే మైనారిటీల సమస్యల పరిష్కారం, వారికి లోన్లు, ఇతర సౌకర్యాల కోసం మైనారిటీ కమీషన్ ఏర్పాటు చేయాలని మైనారిటీ సోదరులందరూ కోరుతున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కి సంబంధించి కిరణ్‌కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను కూడా అందులో ఉన్నాను. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ దాని నిధులు దానికే ఉండే విధంగా చేయాలి. ఇప్పుడు ఆ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పేరు కూడా పోయింది. దళిత బంధో, మరొకటో ఇటువంటివి అనేక పేర్లు వచ్చాయి. కాని ఉపయోగం జరగలేదు. కాబట్టి పాత పద్ధతుల్లోనే ఎస్సీ, ఎస్టీలకు మరల సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి, వాళ్ల నిధులు వాళ్లకు ఖర్చుచేయాలి. అది రాజ్యాంగపరంగా వాళ్లకి వచ్చినటువంటి హక్కు, ఆ నిధులు డైవర్ట్ కాకుండా కిరణ్‌కుమార్ రెడ్డిగారి ఆధ్వర్యంలో అప్పుడు చేయడం జరిగింది. అందువలన అదే పద్ధతిలో సబ్ ప్లాన్ తయారుచేయవలసిన అవసరం ఉందని కోరుతున్నాను. అదే విధంగా మైనారిటీ సబ్‌ప్లాన్ ఒకటి, బీసీ సబ్ ప్లాన్ ఒకటి ఇవన్నీ కూడా చేయవలసిన అవసరం ఉంది.

అంతిమంగా ధరణికి సంబంధించి త్వరితగతిన ఆ బంధనాల నుండి తెలంగాణకు విముక్తి కలిగించమని నేను కోరుతున్నాను. అది ఆలస్యమవుతుందనుకుంటే అందులో సెక్షన్ 26 ఉంది. దాన్ని రిపీల్ చేయవలసిన అవసరం ఉంది. ఆఖరుగా కాళేశ్వరానికి సంబంధించి ఇమ్మీడియట్‌గా దాని పైన ఏదో ఒక చర్య తీసుకుని ఖచ్చితంగా ఈ ఎండాకాలంలోపు అది పనికొస్తుందా, పనికిరాదా, లేదనుకుంటే ప్రాణహిత చేవెళ్ల నుండి పాత పద్ధతుల్లో డిజైన్ ఉంటదా, ఉన్నట్లయితే మరి ఇదేమయిపోతుంది, ఇప్పుడు పెట్టిన ఖర్చు ఏమవుతుంది ఇటువంటివన్నీ అర్జెన్సీ ఉన్న సమస్య కాబట్టి దాని పైన కూడా ప్రభుత్వం శ్రద్ధ పెట్టి తొందరగా పరిష్కారం చేయాలని కోరుతూ, మీరు ఈ సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి(వరంగల్-వెస్ట్):- శాసన సభలో మొదటిసారిగా మాట్లాడే అవకాశం కల్పించినందుకు తొలుతగా మీకు ధన్యవాదాలు. ఈ బడ్జెట్ ద్వారా అందరి కోసం మనందరం అనే స్ఫూర్తితో ప్రజల చిరకాల ఆకాంక్షలు తీర్చడానికి మంచి సమయం ఆసన్నమయిందని అనిపిస్తున్నది. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం స్థాపనకు అవకాశం వచ్చిందనడానికి ఇదొక మంచి మార్గంగా అగుపిస్తున్నది. మరి బడ్జెటును ప్రజలకు చేరువ చేస్తూ వారికి నమ్మకాన్ని కలిగించే ఈ బడ్జెట్‌ను అందరం అభినందించవలసిన విషయం ఇది. కాని శాసన సభకు మొదటిసారిగా వచ్చినప్పుడు ఎన్నో ఆశలు. ఎంతో హుందాగా ఉంటుందనుకున్నాము కాని, రెండు సార్లు, మూడుసార్లు ఎన్నికైనటువంటి శాసన సభ్యులు రెండు నెలలు కాకముందే, ఈ స్థాయిలో అసహనానికి గురవుతూ, విమర్శలు చేస్తూ, కనీసం సలహాలు, సూచనలు ఇవ్వకుండా, రావడం, రావడమే ఎక్కడ అభినందించవలసి వస్తుందో, ఎక్కడ ఇదయితోదనని, కోరం లేదని వెళ్లిపోవడం, తప్పించుకోవడానికి చేస్తున్న ఉపాయం. ఈరోజు ఇవన్నీ చూస్తుంటే చాలా బాధనిపించింది. పెద్దలు శ్రీహరిగారు మాట్లాడేటప్పుడు కూడా, వారు సీనియర్ నాయకులు, మా వరంగల్ జిల్లాలో కూడా గౌరవం ఉన్నటువంటి వ్యక్తులు.

వరంగల్‌లో ఆనకట్టలు, ఎంతో చరిత్ర ఉన్నదని వారు ఈరోజు చెప్పడం జరిగింది అధ్యక్షా. కాని అదే వరంగల్‌లో, హన్మకొండ పట్టణంలో వర్షాలు వస్తే ఆనకట్టలు, చెరువులు, కుంటలు ఈ పదేళ్ల కాలంలో దోచుకుని, ఈరోజు పట్టణం మునిగిపోవడానికి కారణమయినప్పుడూ మాట్లాడలేదు. ఆరు జిల్లాలుగా వరంగల్‌ని విభజించి, ఇరవై ఏళ్లు వెనుకకుపోయేటట్లుగా చేసినా కూడా మాట్లాడలేదు. చాలా బాధాకరం అధ్యక్షా. హైదరాబాద్ తరువాత వరంగల్ అతి పెద్ద నగరం అని చెబుతూనే వరంగల్‌కి కనీసం పోవాలంటే కూడా బ్రిడ్జి క్రింది నుండి పోయే విధంగా మార్గం ఏర్పాటుచేసినప్పుడు కూడా మాట్లాడలేకపోవడం దురదృష్టం అధ్యక్షా. కాని ఈ రోజు వరంగల్ గురించి ఇన్ని మాటలు మాట్లాడారు. ఈ పదేళ్లలో ఎప్పుడూ మాట్లాడలేక పోయారు. వరంగల్‌లో ఎంజియంలో బతికున్న మనుషులను ఎలుకలు కొరుకుతున్నప్పుడు కూడా మాట్లాడలేకపోయారు. కొత్త ఆసుపత్రిని కడుతున్నామని ఉన్న సెంట్రల్ జైలని

కూలగొట్టి, 16 అంతస్తులు, 18 అంతస్తులు కడుతున్నామని చెబితే, సంతోషపడ్డాం అధ్యక్షా. కాని ఉన్న ఎంజిఎంకే రిటైర్‌మెంట్ తప్ప, రిక్రూట్‌మెంట్ లేని ఎంజియం చుట్టుపక్కల ఉన్న పది జిల్లాలకు కన్నతల్లిలాంటిది ఎంజిఎం ఆసుపత్రి. అటువంటి ఆసుపత్రిని ఏ రోజు కూడా పట్టించుకోకుండా ఉన్నారే తప్ప, ఏమీ మాట్లాడలేదు. ఆసుపత్రి కడుతుంటే వరంగల్‌కి ఇంత పెద్ద ఆసుపత్రి వస్తున్నదని అనుకున్నారే కాని, మహారాష్ట్రలో కుదవపెట్టి 1100 కోట్ల రూపాయలు అప్పు తెచ్చి, వరంగల్ ముఖాన 400 కోట్లు కొట్టి, మిగతాది రాష్ట్రానికి పట్టుకుపోయినప్పుడు ఎంత చెప్పినా కూడా ఎవరూ పట్టించుకోలేదు. జిల్లాలో 12 మందికి పది మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు కూడా, జిల్లా గురించి పట్టించుకున్న నాథుడు లేడు. కనీసం అక్కడ నుండి టైర్ రిట్రేడింగ్ ఫ్యాక్టరీ పోతుంటే కూడా ఎవరూ కూడా మాట్లాడలేదు. మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ ఆఫీస్ పోతుంటే కూడా పట్టించుకోలేదు కాని, ఇవ్వాళ జిల్లా గురించి బాధపడుతుంటే ఆయన పెద్ద మనిషా అధ్యక్షా? చాలా బాధనిపించింది. వరంగల్ జిల్లా 20ఏళ్లు వెనుకకు పోవడానికి ముఖ్య కారణం ఈ టిఆర్ఎస్ ప్రభుత్వం. ఇవ్వాళ అక్కడ కొండ నాలుకకు మందు పెడితే, ఉన్న నాలుక ఊడిందన్నట్లు, వరంగల్ జిల్లా ప్రజలు ఊహించనట్లు పది సీట్లు మనకు ఇవ్వడానికి కారణం కూడా అదే అధ్యక్షా. ఇవ్వాళ ఒక్క ఇల్లు ఇవ్వలేదు. హన్మకొండలో ఎక్కడ ఇచ్చారో తెలవదు కాని, వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. 1200 ఇళ్లు కట్టి ఉన్నప్పటికి కూడా ఒక్క ఇల్లు ఇచ్చిన దాఖలా లేదు. ఇన్ని పాపాలకు ఒడిగట్టి, ఇవ్వాళ నీటి గురించి చిలకపలుకులు పలుకుతుంటే ఏం మాట్లాడాలో మొట్టమొదటి సారి వచ్చిన శాసన సభ్యుడిగా మాకు అర్థం కావడం లేదు.

4.40 సా. గతంలో మాజీ ముఖ్యమంత్రిగారు మాట్లాడిన సగం మాటలు వరంగల్ నుంచే మాట్లాడారు. అల్లుడు వస్తే ఎక్కడ పండుకోవాలి, గొర్రె కోసుకోవాలి, బర్రె కోసుకోవాలి, పత్రికా విలేకర్లు ఇండ్లల్లో కూర్చొని సెట్ ఆపరేట్ చేయాలని చెప్పి నేటికి పదేండ్లు అయినప్పటికీ ఒక్కటి కూడా చేయలేదు. నేను తక్కువ సమయంలో ముగిస్తాను. ముఖ్యమంత్రిగారు, శ్రీధర్‌బాబుగారు, ఉత్తమ్ కుమార్‌గారు అందరూ ఇక్కడే ఉన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరం వరంగల్ కాబట్టి ఈ వరంగల్ నగరాన్ని దత్తత తీసుకోవాలని నేను కోరుతున్నాను. గత ప్రభుత్వంలో చేసిన పాపాలను కనీసం కడుక్కునే ప్రయత్నం చేయాలని నేను కోరుతున్నాను. గత ముఖ్యమంత్రిగారికి ఎందుకంత కోపం ఉండెనో తెలియదు కానీ ఆరు జిల్లాలుగా విభజించి, కొన్ని చోట్ల ఒక నియోజకవర్గానికి ఒక జిల్లా చేశారు కానీ ఉన్న ఒక్క జిల్లా వరంగల్ అని పిలవడానికి ఇది వరకు సెంట్రల్ జైలు ఉండేది. ఆ వరంగల్‌ను కూడా నామ రూపం లేకుండా, పేరు లేకుండా అక్కడున్న సెంట్రల్ జైలును తీసుకొనిపోయారు. వరంగల్ అంటేనే కాకతీయ రాజుల చరిత్ర ఇంతకు ముందు చెప్పారు, అన్ని వాస్తవాలే కానీ ఇంత చిన్నాభిన్నం ఎందుకు చేశారో మాకు అర్థం కాలేదు. అసలు రాష్ట్రంలో ఎన్నికలకు పోవడానికి వాడుకున్న సగం మాటలు వరంగల్ జిల్లావే. మీ ద్వారా ముఖ్యమంత్రిగారికి, శ్రీధర్‌బాబుగారికి తెలియజేయునది ఏమనగా వరంగల్ జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టి, దత్తత తీసుకొని దానికి న్యాయం చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి (భువనగిరి):- అధ్యక్షా, మొదటిసారిగా అసెంబ్లీలో మాట్లాడటానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. నేను భువనగిరి నియోజకవర్గం నుంచి గెలవడం, ప్రజాపాలనలో భాగంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లో పాలు పంచుకోవడం చాలా సంతోషం. ముందుగా ముఖ్యమంత్రిగారికి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్కగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మా భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి అలాగే హైదరాబాద్‌కు సంబంధించి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ క్రింద వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేసి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ మాత్రమే కాక, మూసీ ప్రక్షాళనలో భాగంగా రెండింటి పేరు మీద వెయ్యి కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగింది. అనేక దశాబ్ధాల నుంచి మూసీ ప్రక్షాళన కోసం మేము పదేపదే మాట్లాడుతున్నాము. మూసీ మా ప్రాంతం గుండా ప్రవహిస్తున్నందున మా ప్రాంతం

మొత్తం కాలుష్యమైంది. ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యం మరియు హైదరాబాద్ నుంచి డ్రైనేజ్ ప్రవహిస్తున్నది. మూసీ ప్రక్షాళన జరుగుతుందనే నమ్మకం మాకు ఉన్నది. దీనికి వెయ్యి కోట్ల రూపాయలు మీరు బడ్జెట్‌లో కేటాయించినందుకు మీ ద్వారా ముఖ్యమంత్రిగారికి, మంత్రిగారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

అలాగే నియోజకవర్గాలకు సమాన ప్రతిపత్తి ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. ఈ రాష్ట్ర సంపద బడ్జెట్ కేటాయించినప్పుడు గత పదేండ్ల పాలనలో నియోజక వర్గాలకు నిధులు కేటాయించినప్పుడు సమాన ప్రతిపత్తి జరగలేదు. వాళ్లకు తోచిన విధంగా వాళ్ల ప్రతిష్టకోసం అంతకు ముందు పెట్టిన ప్రాజెక్టులకు పేర్లు మార్చి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చి వాళ్ల ప్రతిష్ట కోసం, ఇతర స్వలాభాల కోసం వేలాది కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగింది. మాలాంటి నియోజకవర్గాలకు మూసీ ప్రక్షాళన కానీ, మురికి నీళ్లతో వ్యవసాయం చేసే మా రైతుల కోసం వంద కోట్ల రూపాయలు అడిగితే ఇవ్వని పరిస్థితి గతంలో ఉండేది. సాగునీటి కాలువలైన బున్యాది, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలకు నిధులు కావాలంటే ఇవ్వని పరిస్థితి ఉండేది. ఒకపక్క లక్షల కోట్లు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ రోజు కుంగిపోయింది. తెలంగాణ ప్రజల డబ్బు మొత్తం కూడా గోదావరి పాలైన పరిస్థితిని మనం నేడు చూస్తున్నాము. సమాన ప్రాతిపదికనా ఒక equitable distribution of budget కూడా అవసరం ఉందని ఈ సందర్భంగా చెబుతున్నాను. అలాంటి ప్రాజెక్టు ఈ రోజు కూలిందంటే,అది కూలలేదు మీరు వెంటనే నీళ్లు ఇవ్వండని వారు అంటున్నారు. ఇక్కడ గోదావరి నీళ్లను మొత్తం మళ్లీ సముద్రంలో కలిసేటట్లు చేశారు. ప్రజల డబ్బులు గోదావరిలో పోయేట్లు చేశారు. ఇది వదిలిపెట్టి అక్కడ నల్గొండకు వెళ్లి మీటింగ్ పెట్టారు. ఈరోజు కృష్ణా నది గురించి మాట్లాడుతున్నారు. గోదావరిని ముంచారు, అక్కడి రైతాంగాన్ని ముంచారు. ప్రజల సొమ్మును ముంచి గోదావరిపాలు చేసి నల్గొండ గురించి కేసీఆర్‌గారు మాట్లాడుతున్నారు. అమాయకులుగా నేడు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారు. ఇది చాలా అన్యాయం, చాలా దారుణం. ప్రపంచంలో, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదు. నిన్న కాళేశ్వరం వెళ్లి చూస్తే అక్కడ క్రాక్‌లు కాదు, మొత్తం నిట్టనిలువునా ప్రాజెక్టు పగిలిపోయింది. నీళ్లు ఉండే పరిస్థితి లేదు. ఒకపక్క మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు నీళ్లిచ్చే ప్రక్రియ మొదలు పెట్టండంటున్నారు. అంటే అడిగేటోళ్లు లేకనే ఇలా చేస్తున్నారా? కనీసం జిమేదార్ వహించాలి కదా? ప్రాజెక్టు కూలిపోయిందని కనీసం తల దించుకోవాలి, కొద్దిగా కూడా పశ్చాతాపపడకుండా ఇంకా పైనుంచి దబాయించి మాట్లాడుతున్నారు. ఉల్టా చోర్ కోత్వాల్ కో డాంటియా అన్నట్లుగా చేస్తున్నారు. నిజంగా పెద్దలు ఉత్తమ్ కుమార్‌రెడ్డిగారు మొన్న ఇరిగేషన్ మీద చెప్పినట్లుగా నిజంగా అలాంటి పరిస్థితి ఉన్నది. ఇది చాలా అన్యాయం, దారుణం. లక్షకోట్లు ముంచి ఏమి తెలియనట్లు, ఏమి ఎరుగనట్లు ఈరోజు మాట్లాడుతున్నారంటే ఇది నిజంగా బాధాకరం. విజిలెన్స్ వారు, సెంట్రల్ వాటర్ కమిషన్ వాళ్లు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఫెయిల్ అయిందంటే పియర్స్ ఫెయిల్ అయ్యాయి. డ్రాఫ్ట్ ఫెయిల్ అయింది. ఏదైతే యాప్రాన్ ఉంటుందో స్లాబ్స్ వేస్తున్నారో ఆ స్లాబ్స్ వేయలేదు. సగం నదిలో ఆ ప్రాజెక్ట్ కంటే ముందు ఆ స్లాబ్స్ వేయాల్సి ఉంటుంది. ఆ యాప్రాన్ వేయాల్సి ఉంటుంది. అది వేయలేదు. వేయకముందే ఇనాగరేషన్ చేశారు. ఆ తర్వాత నిర్వహణ లేదు. కట్టిన మూడేళ్లకే ఆ ప్రాజెక్ట్ కూలిందంటే ఇది చాలా బాధాకరం.తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీర్లకు తెలియక కాదు, ఇంజనీర్లకు ఇండిపెండెన్స్ ఇవ్వకుండా, వాళ్ల ఆలోచనలకు తావు ఇవ్వకుండా కేసీఆర్‌గారి ఆలోచనకు తగ్గట్టుగా వారే డిజైన్ చేసి వారే కట్టినట్టుగా అనిపిస్తున్నది. వాళ్లు కాంట్రాక్టర్లో, ఎవరో కానీ ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసి, ఒక ప్రాజెక్ట్ కట్టి కూలగొట్టే పరిస్థితి తీసుకొచ్చారంటే ఇది చాలా దారుణం. ఇలాంటి పరిస్థితి రావడం మాత్రం చాలా దారుణం. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాల్సిన అవసరం ఉన్నది. తీవ్రంగా దీనిని ఖండిస్తున్నాము.

గడిచిన పదేళ్లకు సంబంధించిన విద్యారంగాన్ని చూస్తే.. కస్తూర్బా స్కూల్స్‌ను మేము పర్సనల్‌గా విజిట్ చేసినప్పుడు ఆ స్కూల్స్‌లో కనీసం బెంచీలు కూడా లేవు. అక్కడ ఒక స్కూల్‌కు వెళితే కరెంటు కూడా లేని పరిస్థితి ఉన్నది. నీటి వసతి లేదు. మా స్వంత మండలం వెలిగొండకు వెళితే అక్కడి కస్తూర్బా స్కూల్స్‌లో ఫర్నీచర్ లేదు. ఒక్క క్లాసుకు మాత్రమే ఫర్నీచర్ ఉన్నది. కస్తూర్బా స్కూల్స్ అంటే గర్ల్స్ మాత్రమే ఉంటారు కాబట్టి ఆ విద్యార్థినిలు ఏ విధంగా బాధపడుతున్నారో ఒకసారి ఆలోచించాలి. ధనిక రాష్ట్రంలో లక్షల కోట్లు అడ్డగోలుగా ప్రాజెక్టుల మీద పెడుతారు తప్ప ఇలాంటి పాఠశాలలకు ఖర్చు చేయకుండా ఆ నిధులన్నింటిని దుర్వినియోగం చేస్తారు. ఈ స్కూళ్ల వ్యవస్థ ఏ విధంగా ఉన్నది, బాలికల వసతి గృహాలు ఏ విధంగా ఉన్నాయి, గురుకులాలు ఏ విధంగా ఉన్నాయి, మోడల్ స్కూల్స్ ఏ విధంగా ఉన్నాయని ఆలోచించాలి. మోడల్ స్కూల్స్‌లో కూడా అదే విధంగా ఇబ్బందికర పరిస్థితి ఉన్నది.

మిషన్ భగీరథ విషయానికి వస్తే మా ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా నీళ్లు రావడం లేదు. సుమారు నలభై అయిదు వేల కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగింది. అంతకు ముందు కృష్ణా నీళ్లు వచ్చేవి. మిషన్ భగీరథ పెట్టారు. ఇంటింటికి నల్లా అన్నారు. ఇంకా సగం ఇండ్లకు నల్లాలు రాలేదు. పెట్టిన నల్లాలల్లో కూడా నీటి వసతి లేదు, నీళ్లు రావడం లేదు. నీటి పంపిణీనే సరిగా లేదు. సోర్స్ నుంచే సగం నీళ్లు రావడం లేదు. సుమారు 40నుంచి 50శాతం నీళ్లను మిషన్ భగీరథ అధికారులు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారు. ఆ నీళ్లు సరిపోకపోవడం వల్ల బోర్ల నుంచి వచ్చిన నీటిని నింపితే ఆ మిషన్ భగీరథ వాటర్ కూడా కలుషితమవుతుంది. ఎంతో డబ్బు వెచ్చించి తెచ్చిన నీళ్లల్లో ఒకసారి బోర్ వాటర్ అది కూడా మూసీ పరీవాహక ప్రాంతం పొల్యూషన్ నీళ్లు కలిపితే మళ్లీ నీళ్లు అంత దూరం నుంచి తెచ్చినా ప్రయోజనం లేదు. మిషన్ భగీరథ కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించినా మొత్తానికి ఫెయిల్ అయిందని, ఆ వ్యవస్థ కూడా ఫెయిల్ అయిందని చెబుతున్నాను.

4.50 సా. ఎస్టీ హాస్టల్స్ పరిస్థితి అట్లాగే ఉంది. ఈ విధంగా ఇబ్బందికర పరిస్థితులే ఉన్నాయి తప్పితే వేరే ఏం లేదు. మండలానికి 30 పడకల ఆసుపత్రి అన్నారు. అవీ జరగలేదు. ఉన్న ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు కూడా సరిగా లేవు. విద్య లేదు, వైద్యం లేదు. ఇవన్నీ కూడా ఇబ్బందికర పరిస్థితులే ఉన్నాయి. గత పదేళ్ల నుంచి అన్యాయమే జరిగింది తప్పితే ఏమి జరగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మిగిల్చింది. అప్పుల కుప్పగా చేసినప్పటికీ ఈరోజు సాహసోపేతంగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్‌రెడ్డి గారు ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. పదేళ్ల నుంచి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిధులివ్వకుండా చేశారు. ఈరోజు ఈ ఆసుపత్రులు గాని, స్కూళ్లను గాని పరిరక్షించుకోవలసిన అవసరముంది.

మా భువనగిరిలో సాగునీటి కాలువలకు సంబంధించి బడ్జెట్ పెట్టాల్సిన అవసరముంది. మూసీ ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది. మరి ఇట్లాంటివి అన్నీ కూడా చేసుకోవలసిన బాధ్యత మా అందరి మీద, ఈ ప్రభుత్వం మీద కూడా ఉన్నది. ఇంతకుముందు కూనంనేని సాంబశివరావు గారు మాట్లాడుతుంటే మంచిగా అనిపించింది. ఈరోజు వారు బాధ్యతగా మాట్లాడారు. ఈరోజు ఇది సాధ్యమా అన్నారు. నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ఇంతకుముందు కడియం శ్రీహరి గారు అన్నారు. రూ.53,000కోట్లు మేము బడ్జెటులో ప్రతిపాదించాం. ఏదైతే 6 గ్యారంటీల కోసం చేస్తామనే సంకల్పంతో.. పదేళ్లు ఒక ఇల్లు కట్టివ్వలే, ఐదేళ్లు గడిచినా రుణమాఫీ చేయలే, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇవ్వలేదు. చెప్పుకుంటూ పోతే అనేకమున్నాయి. మేము ఈరోజు రూ.53,000కోట్లు ప్రతిపాదిస్తే ఎక్కడికెళ్లి సాధ్యమని కడియం శ్రీహరి గారు ఒక నెగిటివ్ మోడ్‌తో అంటున్నారు. ఇది సాధ్యము అని కూనంనేని సాంబశివరావు గారు అన్నారు. ఆరోజు రాజశేఖర్ రెడ్డి గారు ఏ విధంగా చేశారో, ఆ విధంగా ఒక దృఢ సంకల్పం ఉండి, ఒక మానవీయ కోణం ఉంటే ఇవన్నీ సాధ్యమవుతాయి. అవన్నీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నాయి. ఇవి ఖచ్చితంగా అవలు

జరుగుతాయి, అమలు చేసే దృఢ సంకల్పం ఈ ప్రభుత్వానికి ఉంది. ప్రజాపాలనలో చెప్పాం, డేటా అంతా తీసుకున్నాం, అప్లికేషన్స్ తీసుకున్నాం, ఆ డేటా క్రోఢీకరిస్తున్నాం, డిజిటలైజ్ చేస్తున్నాం, దానిని బట్టి విధి విధానాలుంటాయి. ఆ విధంగా అర్హులందరికీ మేలు చేసే కార్యక్రమం ఇది. తప్పకుండా ఈ 6 గ్యారంటీలు ఖచ్చితంగా అమలు జరుగుతాయి. కాకపోతే కొంత వెనకా ముందు అవుతుంది తప్ప, ఈ కేసీఆర్ గారి లాగా, ఈ బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా ఐదేళ్లు, పదేళ్లు జరిగే పరిస్థితి ఉండదు. కొన్ని నెలల్లోనే ఇవన్నీ కూడా అంచెలంచెలుగా జరుగుతాయి. ఖచ్చితంగా అవుతుంది. అట్లాంటి దృఢ సంకల్పం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి ఉందని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను, ధన్యవాదాలు.

శ్రీ పాయల్ శంకర్(ఆదిలాబాద్):- ధన్యవాదాలు అధ్యక్షా. మా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల మీద మాట్లాడటానికి ఒక పది నిమిషాలు సమయమివ్వండి. ఆదిలాబాద్‌లో ఒక 5 వేల మందికి ఉపాధి కల్పించే సిమెంట్ ఫ్యాక్టరీ దాదాపు 28 సంవత్సరాల క్రితం మూతపడింది. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాలు లేవు. ఆ మూతపడ్డ సిమెంటు ఫ్యాక్టరీని తెరిపించాలని మేము అనేక ప్రయత్నాలు చేసినా కూడా 1996 సంవత్సరంలో సెంట్రల్ క్యాబినెట్ డిస్‌ఇన్వెస్ట్‌మెంటు తీర్మానం చేసిన కారణంగా తిరిగి కేంద్ర ప్రభుత్వం దాన్ని తెరువలేకపోతున్నది. ఈ మధ్యనే మేము ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో, అదేవిధంగా భారీ పరిశ్రమల శాఖ మంత్రితో మాట్లాడినప్పుడు వారు చెప్పింది ఆ ఫ్యాక్టరీని మేము రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం, గతంలో ఉన్న ప్రభుత్వం ఒక ఉత్తరం ఇచ్చింది. ఆ యొక్క సిమెంటు ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని మీరు ఉత్తరం ఇస్తే, మేము దానికి మీరు ఏమేమి సాయం చేయగలుగుతారో జవాబు చెప్పండని గతంలో ఉత్తరం రాసినా కూడా గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఏదీ కూడా స్పష్టం చేయలేదు. అందుకే మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే వెనుబడిన ఆదిలాబాద్‌లో ఉపాధి అవకాశం లేదు కాబట్టి రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇస్తానని చెబుతున్న ఆ యొక్క సిమెంటు ఫ్యాక్టరీని తీసుకుంటే 5 వేల మందికి అక్కడ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలగడమే కాకుండా ప్రతీ సంవత్సరం రాష్ట్రప్రభుత్వానికి వెయ్యి కోట్లరూపాయల ఆదాయం వచ్చే అవకాశం కూడా ఉన్నది కాబట్టి ఆ విషయం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

సార్ ఇంకొక విషయం, మా జిల్లా వెనుకబడిన జిల్లా. చదువుల తల్లి మా ఉమ్మడి 9 జిల్లాలో ఉన్నప్పటికీ, ప్రతి జిల్లాల్లో ఒక యూనివర్సిటీ ఉంది. యూనివర్సిటీ లేని జిల్లా ఏదైనా ఉన్నది అంటే అది కేవలం ఆదిలాబాద్ జిల్లానే. అక్కడ ఆదివాసులున్నారు, గిరిజనులున్నారు. గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారు కాబట్టి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ట్రైబల్ యూనివర్సిటీని ఆదిలాబాద్‌లోనే పెడతామని గతంలో చెప్పారు. తర్వాత ములుగుకు మారుస్తామన్నారు కాబట్టి దయచేసి కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా ఆదిలాబాద్‌లో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను సార్.

అదేవిధంగా ఎంత ఘోరమంటే, రాష్ట్రప్రభుత్వం నుంచి, ఏదైనా ఖజానా నుంచి అభివృద్ధి చేయడానికి వెనుకబడ్డ ఆదిలాబాద్ జిల్లాకు డబ్బులెల్లాలి. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి గారి నియోజకవర్గమైన గజ్వేల్‌కు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ నుంచి డబ్బులు తెచ్చుకున్నారు. అదేవిధంగా మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు గారి నియోజకవర్గం సిద్ధిపేటకు ఆదిలాబాద్ నుంచి డబ్బులు తెచ్చుకున్నారు. మేము ఏం పాపం చేశామో ఆదిలాబాద్ వాళ్లం? అంతకన్నా ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఆదిలాబాద్ మార్కెట్ నుంచి గుంటూరుకు నిధులు పోయినయి. ఆ విషయంలో మేము మాట్లాడుకున్నప్పుడు ఏమనుకున్నామంటే మన తెలంగాణ రాష్ట్రం మనకు వచ్చింది కదా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు ఇంకా ఏమైన నిధులు వస్తాయని అనుకున్నాం. కాని ఆదిలాబాద్ రైతులకు సంబంధించిన నిధులు ముఖ్యమంత్రి గారు ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్‌కు వెళ్లాయి, హరీశ్‌రావు గారి నియోజకవర్గానికి వెళ్లాయి. కాబట్టి

వచ్చిన ఆ నిధులన్నీ ప్రభుత్వం వెంటనే ఆదిలాబాద్ మార్కెట్‌కు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇంకొకటి సార్, ఆదిలాబాద్‌లో ఇరిగేషన్ లేదు మొత్తం వెనుకబడిన ప్రాంతం. చనాక-కొరాట అనే ప్రాజెక్టును అక్కడ నిర్మాణం చేశారు. రెండున్నర సంవత్సరాల నుంచి ల్యాండ్ అక్విజిషన్‌కు డబ్బులు కావాలని ఆదిలాబాద్‌లో ఉన్న ఇరిగేషన్ అధికారులు ఉత్తరాలు రాసినా కూడా ఇప్పటి వరకు నిధులు కేటాయించలేదు. దయచేసి ఆ చనాక-కొరాట ప్రాజెక్టుకు సంబంధించి ల్యాండ్ అక్విజిషన్ నిధులను వెంటనే కేటాయించాలి సార్.

ఇంకొక ఘోరం సార్. గొల్ల కురుమ సోదరులకు గొర్రెలు ఇస్తామని గత ప్రభుత్వం రూ.43,500/-ల డి.డి.లు కట్టించుకున్నది. గొల్ల కురుమ సోదరులు పాపం అప్పులు చేసి, బాకీలు తెచ్చి, వడ్డీలకు తీసుకొని వచ్చి కట్టారు. ఆ కోట్ల రూపాయలు ప్రభుత్వం దగ్గరే జమ చేసుకున్నారు. కాని ఇప్పటి వరకు గొల్ల కురుమ సోదరులకు గొర్రెలు ఇవ్వలేదు. దయచేసి కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి మీద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను, గత ప్రభుత్వం తీసుకున్న రూ.43,500/-లను వడ్డీలతో సహా గొల్ల కురుమలకు చెల్లిస్తూ, వాళ్లకు నగదు బదిలీ పథకాన్ని తొందరగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

చివరిగా ఒక విషయం సార్. ఆదిలాబాద్‌కు ఆర్మూరు వయా నిర్మల్ కొత్తగా రైల్వే లైన్ కొరకు గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఒక ఉత్తరం రాసింది. 50 - 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించడానికి సిద్ధంగా ఉన్నది, మీరు రైల్వేలైన్ మంజూరు చేయండని అంటే, కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ మంజూరు చేసింది. ముందేమో ఉత్తరం ఇచ్చి మేము 50 శాతం భాగస్వామిగా ఉంటాం, మీరు తొందరగా మంజూరు చేయాలని ఆరోజు మాజీ ముఖ్యమంత్రి ఉత్తరం రాసిన కారణంగా రైల్వే లైన్ మంజూరైంది. కాని కేంద్రం నుంచి 5 ఉత్తరాలు రాసినా కూడా రాష్ట్రప్రభుత్వం నుంచి సమాధానం లేదు. అందుకే కొత్తగా వచ్చిన ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నా, మీ ద్వారా ఈ ప్రభుత్వ ఆలోచన ఏమున్నదో తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

చివరిగా ఒకటి సార్, ఈ ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో స్వామి వివేకానంద బస్తీ మొత్తం కూడా అక్కడ దళితులే సార్. మొన్న 29వ తారీఖునాడు.. కొత్తగా ప్రభుత్వం వచ్చింది కూడా అప్పుడే, ఆరోజు ఎమ్మార్వో, జిహెచ్ఎంసి అధికారులు కోర్టు స్టే ఉన్నా కూడా, జబర్దస్తీగా వాళ్లు ఎంత మొత్తుకున్నా కూడా లేదనుకుండా మొత్తం ఇళ్లన్నీ కూల్చేశారు. వాళ్లకు ఆల్టర్నేటివ్ కూడా చూపించలేదు. దయచేసి అక్కడ ఉన్న వాళ్లంతా కూడా దళితులు. ఇంకొకటి, 15, 20 రోజుల నుంచి రాత్రింబవళ్లు వాళ్లు అక్కడే దీక్ష చేస్తున్నారు సార్. అధికారులెవరూ కూడా పట్టించుకోవడం లేదు. వాళ్లకు ఆల్టర్నేటివ్‌గా జాగా అయినా చూపించాలి, లేకుంటే ఉన్న జాగాను కోర్టు ఉత్తర్వుల ప్రకారం వాళ్లకు అప్పగించాలని మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. నాకు మాట్లాడే అవకాశమిచ్చినందుకు మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు.

5.00 సా. **డా. చిక్కుడు వంశీ కృష్ణ (అచ్చంపేట):** అధ్యక్షా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-2025 సంవత్సరాలకు గాను ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో వైద్యారోగ్య శాఖలకు గాను 11వేల 500 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. దీంట్లో ముఖ్యంగా కన్‌స్ట్రక్షన్ దశలో ఉన్న మెడికల్ కళాశాలలు గానీ, మెడికల్ కళాశాలలకు సంబంధించిన హాస్పటల్స్ గానీ వీటన్నింటిని ఇమ్మీడియట్‌గా టేకప్ చేస్తామని హామీ ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి నా తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రప్రజలకు కార్పోరేట్ వైద్యం అందజేస్తున్నామని చెప్పిన మాజీ ముఖ్యమంత్రి గారిని నేను రెండు క్వశ్చన్‌లు అడుగుతున్నాను. ఒకటి మీ ప్రభుత్వం కార్పోరేట్ వైద్యం అందించడం కాదు కదా కనీస వైద్యం కూడా అందించలేని దుర్భర పరిస్థితులలో వైద్య రంగం ఉండేది. ముఖ్యంగా వైద్యం అంటే వైద్యో నారయణ హరి అంటే వైద్యుడు దేవుడితో సమానం అని అంటారు.

ఈ రాష్ట్రంలో ముఖ్యమైన రంగాలు ఎడ్యుకేషన్ అండ్ హెల్త్. ఏ ప్రభుత్వమైనా ఈ రెండు రంగాలపై ప్రత్యేక దృష్టి

పెట్టి అన్ని రకాలుగా ఆదుకుంటేనే ప్రజలు బాగుంటారు. THE SOUND MIND WILL ABSORB THE SOUND MATTER.. అందుకే మన బ్రెయిన్ సరిగా పని చేయాలంటే, మన హెల్త్ సరిగా ఉండాలంటే మరి అన్ని రకాలుగా ప్రైమరీ హెల్త్ సెంటరు మొదలుకొని కమ్యూనిటీ హెల్త్ సెంటరు, ఏరియా హాస్పటల్ డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కింద వచ్చే మెడికల్ కళాశాలలు గానీ ఇవన్నీ సరిగా పని చేసినప్పుడే ప్రజలకు కావలసిన వైద్య సదుపాయాలు కలుగుతాయి, వైద్యులు కూడా ఆ రకంగా పని చేస్తారు. మరీ ముఖ్యంగా పిహెచ్‌సిలలో ఎక్కడ చూసినా డాక్టర్స్ కొరత, స్టాఫ్ నర్సుల కొరత, ఏఎన్ఎమ్‌లు గానీ, ల్యాబ్ టెక్నిషియన్స్, ఫార్మాసిస్ట్‌లు గానీ సంపూర్తిగా సిబ్బందిని, కొరత లేకుండా చూసిన దాఖలాలు గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ లేదు. ఎన్ని సార్లు చెప్పినా మాజీ ముఖ్యమంత్రి గారు గానీ, మాజీ వైద్యారోగ్య శాఖా మంత్రి గారు గానీ స్పందించలేదు. గత ప్రభుత్వంలో మేము మంచి వైద్యం అందించామని చెప్పుకొనే మాజీ మంత్రివర్యులు, మాజీ ముఖ్యమంత్రి ఇప్పటికి కూడా వారు కట్టించిన బిల్డింగ్‌లలో,ఏరియా ఆసుపత్రులు ప్రతి హెడ్‌క్వార్టర్‌లో దాదాపు 25వేల కోట్ల రూపాయలతో ఆసుపత్రులు కట్టించారు కానీ ఇప్పటికి క్యాడర్ స్ట్రెంగ్త్ లేదు. దాదాపు 16 నుంచి 26 మంది వైద్యులుండాలి 65మంది స్టాఫ్ నర్సులుండాలి, అదే విధంగా టెక్నిషియన్స్, సూపర్ స్పెషలిస్టులు ఉండాలి. సెంట్రల్ ఆక్సిజన్ ఉండాలి. అదే విధంగా ఎక్విప్‌మెంట్‌కి సంబంధించి వెంటిలేటర్ సపోర్ట్ ఉండాలి. క్యాజువాలిటీకి గానీ, ఐసియుకు గానీ వెంటిలేటర్ సపోర్ట్ ఉంటేనే ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. ఇప్పటి వరకు ముఖ్యంగా అచ్చంపేటలో గతంలో ఉన్నటువంటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ హరీష్‌రావు గారు ఆదరా, బాదరగా ఆసుపత్రిని ఓపెన్ చేసి ఇప్పటివరకు ఎటువంటి ఎక్విప్‌మెంట్‌ని సమకూర్చలేదు. దానికి తోడుగా కనీసం సెంట్రల్ ఆక్సిజన్ కూడా సరఫరా చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రితోపాటుగా ఆరోగ్య శాఖ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను. మొన్న అచ్చంపేటకు వచ్చినప్పుడు వారు వెంటనే రెండు ఆసుపత్రులను మంజూరు చేసి క్యాడర్ స్ట్రెంగ్త్‌ను కూడా ఇస్తామన్నారు. ఒక అచ్చంపేటనే కాకుండా చాలాచోట్ల ఆరోగ్య శాఖకు సంబంధించినటువంటి సమస్యలు ఏవైతే ఉన్నాయో, వాటిపై దృష్టిపెట్టకుండా కేవలం అరకొరగా ఆరోగ్య శాఖకు సంబంధించిన సమస్యలను గత ప్రభుత్వం పెడచెవిన పెట్టి ఆరోగ్యానికి సంబంధించిన పనులు ఏవీ చేయకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా ఈ రకంగా అస్తవ్యస్తంగా చేసిన ఘనత గత ప్రభుత్వానిది.

మేమందరం కూడా ఉస్మానియా మెడికల్ కళాశాలలో చదువుకున్నాం. ఈ సభలో దాదాపు 15 మంది డాక్టర్లము ఉన్నాం. అందులో 7మంది ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదువుకున్నటువంటి వారిమే ఉన్నాం. ఉస్మానియా మెడికల్ కాలేజీ అస్తవ్యస్తంగా తయారైంది. మొన్నటికి, మొన్న అక్కడికి గవర్నర్ వెళ్లి దానిని సందర్శించి వెంటనే కొత్త ఆసుపత్రి నిర్మించాలని చెప్పినప్పటికీ హెరిటేజ్ పేరుతో కట్టకూడదని కోర్టులో కేసు ఉన్నప్పటికీ కేసును పరిష్కరించకుండా, కేసుకు అటెండ్ కాకుండా, ఒకవేళ అది హెరిటేజ్ అని ఉంటే ఆ భవనాన్ని అలాగే ఉంచి, కొత్తస్థలంలో భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం దానిని పెడచెవిన పెట్టింది. కాబట్టి, ఈ ప్రభుత్వం వెంటనే ఉస్మానియా మెడికల్ కాలేజీతోపాటు, ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌ను నిర్మించాలి. దీనికి అత్యంత పేరు ఉంది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ గారు 1929లో దీనిని నిర్మించడం జరిగింది. మొదట దీనిని అఫ్జల్‌గంజ్ దవాఖానాగా పిలిచేవారు. కొన్ని లక్షల మందికి ట్రీట్‌మెంట్ ఇచ్చిన ఘనత ఉస్మానియా ఆసుపత్రికి దక్కుతుంది.

అదే విధంగా గాంధీ ఆసుపత్రిని తీసుకుంటే, 2020 జనవరి 30వ తేదీన కేరళలో కొవిడ్ వచ్చిందని అనుకున్నాం. మార్చి ఏప్రిల్ నెలలో ఇదే సభలో సీతక్క గారు మాస్కులు సప్లై చేయాలని అప్పటి ముఖ్యమంత్రిగారైన కేసీఆర్ గారిని కోరడం జరిగింది దానికి ముఖ్యమంత్రి గారు నవ్వారు మనకేంటి కోవిడ్ రావడమేంటని నవ్వుతూ ఒక చిన్న

ప్యారాసెటమాల్ ట్యాబ్లెట్ వేసుకుంటే తగ్గిపోతుంది, మాస్కులు అవసరం ఉన్నాయా అని అవహేళనగా మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి కోవిడ్-19ను మేనేజ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. గాంధీ ఆసుపత్రిని కోవిడ్ ఆసుపత్రిగా చేసి కనీసం పి.పి కిట్లు లేకుండా క్యాప్ మాస్కులు లేకుండా కనీస వసతులు కల్పించకుండా ఈ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన ఘనత గత ముఖ్యమంత్రి గారిది. ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్నారు కదా వారిని నేను ఒకటే క్వశ్చన్ అడుగుతాను. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఎంతమంది కోవిడ్ పేషంట్లు చనిపోయారని సుప్రీం కోర్టు అడిగితే ఈ ప్రభుత్వం నాలుగు వేల చిల్లర మంది చనిపోయినట్లుగా నివేదికనిచ్చారు. సుప్రీం కోర్టు కోవిడ్ సమయంలో చనిపోయిన వారికి డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తే 12వేల మందికి ఇచ్చారు. ఇంకా కొంత మందికి పెండింగులో ఉన్నది. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే గత ప్రభుత్వం ఏ రకంగా ఈ మెడికల్ అండ్ హెల్త్‌ను నిర్లక్ష్యం చేసిందనే దానికి ఇదొక మంచి ఉదాహరణ. కాబట్టి నేను ఏమంటున్నానంటే ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించి ఎక్కడెక్కడైతే బ్యాలెన్సు వర్కులున్నాయో అంటే మెడికల్ కళాశాలలు గాని ఆసుపత్రులు గాని అదే విధంగా క్యాడర్ స్ట్రెంగ్త్ గాని అదే విధంగా అన్నింటికి మించి ఈ రాష్ట్రంలో పెద్ద మొత్తంలో స్టాఫ్ నర్సుల కొరత ఉన్నది. ప్రతి ఒక్క ఆసుపత్రిలో యాభై శాతం కూడా స్టాఫ్ నర్సులు లేరు. డాక్టర్ల కొరత కూడా ఉన్నది. అదే విధంగా ఫార్మాసిస్టుల కొరత ఉన్నది కాబట్టి దయచేసి ముఖ్యమంత్రి గారికి నేను విజ్ఞప్తి చేస్తున్నదేమంటే గత ప్రభుత్వం ఎలాగో మెడికల్ అండ్ హెల్త్‌ను మరిచిపోయింది. 2001 నుంచి 2014 వరకు ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అదే ఆరోగ్యశ్రీని ఇవ్వాళ అయిదు లక్షల రూపాయల నుంచి పది లక్షల రూపాయల వరకు పెంచి ఈ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే ఒక దృఢ సంకల్పంతో మన ముఖ్యమంత్రి గారు రేవంత్‌రెడ్డి గారు ప్రకటించినందున ఇవ్వాళ రాష్ట్ర ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రెండవది ఏమిటంటే దీంతోబాటుగా ఈ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఏదైతో ఉందో దానికి అనుగుణంగా ఇంకా వీలుంటే హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను కూడా జనరల్ పబ్లిక్‌కు ఇవ్వాలి. ఎలాగూ ఉద్యోగులకైతే హెల్త్ కార్డులు ఉన్నాయి, బిపిఎల్ ఫ్యామిలీస్‌కు కూడా ప్రభుత్వం హెల్త్ కార్డులు జారీ చేస్తే బాగుంటుందని తెలియజేస్తున్నాను. అదే విధంగా ఇవ్వాళ చాలావరకు హెల్త్‌పైన మనం దృష్టిపెడుతున్నాము, అన్నింటికి మించి ఒక చిన్న విషయమేమంటే గతంలో కరోనా సమయంలో గాంధీ ఆసుపత్రిలో ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేశారు. ఆ నోడల్ ఏజెన్సీ ద్వారా చాలా మంది స్టాఫ్ నర్సులను రెక్రూట్ చేశారు. అవుట్ సోర్సింగులో తీసుకునA

ౣ ఆ స్టాఫ్ నర్సులనందరినీ ఒక సంవత్సరం క్రితం విధుల నుంచి తొలగించడం జరిగింది. కాబట్టి దయచేసి వాళ్లను ఏదో ఒక రకంగా ప్రభుత్వం వాళ్లను అబ్‌జార్బ్ చేసుకునే విధంగా ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. మొన్నటికి మొన్న ఈ రాష్ట్రంలో 6వేలకు పై చిలుకు స్టాఫ్ నర్సులను రెక్రూట్‌మెంట్ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కింది. అదే తరహాలో మళ్లీ త్వరలోనే డాక్టర్ల రిక్రూట్‌మెంటు గాని ఫార్మాసిస్టులు గాని ఏవైతే ఖాళీలున్నాయో వాటన్నింటిని భర్తీ చేస్తే నిజంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకున్న విధంగా ఆ తరహాలో మనందరం పనిచేయాల్సిందిగా కోరుతున్నాను.

5.10 సా. గతంలో చెప్పిన విధంగా ఉస్మానియా మెడికల్ కాలేజీ నిర్మాణం, గాంధీ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల నియామకం, కాకతీయ మెడికల్ కాలేజీలు ఇవన్నీ ఎప్పటినుంచో ఉన్న మెడికల్ కాలేజీలు, చాలా సదుపాయాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న వారికి చెబుతున్నాను. అక్కడ మెడికల్, పారా మెడికల్ సిబ్బంది లేరు, బిల్డింగుల కొరత ఉంది. ఆ మెడికల్ కాలేజీలకు సిబ్బంది కేటాయించాలని, అరకొరగానే ఇప్పటికీ తరగతి గదులు

ఉన్నాయి, ఇప్పటికీ చాలా ఆసుపత్రులలో క్లినికల్ క్లాసులు నడుస్తున్నాయి. 18 నెలల తరువాత క్లినికల్ క్లాసులు ప్రారంభమవుతాయి, అవి ప్రారంభం కాకముందే అక్కడ నిబంధనలకు అనుగుణంగా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా కావాల్సిన ఏర్పాట్లు చేస్తేనే మెడికల్ కాలేజీలకు గుర్తింపు ఉంటుంది, దయచేసి వాటిపై దృష్టిసారించాలని కోరుతున్నాను.

ఇరిగేషన్ విషయానికి వస్తే, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 2016వ సంవత్సరంలో మొదలు పెట్టారు, ఈ సంవత్సరం వరకు కూడా దాదాపు 60 శాతం కూడా పూర్తి కాలేదు. శాసన సభ ఎన్నికలు ఉన్నాయని రెండు నెలల ముందు అంటే ఎన్నికల ముందు ఒక పంపును ప్రారంభించారు, అది కూడా ఒక గంటసేపు ప్రారంభించి వచ్చిన నీటిని తీసుకెళ్లి అన్ని దేవాలయాలలో పెట్టి, అందరు దేవతలను పూజించి మేమే నీళ్లు ఇస్తున్నాము, మేము తప్ప ఎవరూ నీళ్లు ఇవ్వలేదు, ప్రపంచంలో ఎవ్వరూ చేయలేదు. అన్నీ దేవాలయాలకు వెళ్లి ఆ పీటిని సమర్పించి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ, ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు 60, 70 శాతం కూడా పూర్తి కాలేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదు. అచ్చంపేట, దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు ప్రత్యేక పంపు పెడతామని శాసన సభలో మాజీ ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. దానికి విరుద్ధంగా ఏదుల నుంచి దిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు తీసుకువెళుతున్నారు, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రత్యేక పంపును ఏర్పాటు చేస్తామని మళ్లీ ఏదుల రిజర్వాయర్ నుంచి లిఫ్టు ద్వారా నీటిని తరలిస్తామని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తే కెఆర్ఎంబి గత ప్రభుత్వానికి నోటీసు పంపిస్తే ఏదుల లిఫ్ట్ ప్రాజెక్టు , దిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సంబంధించినవి కావని ఒక మెమో పంపించారు. వీటిపై క్లారిటీ రావాల్సి ఉంది, ముఖ్యమంత్రిగారికి సంబంధిత మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. దిండి ఎత్తిపోతల ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులకు ప్రత్యేక పంపులు పెట్టి... 19 మండలాలు ఉన్నాయి, అచ్చంపేటలో అయిదు మండలాలు, దేవరకొండ, మునుగోడు కలిపి 14 మండలాలు మొత్తం కలిపితే 19 మండలాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రభుత్వమైనా మా అచ్చంపేట అత్యంత వెనుకబడ్డ ప్రాంతం, డ్రౌట్ ప్రోన్ ఏరియా కాబట్టి మా ప్రాంతానికి నీళ్లు ఇస్తేనే ప్రజలు సంతోషపడతారు. కృష్ణా నది అచ్చంపేట నుంచి వెళుతుంది కాబట్టి దీనిపై దృష్టిపెట్టాలని కోరుతున్నాను. గత ప్రభుత్వం మాటలు చెప్పింది కానీ, పనులు చేయలేదు. ఈ ప్రభుత్వం పనుల రూపంలో చూపించాల్సిన అవసరం ఉంది. ప్రజలందరూ కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాట తప్పదు, మడమ తిప్పదు అనే సూక్తి కట్టుబడి ఉండాలి. ప్రజలు మనపైన పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని కోరుతున్నాను. నక్కలగండి రిజర్వాయర్, ఎస్ఎల్‌బీసీ టన్నల్ నేను గతంలో మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్నాను, 2007 నుంచి 2014 వరకు 23 కిలోమీటర్ల దూరం కాంగ్రెస్ ప్రభుత్వం టిపిఎమ్ ద్వారా కెనాల్ పనులు పూర్తి చేస్తే, గత ప్రభుత్వం కేవలం 10 కిలోమీటర్లు 10 సంవత్సరాలలో సొరంగం మార్గాన్ని పూర్తి చేసింది, ఇంకా 9.5 కిలోమీటర్ల సొరంగం పనులు పెండింగ్‌లో ఉన్నాయి వాటిని వెంటనే చేపట్టాలని కోరుతున్నాను. డిస్ట్రిబ్యూటర్-1 అచ్చంపేట నియోజకవర్గానికి వచ్చే విధంగా సంబంధిత మంత్రి గారు, ముఖ్యమంత్రి గారు దానిపైన దృష్టిపెట్టాలని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

డా. పాల్వాయి హరీష్ బాబు (సిర్పూర్):- ఎన్నో ఆశలతో, ఆశయాలతో సభలో అడుగు పెట్టిన మాకు, మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన సభాధ్యక్షుల వారికి, శాసన సభకు పంపించిన సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ రెండు విషయాలను ప్రస్తావించే ప్రయత్నం చేస్తాను. మూడవ శాసన సభలో దాదాపు 57 మంది మొదటిసారి ఎన్నికైన శాసన సభ్యులు ఉన్నారు. వారందరికీ మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి By and large అందరిలో ఉన్న ఆలోచన, దానికి అనుగుణంగా అవకాశం

ఇచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అధికార పక్షం, ప్రతిపక్షంలో కలిపి మొత్తంగా 15 మంది డాక్టర్లు ఉన్నారు, ఇప్పుడే డా.వంశీకృష్ణగారు చెప్పడం జరిగింది. వీరందరి ఆలోచనలను ఉపయోగించుకొని కునారిల్లుతున్న ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిలో పెట్టడానికి బ్రహ్మాండమైన అవకాశం వచ్చింది. మా అందరి సహాయసహకారాలను ప్రభుత్వం తీసుకుంటుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి గురించి డా.వంశీకృష్ణగారు మాట్లాడడం జరిగింది. 15 మందిలో సగం మంది ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ లేదా పీజీ చదువుకున్న వారమే, ఆ ఆసుపత్రి పరిస్థితి చూస్తే చాలా బాధ కలుగుతుంది. హెరిటేజ్ బిల్డింగ్ పేరిట దాని మరమ్మత్తులను ఆపేసి కులీకుతుబ్‌షా బిల్డింగ్, బ్లాక్, OP బిల్డింగ్‌గానీ చాలా దయనీయమైన పరిస్థితులలో ఉన్నాయి. వాటికి కనీస నిర్వహణ కూడా లేదు, IP, OP పేషంట్లు చాలా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. కాబట్టి ప్రభుత్వం తప్పకుండా ఆలోచన చేసి కొత్త బిల్డింగును నిర్మించాలని కోరుతున్నాము. హెరిటేజ్ స్ట్రక్చర్ వల్ల హైకోర్టు సూచన మేరకు ఏదైనా ఇబ్బంది ఉంటే దానిని పక్కన పెట్టి మిగతా పాత నర్సింగ్ కాలేజీ భూమి, పార్కులను స్వాధీనం చేసుకొని ఒక భవ్యమైన భవనాన్ని నిర్మించాలని, దాని ద్వారా రోగులకు వైద్యం అందించాలని మేము కోరుతున్నాము.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇచ్చింది, అదే విధంగా ఫిబ్రవరి 19వ తేదీ నాడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమం ఉంటుంది. ఉత్తర తెలంగాణ నుంచి మొదలు పెడితే దక్షిణ తెలంగాణ వరకు ఆయనను గొప్పగా ఆరాధించేవారు చాలామంది ఉన్నారు. ఆయన ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశంలోని తంజావూర్ వరకు అవిభాజ్య భారతదేశాన్ని నిర్మించాడు, విదేశీ దండయాత్రల నుంచి భారతదేశాన్ని రక్షించాడు. ఆయనను గొప్పగా ఆరాధించే ప్రజలు ఈ ప్రాంతంలో ఉన్నారు కాబట్టి ప్రభుత్వం సేవాలాల్ జయంతి సందర్భంగా ఏవిధంగానైతే స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇచ్చిందో అదే విధంగా శివాజీ జయంతి నాడు కూడా Special casual leave for Government employees and holiday for students declare చేయవలసిందిగా ప్రభుత్వానికి మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఇదే కాకుండా మా ప్రాంతానికి సంబంధించిన మూడు చిన్న అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాను.

ఇప్పటికే సాంబశివరావు గారు చెప్పడం జరిగింది, పోడు రైతులపై ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులు కలిసి వేలాది కేసులు పెట్టారు. మేము కూడా 40 రోజుల పాటు పోడు రైతుల ఉద్యమం చేసి ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నాము. పోడు రైతులపై పెట్టిన కేసులను మాఫీ చేయడమూ, లేకపోతే ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి వాటిని డిస్పోజ్ చేయడమూ ఒక ఆలోచన చేయవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాను.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది, బడ్జెటులో దాని గురించి ప్రస్తావించారు. అది మా ప్రాంతంలో నిర్మించాల్సిన తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, కాబట్టి ఆ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, దానికి కేంద్రం కూడా సహకరిస్తుందని మనవి చేస్తున్నాను. ఎఐబిపి స్కీం ఉంటే ఇప్పుడు మార్చబడి ప్రధానమంత్రి క్రిష్ సంచాయి యోజన అయింది, కేంద్ర ప్రభుత్వం కూడా ఇతోధికంగా నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది. కాంగ్రెస్ ప్రాపర్ రిప్రజంటేషన్ ఇస్తే తప్పకుండా కేంద్రం నుంచి నిధులు తీసుకొని వచ్చి ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. గతంలో మంత్రి శ్రీధర్ బాబు గారు కూడా ఆ ప్రాజెక్టును సందర్శించారు. ఒకప్పుడు ఉన్న ముఖ్యమంత్రి గారు కూడా గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున మా ప్రాంతానికి రావడం జరిగింది. సభ్యులందరికీ ఈ విషయంపై పూర్తి అవగాహన ఉన్నది, ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తే ఉత్తర తెలంగాణలోని చాలా నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. మా నియోజకవర్గంలో ఎటు చూసినా నీళ్లే ఉంటాయి కానీ రైతుల పొలాలకు ఒక చుక్క నీరు రాదు, మాది దారుణమైన పరిస్థితి. మీరంతా రెండవ

పంట, మూడవ పంట గురించి మాట్లాడుకుంటుంటే మా గుండె తరుక్కుపోతుంది. మేము ఒకటో పంట కోసమే ఆకసాయి చేస్తున్నాము, వర్షాధారం పైననే ఆధారపడాల్సిన పరిస్థితి, మా ప్రాంతం గురించి కూడా ప్రభుత్వం ఆలోచించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇదే కాకుండా మాకు సిర్పూర్ పేపర్ మిల్లు కూడా ఉంది, ఇండస్ట్రీస్ మినిస్టర్ గారు సభలోనే ఉన్నారు, యాజమాన్యం స్థానికులకు పూర్తిగా ఉద్యోగాలు లేకుండా చేస్తోంది. నేను ఇదివరకే క్వశ్చన్ హవర్‌లో ప్రశ్న వేయడం జరిగింది, 80-20, 70-30, 60-40 రేషియోలో అయినా అవకాశాలు ఇచ్చే విధంగా ఆలోచన చేయాలని, స్థానికులకు ఉద్యోగాలు వచ్చే విధంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ విషయాలపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు సభా అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

5.20 సా. **శ్రీ వాకిటి శ్రీహరి(మక్తల్)**:- అధ్యక్షా, మొదటిసారి శాసనసభలో అడుగుపెట్టిన మాలాంటి వాళ్లకు మా మక్తల్ నియోజకవర్గం యొక్క 72 సంవత్సరాల కల. మొదటిసారి మక్తల్ నియోజకవర్గ ప్రజలు మక్తల్ వాసిని ఎన్నుకొని ఇక్కడికి పంపించడం జరిగింది. ఈ సభలో మాట్లాడేందుకు అడగగానే అవకాశం ఇచ్చిన మీకు, అవకాశమిప్పించిన మా శ్రీధరన్నకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. అదే మాదిరిగా మా నియోజకవర్గ ప్రజల తరఫు నుంచి కూడా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఈ శాసనసభలో కృష్ణా నదీ జలాల గురించి చాలా క్లుప్తంగా చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌మట్టి, నారాయణపూర్ తరువాత మొదటగా తాకేది నారాయణ్‌పేట్ జిల్లాలోని మక్తల్ నియోజకవర్గం కాగా మొత్తం నియోజకవర్గంలో మూడు కిలోమీటర్ల వరకు కృష్ణానది పారుతుంది. కానీ ఇప్పటివరకు కూడా సగం నియోజకవర్గంలో తాగు నీటికి, సాగు నీటికి సంబంధించిన వ్యవస్థ చాలా చిన్నాభిన్నంగా ఉన్నది. మా ప్రాంతంలో ఆనాడు రాజశేఖర్‌రెడ్డి గారు పాదయాత్ర చేస్తూ సంగంబండ అదే మాదిరిగా భూత్పూర్ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. దాని ప్రకారంగా చేసిన పూర్తి స్థాయి పనులు అయిపోయిన తరువాత గడచిన పది సంవత్సరాలుగా మిగిలిన కొద్దిపాటి పనిని కూడా పూర్తి చేయకుండా ఒక్క పైసా సంగంబండకు గాని, భూత్పూరుకు గాని ఇవ్వనందున వేలాది మంది రైతులు వాళ్ల భూములను 20వేలు, 30వేల రూపాయలకే ఎకరం భూమి ఇవ్వడం జరిగింది. ఈ ప్రాంతంలో ప్రాజెక్టు వస్తే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని వారు భూములివ్వడం జరిగింది. ఈరోజుకు కూడా ఆ భూమికి సంబంధించిన వ్యవసాయదారులకు పూర్తి లబ్ధి చేకూరనందున ఇప్పటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. 85శాతం పూర్తయిన ప్రాజెక్టులపైన గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నేను సర్పంచుగా ఉండి పోరాటం చేశాను. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేను ఎంపిపిగా ఉన్నాను ఆ తరువాత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాకు జడ్‌పిటిసి ఫ్లోర్ లీడర్‌గా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. ఈ విషయాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించినా కూడా హౌస్ అరెస్టులు తప్పిచ్చి వేరే ఇంకొకటి చేయలేదు. మా సంగంబండ అదే మాదిరిగా భూత్పూరు డ్యాములకు వస్తున్నటువంటి నీటి విషయంలో ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించే ప్రయత్నం గత ప్రభుత్వం చేయలేదు. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అంటే సంగంబండకు తొమ్మిది కోట్ల రూపాయలు అంటే మొత్తం 32 కోట్ల రూపాయలు ఇచ్చి ఉంటే అక్కడ సంగంబండ నిర్వాసితులు ఎవరైతే ఉన్నారో వారు బండను ఆపారు, ఆ బండను పగ్గొట్టడానికి ఎంత పెద్దఎత్తున ప్రయత్నాలు చేసినప్పటికీ ఇప్పటివరకు చలించలేదు. ఈ మధ్య కాలంలో ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రివర్యులకు అదే మాదిరిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారి దృష్టికి తీసుకెళితే వాళ్లు సానుకూలంగా స్పందించి ఆ విషయాన్ని ముందుకు తీసుకెళుతున్నారు.

ఇదొక్కటే కాకుండా మా దగ్గర వేలాది మంది రైతులు ఈ సంగంబండ, భూత్పూరు డ్యాముల వల్ల నిర్వాసితులై చాలా ఇబ్బంది పడుతున్న గ్రామాలు సంగంబండ కానివ్వండి ఉజ్జిలి, నేడుగొం, బైరంపల్లి, అనుగొండ, అంకెనుపల్లి,దారుపల్లి,

భూత్పూరు వంటి గ్రామాల రైతులు ఇప్పటికి కూడా ఇబ్బంది పడుతున్నారు. వాళ్లు ఏం బాధ పడుతున్నారంటే ఆరోజు కేవలం 30వేల రూపాయలకే ఎకరం భూమి ఇచ్చాం, ఇప్పుడు అదే భూమి ముప్పై లక్షలు పెట్టినా దొరకని పరిస్థితి ఉన్నది, మేం భూమి ఇచ్చినప్పటికీ ఎలాంటి ఉపయోగం జరగలేదని అన్ని కుటుంబాలు రోడ్డుమీద పడ్డాయనే విషయాలను మీద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను. అసలు నిజమైన నాయకుడు ఎవరంటే మా దగ్గరున్న అవసరాన్ని గుర్తించి ఏదైతే మక్తల్, నారాయణ్‌పేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకానిచ్చి పెద్ద హృదయంతో జి.ఓ.నెం.69ను 2,945 కోట్ల రూపాయలతో మాకు ఒక వరాన్నిచ్చిన రేవంత్‌రెడ్డి గారికి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారికి మా తరఫున, మా నారాయణ్‌పేట నియోజకవర్గం ప్రజల తరఫున సహృదయంగా ఈ వేదిక నుంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను. దీని ద్వారా మా మక్తల్ నియోజకవర్గంలో ఉన్న ఉట్కూరు గాని సగం పార్టుగా ఉన్నటువంటి మక్తల్ గాని 25వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం. అదే విధంగా నారాయణ్‌పేట నియోజకవర్గంలో 35వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం తీసుకున్నారు. ఇది 60 ఏండ్లకల, దీనిని సాకారం చేసినటువంటి మా అందరి ప్రియతమ నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదే మాదిరిగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి కూడా మా తరఫున, మా పర్ణికమ్మ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఇదొక్కటే కాదు మక్తల్ నియోజకవర్గమంటేనే అదేదో కర్ణాటక రాష్ట్రం పక్కన ఉంటుందని దాని గురించి పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. గడచిన పది సంవత్సరాలుగా ఈ విషయం గురించి ఎన్నిసార్లు జిల్లా పరిషత్తులో గాని, ఇంకెక్కడ మాట్లాడినా కూడా ఇప్పటివరకు ఒక్కసారి కూడా దృష్టిసారించలేదు. మా నియోజకవర్గానికి మూడు, నాలుగు సార్లు హరీష్‌రావు గారు వచ్చారు. గతంలో మూడు, నాలుగు సార్లు కేటీఆర్ గారు వచ్చారు, వారు వచ్చిన ప్రతీసారి ఒక్క ఇళ్లైనా ఇస్తారని అనుకుంటే ఇవ్వలేదు. మొత్తం రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టని నియోజకవర్గమేదైనా ఉన్నదా అంటే అది మా మక్తల్ నియోజకవర్గమేనని తెలియజేస్తున్నాను.

గతంలో కొన్ని నియోజకవర్గాలు పేర్లు మారాయి కానీ ఈ వ్యవస్థ పుట్టినప్పటి నుంచి కూడా మా మక్తల్ నియోజకవర్గం పేరు అలాగే ఉంది. కానీ ఇప్పటివరకు కూడా మా మక్తల్ నియోజకవర్గం హెడ్‌క్వార్టర్‌లో ఒక డిగ్రీ కళాశాల కూడా లేదు, ఒక ఫైర్ స్టేషన్ లేదు, ఒక సబ్ స్టేషన్ లేదు, అఫీషియల్‌గా ఎలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలన్నా ప్రభుత్వం నుంచి ఒక చిన్న బిల్డింగు కూడా లేదంటే ఇది మా దౌర్భాగ్యం. ఇప్పటికైనా సరే మా నియోజకవర్గానికి మా నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి గారు ముఖ్యమంత్రి కావడం మాకు అదృష్టం. మా దగ్గరున్న ఏడు మండలాలు ఆత్మకూరు, అమరచింత, నర్వ, ఉట్కూరు, మక్తల్‌లు ఎన్నో సంవత్సరాల నుంచి మా నియోజకవర్గాన్ని రెండు భాగాలుగా విభజించారు. మా నియోజకవర్గాన్ని ఆత్మకూరు, అమరచింతను వనపర్తి జిల్లాలో కలిపారు. అక్కడ ఎన్నో సంవత్సరాల నుంచి అడుగుతున్న కోరిక ఏమిటంటే ఖచ్చితంగా ఆత్మకూరును రెవెన్యూ డివిజన్ చేయాలని అడుగుతున్నాము. దాని మీద కూడా దృష్టి సారించలేదు. అదే విధంగా మక్తల్ నియోజకవర్గమైన మక్తల్ హెడ్‌క్వార్టర్‌ను కూడా గత ముప్పై సంవత్సరాలుగా మక్తల్‌ను కూడా రెవెన్యూ డివిజన్ చేయాలని అందరు పోరాటం చేస్తున్నారు. ఎన్ని సంవత్సరాలుగా పోరాటం చేసినా గత ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. అదే మాదిరిగా అన్నింటికి మధ్యలో ఉన్న నర్వ మండలం హెడ్‌క్వార్టర్‌లో ఒక ఇంటర్మీడియట్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు ప్రస్తావించినా దానిమీద దృష్టి సారించలేదు. అదే మాదిరిగా అమరచింతలో ఎక్కువగా ఉండేది బీడీ కార్మికులు మరియు నేత కార్మికులు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా కూడా బీడీ కార్మికులకు గాని, నేత కార్మికులకు గాని ఎలాంటి లబ్ధిని గత ప్రభుత్వం చేకూర్చకుండా అమరచింత మండలాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఉట్కూరు మండలానికి జి.ఓ.నెం.69 ద్వారా వచ్చే నీళ్లు తప్ప వట్టి గడ్డగా మిగిలిపోయింది. ఆ ఉట్కూరును కూడా సహృదయంతో ఇక్కడ ఉన్న బీడీ

కార్మికుల గురించి కూడా ఆలోచన చేయాలని కోరుతున్నాను. ఇదొక్కటే కాకుండా కృష్ణా, మాద్గూరు మండలాలలో కొంత ఇంటిగ్రేటెడ్ పొలాలున్నాయి. ఆ ప్రాంతంలో వేర్‌హౌస్‌లు, పెద్ద పెద్ద గోదాములు కావాలి, వరి పంట పండగానే పెద్ద పెద్ద హార్వెస్టర్లతో కట్‌చేసి ఎక్కడికక్కడ అమ్ముకునే పరిస్థితి రైతులకు దాపురించింది. పండించిన పంటలకు కొంత రేటు వచ్చేవరకు ఆపుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ విషయాలన్నింటిని ఈ సభ దృష్టికి ఎందుకు తీసుకొస్తున్నానంటే గతంలో ఎన్నిసార్లు ఈ విషయాలపై మాట్లాడినా ఎక్కడా గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చిన్న చిన్న విషయాలను కూడా మరీ విచిత్రమైన సంఘటన ఏమిటంటే నేను ఎంపిటిసిగా ఉన్నాను, జడ్‌పిటిసిగా ఉన్నప్పుడు డి.కె. అరుణమ్మ గారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. మేమందరం కలిసి గోపులారం పంప్‌హౌస్‌ను టెస్ట్ రైడ్ చేసి నీళ్లను రైతులకిచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన తరువాత, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏం చేశారంటే మేం చేసిన కార్యక్రమాన్నే నేమ్ ప్లేట్లు ఛేంజ్ చేసి మరొక్కసారి హరీష్‌రావు గారు ఆ కార్యక్రమాన్ని చేయడానికి పనికొచ్చింది తప్ప ఎక్కడ కూడా మక్తల్ నియోజకవర్గం బాగోగుల గురించి అడిగిన పాపాన పోలేదు. ఆత్మకూరు, అమరచింత, నర్వ, ఉట్కూరు, మక్తల్, మాదనూరు, కృష్ణా వంటి ఏడు మండలాలకు సంబంధించిన అన్ని విషయాలను గురించి ప్రస్తావన చేసి ప్రతిసారి మక్తల్‌లో ఏం జరిగిందంటే ఏదైనా కార్యక్రమం గురించి అడుగుదామని అనుకునేసరికి హౌస్ అరెస్టులు చేసేవారు. సుమారు 72సార్లు హౌస్ అరెస్టులు అయిన తరువాత కూడా ఖచ్చితంగా పోరాటం చేయడానికి ముందుకు రావాల్సి వచ్చింది. మక్తల్ నియోజకవర్గం కూడా ఈ తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నది, ఆ మక్తల్ నియోజకవర్గాన్ని కూడా చూడాల్సిన బాధ్యత గత ప్రభుత్వానికి ఉండింది కానీ ఆ విధంగా చూడకుండా నిర్వీర్యం చేసింది. మక్తల్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమాన్ని తీసుకున్నా నేను ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను అభివృద్ధి జరిగే ప్రతి కార్యక్రమంలో మా నియోజకవర్గం చివర్లో ఉండిపోయింది. అడిగేవారు లేక, అడిగితే చేసేవాళ్లు లేక మక్తల్ నియోజకవర్గాన్ని పూర్తిగా మర్చిపోయారు. కాబట్టి దయచేసి ఈసారైనా ఖచ్చితంగా మక్తల్ నియోజకవర్గాన్ని ఏ విధంగానైతే జి.ఓ. నెం.69ను ఇచ్చి మా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారో అదే మాదిరిగా ఏవైతే ముంపు గ్రామాలున్నాయో ఆ రైతుల పట్ల కూడా సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ పెద్దలకు హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియ జేసుకుంటూ, ఆ రైతుల పక్షాన, ముంపు గ్రామాల పక్షాన మీకందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటూ వీలైనంత తొందరలో ముంపు గ్రామాలకు సంబంధించి రావలసిన అన్ని బెనిఫిట్స్‌ను వీలైనంత తొందరగా ఇవ్వాల్సిందిగా కోరుకుంటూ ముగిస్తున్నాను.

MR.SPEAKER:- Discussion on Budget is over. Reply on the discussion on the Annual Financial Statement (Budget) (Vote-on-Account) for 2024-25 and also the Supplementary Estimates of Expenditure for 2023-24 will be given by the Dy. Chief Minister tomorrow.

The House is adjourned to meet again at 10.00 a.m. tomorrow, the 15th February, 2024.

(The House then adjourned at 5.29 p.m. to meet again on 15th February, 2024)

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of
Business in the Telangana Legislative Assembly and Printed
at Assembly Press, Public Gardens, Hyderabad."